# మానవుని మరో మజిలీ

బోయి భీమన్న

## ఒక మాట

ఆనందములో పుట్టి, అడుగడుగునా ఆనందమే దర్శకత్వం వహించి నడుపుతుండగా, ఆనందమే లక్ష్యంగా మానవుడెలా ముందుకు సాగుతున్నాడో - ఒక ఆనందమయ రీతిలో చూపడం ఈ దృశ్యకావ్యం వుద్దేశం.

ప్రకృతి విజ్ఞానం ఎంత పెరిగినా, అదేమిటో తెలుసుకోగలడే గాని, ఎందుకో తెలుసుకోలేడు మానవుడు! ప్రకృతి గర్భంలో ఒక అంశగా పుట్టి పెరుగుతున్న వాడు, ప్రకృతి మూలాన్నే తెలుసుకోదలచడం, తనను తాను తినేసి, ఇంకా రూపంతో మిగిలి వుండదలచడమే!

రెండు సర్పాలు ఒకదాని తోక నొకటి గ్రహించి మ్రింగుతూ, ఒకదానొక్కటి పూర్తిగా మ్రింగివేయడం ఎంత సాధ్యమో - ప్రకృతి తత్వాన్ని తెలుసుకోవడం కూడ మానవుడి కంతే సాధ్యం. మనిషి కడుపులోని నులి పురుగు మానవ స్వరూప స్వభావ నిర్ణయం కోసం పరిశోధన చెయ్యడం వంటిదే, విశ్వ గర్భంలోని మానవుడు చేసే విశ్వపరిశోధన.

మానవుని తాత్కాలిక దైనందిన అవసరాలకు, సౌకర్యాలకు, వినోదాలకు ప్రకృతి శక్తుల్ని వాడుకోవడం వరకే శాస్త్ర విజ్ఞానం ఉపయోగపడేది. అంతకు మించి అదెంత పెరిగితే, అంత భారం మానవ జాతి మనుగడ కది!

ఒక్క పరమాణువును పగలగొట్ట గలిగినందుకే వొళ్లు తెలియని గర్వంతో పైశాచిక నృత్యం చేస్తున్నాడు మానవుడు. క్షణానికి ఎన్ని కోట్ల పరమాణువులు పగిలితే ఒక్క స్వయం చోదిత జీవాణువు ఉద్భవిస్తున్నదో, క్షణానికి అలాంటి ఎన్ని కోట్ల జీవాణువులు పగిలితే తన హృదయం స్పందించి, బుద్ధి పనిచేస్తున్నదో వూహించనైనా కలడా?

ఇంత మహా విశ్వం, ఇన్ని కోట్ల జీవరాశులు, మానవ కోట్లు పుట్టి, పెరిగి, పని చెయ్యడానికి నిత్యం ఎంత పరమాణు శక్తి వినియోగించబడుతున్నదో! అట్టి మహాశక్త్యుత్పా దక పరమ కేంద్రం ఎక్కడ వున్నదో! దాని డైరెక్టరు ఎవరో! ఎంతటి వాడో!

ప్రకృతి పుట్టుకను గురించి, మానవుని అవతరణను గురించి, ఈ నాటకంలో నేను చేసిన వూహ సత్యానికి, ధర్మానికీ అనుగుణమైనట్టిదే; కేవల కల్పనా చమత్కృతి మాత్రమే కాదు. సత్యం ఎంత సుందరమో, ధర్మం ఎంత ఆనందకరమో చూడడానికి ప్రగాఢమైన అంతర్దృష్టి అవసరం. జిజ్ఞాస, నిరంతర పరిశీలన, ఏకాగ్ర భావన వున్నప్పుడే సాధ్యం.

ఈ గేయ నాటకంలో, ఒక్క స్వయం ప్రభ పాత్రను ఈ దృష్టితో చూస్తే చాలు. తక్కినదంతా సులభ గ్రాహ్యమే.

సంగీత నృత్య రూపకంగా ప్రదర్శించడానికి వీలుగా, ఏ రంగానికారంగం భావసమగ్రంగా వుండేటట్టు కొంత శ్రద్ధ వహించాను. పూర్వాపరాల వివరణతో, ఏ ఒక్క రంగాన్నైనా విడిగా ప్రదర్శించవచ్చు - సంగీత నృత్యరూపకంగా. అందుకే, పాడుకోడానికి వీలైన సాధారణ గేయ ఛందస్సులనే వాడాను ఇందులో.

నలభై ఏండ్ల క్రితం ప్రారంభించి, ఐదేండ్ల క్రితం వరకు, తోచినప్పుడెల్లా మార్పులు చేసుకొంటూ వచ్చిన నాటకం ఇది. సంగీత సాహిత్యాలకు సమానమైన ప్రాధాన్యం ఇచ్చానిందులో. సృష్టి జరిగిన తీరును ఊహించి, మానవుని క్రమ వికాసాన్ని వైజ్ఞానిక దృష్టితో అణుయుగం వరకు వర్ణించి చెప్పాను - నేను దర్శించిన విధంగా.

ఈ గేయ దృశ్య కావ్యాన్ని పూజ్యపాదులైన మాన్య శ్రీ డాక్టర్ బెజవాడ గోపాలరెడ్డి గారికి అంకితం ఇస్తున్నాను - భక్త్యభివందనాలతో.

దీన్ని రమారమి సంవత్సరమున్నర పాటు సీరియలుగా ప్రకటించిన స్రవంతి పత్రికా సంపాదకులకు - ముఖ్యంగా - శ్రీ లక్ష్మీనారాయణ శర్మ, శ్రీ సి.నారాయణరెడ్డి, శ్రీ గిడుగు రామమూర్తిగార్లకు, సులేఖా నికేతనం వారికి, కృతజ్ఞుణ్ని.

-రచయిత

## సమర్పణ

# డాక్టరు బెజవాడ గోపాలరెడ్డి గారికి

శ్రీ మంతమౌ మూర్తి
హేమగిరి శిఖరమే !
దరహాస మది శార
దా సమాదరణ మే !

గోపాల రెడ్డ్యగ్రణి !
సాహితీ
భూపాల దివ్యన్మణి !

నృత్య సంగీత సా
హిత్య చిత్రకళా స
రస్వతీ పుంభావ
రాజ రాజేశ్వరా !

గోపాల రెడ్డ్యగ్రణి !
సాహితీ
భూపాల దివ్యన్మణి !

ఆంధ్రరాజ్య రమా చి
దంభో నిలయ రాజ !

సర్వ భారత రాజ్య
సంస్కృతీ సమ్రాట్ట !

గోపాల రెడ్డ్యగ్రణి !
సాహితీ
భూపాల దివ్యన్మణి !

రవి కవీంద్రుని ప్రేమ
దివి భువీ కృతి నెల్ల
ఆంధ్రీకృతి యొనర్చి
అమృత నిధి వగు సుధీ !

గోపాల రెడ్డ్యగ్రణి !
సాహితీ
భూపాల దివ్యన్మణి !

సాహిత్యకాడమీ
సారథివి ! సారథివి !
సారజ్ఞ జనకోటి
సన్నిధివి ! పెన్నిధివి !

గోపాల రెడ్డ్యగ్రణి !
సాహితీ
భూపాల దివ్యన్మణి !

ఎనమండ్రె కృష్ణ రా
రాయని కొల్వులో కవులు,
అఖిల భారతము నీ
యాస్థానమే నేడు !
గోపాల రెడ్డ్యగ్రణీ !
సాహితీ
భూపాల దివ్యన్మణీ !

నవరసాభరణ నా
నవకావ్య నందన,
కావ్యలోకాలోక
కళ్యాణ కాంచన !

గోపాల రెడ్డ్యగ్రణీ !
సాహితీ
భూపాల దివ్యన్మణీ !

అందుకొను మిదె మదీ
యానంద రసకలశి.
అఖిలాంధ్ర సారస్వ
తా స్థాన ముఖ పీఠి !

గోపాల రెడ్డ్యగ్రణీ !
సాహితీ
భూపాల దివ్యన్మణీ !

–బోయి భీమన్న

## పాత్రలు

| | | | |
|---|---|---|---|
| 1. | నన్య | : | క్షేత్రయ్య కుమార్తె |
| 2. | క్షేత్రయ్య | : | కృషీవలుడు |
| 3. | భూలక్ష్మి | : | నన్య తల్లి |
| 4. | భోగయ్య | : | క్షేత్రయ్య మిత్రుడు |
| 5. | ఆశావతి | : | భోగయ్యభార్య |
| 6. | మేధానిధి | : | ఆశావతి కుమారుడు |
| 7. | ధనరాజు | : | మేధానిధి దాయాది |
| 8. | స్వయంప్రభ (అన్నపూర్ణ, శ్యామల, శశికళ, కాంతామణి, ధనలక్ష్మి రూపాలతో కూడ) | | |
| 9. | సూరన్న | | |
| 10. | చంద్రన్న | | |

మరియ కొందరు ప్రజలు.

## మొదటి రంగం

(అనంతమైన అవకాశం. వెలుగు చీకటి కాని పలచని పాల వెన్నెల కాంతి రంగంనిండా వ్యాపించి వుంది. ఆ కాంతి హేమంత ప్రభాతంలోని పొగమంచు వలె దట్టంగా వుంది. రెప్పపాటు కాలంలో రంగం నడిబొడ్డు కొంచెం ఎరుపెక్కింది. క్రమంగా అది కెందామర వలె వికసించింది. అందులో నుంచ స్వయం ప్రభాదేవి ఆణిముత్యం వలె ఆవిర్భవించింది. ఎప్పటినంచో అస్పష్టంగా, ఆనందకరంగా వినిపిస్తున్న ఒక శ్రావ్య నాదం ప్రణవ నాదంగా రూపొందింది. చుట్టూ వున్న సంధ్యారుణకాంతి ఆమె ధవళాంగకములపై ఎర్రగులాబీ రంగు చీరగా అలుముకొంది. ప్రణవ ప్రణయ సౌందర్య సమన్వయ స్వరూపమైన స్వయంప్రభ రాగస్రవంతిగా రంగంలో నర్తించసాగింది.)

స్వయంప్రభ :

అమచేతి ఉమచేత
మమతనై మెరిశాను,
ప్రణవ చేతన నుండి
ప్రణయమై విరిశాను.

నీ గుండెనై యింక నినదింతురా, స్వామీ !
నీ నిండ స్వప్నాలు నిర్మింతురా !
తావిగా నిను వలచి
పూవునై వికసింతు,
తేనెగా నిను పిలిచి
తీయమై ప్రవహింతు,
నీ వలపునే గ్రోలి జీవింతురా, స్వామి !
నీ లీలతో నేల పాలింతురా !
చీకట్ల యొడిలోన
చిరుత సంజను నేను

నీ వెలుగు జల్లుకై

నిండు టంజలి నేను,

నీ మూర్తి నాలోన నిలిపేనురా, స్వామి !

నీ ముద్దుతో జగము నింపేనురా !

(స్వయంప్రభ అంజలి ఘటించింది. అరుణ సంధ్యా కాంతుల బిగి కౌగిలింతలలో చీకట్లు కరగిపోతున్నాయి. ఎర్రదామరవలె అరవిచ్చిన ఆమె అంజలిలో తారలే జారినట్టు, కైలాస శిఖరాగ్రం నుంచి చంద్రబింబమే పిండినట్టు ప్రభాత హిమబిందువులు రాలినై. ఆమె తన కరకమలపుటాన్ని హృదయానికి హత్తుకొన్నది. ఆనంద పులకిత అయింది. ఆశలు వికసించాయి. స్వచ్ఛ కాంతులు రంగంలో వ్యాపించసాగాయి. ఆమె ఉత్సాహం కట్టలు త్రెంచుకొన్నది!)

స్వయంప్రభ

ఝం– ఝం– ఝం– ఝంకారంతో

కదిలిం దదిగో కైలాసం :

ఘణ్– ఘణ్– ఘణ్– ఘణ్– ఘంటా ధ్వనితో

దుముకిం దదిగో ద్యోగంగ !

కుహ్– కుహ్– కుహ్– కుహ్– కుహూ రవంతో

వాసించిందదె వాల్లభ్యం !

చిట్– చిట్– చిట్– చిట్– చిన్మాధురితో

చిందిందదె పర సౌందర్యం !

కల కల విరిసిందదిగో విశ్వం !

జల జల కురిసిం దదిగో అమృతం !

వెల వెల బోయిం దదిగో రాత్రి !

తెల తెల వారిం దిదిగో ధాత్రి !

(ధగ ధగ మంటూ అనేక చిత్ర వర్ణాలు రంగాన్ని ముంచెత్తాయి. కుంకుమారుణ రమణీయ కాంతి ఆమె ముఖంలో నిలిచింది. ప్రమోద భారంతో ఆమె అలసిపోయింది. తృప్తితో, పరవశత్వంతో ఆమె కన్నులు నిమీలితాలు అయాయి. మంద మందంగా మనోహరంగా ఆమె లాస్యం చేయసాగింది.)

స్వయంప్రభ :

"ఓ" యనుచు నే పిలువ
"కో" యన్న దెవరో ?
"హు"మ్మనుచు నే నిలువ
"ఝు"మ్మన్న దెవరో ?
నీవటె ఓ పికమ ?
నీవటె మధుపమా ?

ముదురు చీకటి చిక్క
మున బట్టి రెవరినో ?
నెరసంజ కావి గి
న్నెను పోతు రేమిటో ?
నిన్నటోయీ రవీ ?
నిన్నటే ఓ భువీ ?

ప్రాగ్వీధిలో నేదా
ఋగ్వీణ మ్రోసె !

దిక్పరిధిలో కళా
దీధితులు కురిసె !

నాకటే యీ పిలుపు ?
నాదటే యీ మలుపు ?

(ఇంతవరకు ఒక శుక్ల కిరణం వలె నున్న స్వయంప్రభ ఇప్పుడు బాగా వికసించింది. ఒక మహోద్యమం వలె ఆమె సమున్నతురాలయింది. అరుణోదయాన్ని ప్రసవించనున్న ఉషః కాంతవలె అలసంగా నవ్వుతూ, అభ్యుదయాన్ని ఆహ్వానిస్తున్నది. రంగం ఎరుపు, నలుపు కాంతుల సమ్మర్థంలో తెల్లని కిరణాలను ప్రసరింపజేస్తూ వున్నది.

స్వయంప్రభ :

తిమిరాల కోమరు పందిరులలో, నా స్వామి !
చెలగి నీ చిరునవ్వు చివురించెరా !
నీ కోర్కె క్రొమ్మెరపు నెరసులో, నా స్వామి !
విశ్వరాజీవమే వికసించెరా !

వరదయై పారు నీ కరుణలో, నా స్వామి !
సరసమై నా గుండె స్పందించెరా !
పక్వమైయున్న నా ప్రణయాన, నా స్వామి !
రమ్యమై నీయేపె రాగించెరా !
రస్యమౌ నీ పరీరంభాన, నా స్వామి !
పులకించి భూదేవి పుష్పించెరా !
నీ రసాస్వాద నాస్ఫారమై, నా స్వామి !
శ్రీదేవిగా వెలసి క్రీడించెరా !

(రంగంలోని శోణకాంతి క్రమంగా అంతర్వాహిని కాగా, మిగిలిన వెలుగు నీడలపై ఆకుపచ్చని కాంతి పలచగా ప్రసరించింది. ఎఱ్ఱని చిగుళ్ళు, మొగ్గలు, పువ్వులు,

కాయలు, పండ్లు రంగంలో కనిపించాయి. చేపలు, తాబేళ్ళు, కోతులు, రంగు రంగుల పక్షులు సంచరించాయి. లేళ్ళు గంతులు వేశాయి. నెమళ్ళు నృత్యం చేశాయి. సెలయేళ్ళు ప్రవహించాయి. దృశ్యం ఒక వసంతకాలపు అరణ్యంగా మారింది. (శ్రావ్యధ్వనులు, మధుర సౌరభాలు, సుందర దృశ్యాలు స్వయంప్రభను పరవశిల్ల జేశాయి.)

స్వయంప్రభ :

సరస రవములతోడ
సరసీజములతోడ
మధుర మధువులతోడ
మహిత ఫలములతోడ

భువినిండ నింపాను నీ కోసమే !
దివినుండి దింపాను నీ కోసమే !

గున్నమావికి తోట,
కోకిలాయికి పాట.
తోటలో విరిదేనె,
పాటలో నెలదోనె

కల్పించి తెచ్చాను నీ కోసమే!
కళలతో వచ్చాను నీ కోసమే !

ఇంద్ర చాపము లోన
చంద్ర బింబములోన
నెమ్మి నృత్యము లోన
తమ్మి డెందము లోన

రంగులను కలిపాను నీ కోసమే !
రాగాలు నిలిపాను నీ కోసమే !

చైతన్య నాటికా
జోతిష్కవాటమ్ము
తెరిచాను – రుచులన్నీ
పరిచాను వరుసగా --

రసము లూరించాను నీ కోసమే !
రసరాణి నైనాను నీ కోసమే !

(చిత్రకాంతులతో రంగం మెరమెర మెరిసి పోయింది. నాట్యశీల అయిన స్వయంప్రభా దివ్యమూర్తి వెలిసిపోతూ, అందుండి ఒక ఆద్యమానవ స్వరూపం ఆవిర్భవించింది. ఒకటి స్త్రీమూర్తి, రెండవది పురుషమూర్తి. ఇప్పుడు రంగంలో ఈ యిద్దరే వున్నారు. స్వయంప్రభ పూర్తిగా ఇప్పటికే వెలిసి పోయింది. స్పష్టమైన మానవులిద్దరూ రంగంలో వెలిశారు. మూగ నృత్యం చేస్తున్నారు. తెరలోని ఒక పాట నృత్యాన్ని లయబద్ధం చేస్తున్నది.)

(తెరలో పాట)

ఓహో !
ఉషస్సు విరిసిం దోహో !

వెన్నెల కడలని వెన్న జిడ్డునా,
గోవును చేరిన గొల్లభామనా,
చీకటి మలచిన చెందోవ బొడ్డున
వేకువ మొలచిం దోహో !

ఓహో !
ఉషస్సు విరిసిం దోహో !

మందారామృత మకరందాలు
పారిజాత సమ పరీమళాలు
సౌగంధికా మృదు సౌందర్యాలు
సారెగ తెచ్చిం దోహో !

ఓహో !
ఉషస్సు విరిసిం దోహో !

పాల కడలిలో పాప సెజ్జపై
మేలుకొల్పు గీతాల మెచ్చి
నూతన సృష్టిని చేత నందుకొని
మాతగ వచ్చిం దోహో !

ఓహో !
ఉషస్సు విరిసిం దోహో !

పుష్ప కామినుల వాంఛలు తీరగ
పుంస్కోకిలముల పుణ్యము పండగ
ప్రణవాత్మకుడౌ బాల మానవుని
ప్రభుతకు తెచ్చిం దోహో !

ఓహో !
ఉషస్సు విరిసిం దోహో !

(ఆమె భూలక్ష్మి, అతడు క్షేత్రయ్య. ఇద్దరూ కొంతసేపు నృత్యంచేసి, ఎదురు బొదురుగా చేరి నిలిచారు. ఆమెపై పచ్చని కాంతీ, అతనిపై ఎర్రని కాంతీ పడుతూ వున్నాయి. వారిద్దరూ ఒకరి కళ్ళలోకి ఒకరు చూచుకొని పక్కున నవ్వుకొన్నారు. నవ్వులో తడిసిన వారి చూపులనుంచి కోర్కెలు కుసుమించాయి. ఆనంద మధువులు చెమరిచినాయి.

గాఢాలింగనం చేసుకొన్నారు. ప్రకృతి చల్లబడింది. ఆహ్లాదకరమైన కాంతి రంగంలో నిలిచింది. ప్రక్క నున్న చెట్లలోనుంచి ఒక సూర్యకాంత పుష్పాన్ని భూలక్ష్మి క్షేత్రయ్యకు ఇచ్చింది. అతడు ఒక అరటిపండు ఒలిచి భూలక్ష్మి నోటికి అందించాడు, ఆమె "అ" అంటూ నోరు తెరువగా అతడు "ఊ" అంటూ పుష్పాన్ని ముద్దుపెట్టుకున్నాడు. భూలక్ష్మి మువ్వలు మ్రోగినట్టుగా నవ్వింది.)

భూలక్ష్మి :

"ఆ" యంచు మున్నీట
ఆవులించిన నోరు
అక్షరాకారమే
ఆవిర్భవించె

ఆ ఆ ల అందాల
అంతరంగాలలో
శోణరాగ పరాగ
శోభ వికసించె !

మేరు గిరి శిఖరాన
మెరిసి కురిసిన వాన
అభిమత క్షేత్రాన
నభిధ పండించె !

'ఆ' లోని యాకాశ
మానంద రూపమై
తప్తలోకాల సం
తృప్తి వ్యంజించె !

క్షేత్రయ్య :

అహోహో ! ఇదేదో ఉగాదే ! చెలీ !
మహిదేవి కళ్యాణ వేదే ! చెలీ

వసంతాలు సంతోష
సంరంభ లీల
దిసంతాలతో కూడి
సేవించు నేల !

వికసించె సహకార విద్రుమా లవేనే !
ప్రకటించె పికకోటి ప్రణయా లివేనే !

సుమతోరణములు, లో
క మనోహరములు ;
ఫలరాజములు, సుధా
వన భోజనములు !

పాల పుంతలనిండ పసి వేపపువ్వు !
ఆల బాటలనిండ అందాల చెరకు !

విరచవే చిరు చేదు
విపుల మాధురుల.
కలువవే కొంగ్రొత్త
వలపు శీధువుల !

భూలక్ష్మి :

ఇలా చూడుమోయీ ! ఈ
యిలా దేవి నవ నాట్యం !

అలా చూడుమోయీ ! అదుగో

కళావాణి కలకంఠం !

తీవమీది తొలి పూవుగ

పూవుపైని చిరు తేటిగ,

తేటి గుండె తనివినుండి

తేలిపోవు వలి పాటగ !

ఆకాశపు లోయలలో

ఆడుకొనెడి చిరుమబ్బుగ,

గిరులు దూకి, దరులు తాకి,

పరువులెత్తు సెలయేరుగ !

తూర్పు కొండ గుమ్మములో

తొంగి చూచు విరసంజగ,

మావి పండ్ల రంగులలో

మోవి ముంచు మాధురిగా !

(భూలక్ష్మి దారి చూపుతూ వుండగా, వెనుక క్షేత్రయ్య ముందుకు సాగుతాడు. ఒక్కొక్క అడుగేసుకుంటూ వారు ప్రపంచ యాత్ర ప్రారంభిస్తారు. తనను అనుభవించి ఆనందించగల మానవం సముద్భవించి నందుకు ప్రకృతి సంతోషాంతరంగంతో విపుల తరులతాగుల్మకమైన కజరీ బంధం సడలిపోగా మంద మారుత రంగ భూమిపై లలిత లలితంగా లాస్యం చేస్తున్నది. పుప్పొడిని, పూలగుత్తులను వారిపై జల్లుతున్నది. మధువులను, మధుర ఫలాలను, రంగులను, రాగాలను సమర్పిస్తున్నది. ఎక్కడినుంచో స్వయంప్రభ కంఠం వారిని ముందుకు పిలుచుకు పోతున్నది.

(తెరలో పాట)

వెడలి రండు, రండోయీ, వేగం !
విశాలమోయీ, లోకం !

అడుగడుగున నిల్పి రండోయి, మీ
యనుభవ సుధావశేషం !

ఇవిగో కుడివైపున మధుర ఝరాల్
ఎడమవైపున ప్రపూర్ణ ఫలాల్

అవిగో ముందవకాశ వికాసాల్
అభ్యుదయ కళా సౌందర్యాల్ !

అంధకారమును వెనుకకు నెట్టి
అరుణ రేఖలై ముందుకు రండోయ్ !

అధి భావలతా వదన పద్మ దర
హాసముగా వికసించండోయ్ !

(పాట వెలిసిపోతూ వుండగా భూలక్ష్మి, క్షేత్రయ్యలు క్రమంగా దూరంలో కరిగిపోతారు)

## రెండవ రంగం

(కీకారణ్యం, సూర్యోదయం అవుతూవుంది. తుఫాను తరువాత ఆకాశంలో మేఘాల వలె చీకట్లు చెదురు చెదురుగా వున్నాయి. వెలుగు పూర్తిగా రాలేదు. విత్తనం అంకురంగా, అంకురం పుష్పఫలాదులుగా వికసించి, తిరిగి అనేక విత్తనాలలో విశ్వరూపం ధరిస్తుంది. మానవుడు అవ్యక్తం నుంచి బైట పడ్డాడు. స్వప్న సౌఖ్యాలను అనుభవించాడు. తాను పూర్తి మానవుడుగా రూపొందుతున్న పరిణామ కాలం నాటి వ్యక్తా వ్యక్త మధురానుభూతి నుంచి అతడింకా తేరుకోలేదు. కాని, వాస్తవిక సత్యాలు అతణ్ణి ఇప్పుడు కొంచెంగా ఎదుర్కొంటున్నాయి. జీవితావసరాలు ఇప్పుడు తన దగ్గరకు రావటం లేదు. తానే వాటి

దగ్గరకు పోవలసి వస్తున్నది. బిడ్డ ఉయ్యాల తొట్టెలో లేడు. పాడుతున్నాడు. ఆ దశలో క్షేత్రయ్య ప్రవేశిస్తాడు. ఆటవిక వేషంలో వున్నాడు. అతడు బాణం ఎక్కుపెట్టి ఒక లేడిని తరుముకొంటూ రంగంలోకి వచ్చాడు. దూరానికి గురి చూచి బాణం వదిలాడు. బాణ గతిని పరిశీలించి. పెదవి విరిచాడు. నొసలు ముడుచు కొన్నాడు. విల్లమ్ములు నేలకు విసిరికొట్టాడు. అప్పుడు భూలక్ష్మి ప్రవేశించింది. ఆటవిక వేషంలోనే వుంది. చంకను లేడి చర్మం సంచీ, చేతిలో పొడుగుపాటి వెదురుగడ వున్నాయి)

క్షేత్రయ్య

అమ్మ కందక మాయ
మయ్యింది కోడి,

అమ్మనే కొమ్ముతో
కుమ్మింది లేడి

అమ్మ వమ్మయ్యింది
ఆక లయ్యింది.

భూలక్ష్మి :

కొండమామిడి గున్న
పండు కోశాను,
చెట్టు తొర్రను తేనె
పట్టు తీశాను

అమ్మ వమ్మోగాక,
అమ్మ వమ్మోనె !

క్షేత్రయ్య :

రాతి గొడ్డలి పడును
రాలి పోయింది.
ఈటె చూచిన రూము
దాటిపోయింది.

వేట వోటయ్యింది.
వేస టయ్యింది.

భూలక్ష్మి :

చందమామను బోలు
కంద దొరికింది
మెరుపు తీగల వంటి
చెరకు చిక్కింది.

రీవేట వోటగు గాక,
పాటు వోటవునె?

క్షేత్రయ్య :

మంచు గుబ్బలి కేసి
మబ్బు పట్టింది.
చెట్టు తొర్రకు రామ
చిలుక చేరింది.

కొండ గుహలో సింగి
గుర్రు కొట్టింది !

భూలక్ష్మి :

కొయ్య గుంజలు పాతి
గూడు కట్టాను.

కొబ్బరాకులు కప్పి
గుమ్మ ముంచాను

మబ్బు పట్టును గాక
మనసు కట్టెడినె ?

(ఇద్దరు ఒక దిమ్మమీద కూర్చున్నారు. ఆమె లేడి చర్మం సంచిలో నుంచి దుంపలు, పళ్ళు తీసి అతని ముందు పెట్టింది. అతడు ఒక పండు తీసి కొరకబోతూ వుండేటప్పటికి, సమీపంలో సవ్వడి వినిపించింది. ఇద్దరూ అటుకేసి చాశారు. భోగయ్య ఆకటితో నకనక లాడుతూ, నిప్పువలె ప్రవేశించాడు.)

భోగయ్య :

ఆకలి మంటలు, ఆకలి మంటలు,
ఆకలి మంటలు, బాబయ్యా !

జానెడు పొట్టకు జాగా లే దీ
జగత్తు దేనికి ? తగలెయ్యా !

నరాలు కరకర నమిలే మంటలు.
తరాల వెంబడి తరిమే మంటలు,
అడవులు, కొండలు, అవని సమస్తం
ఆఖరువైనా ఆరని మంటలు !

లోకము చుట్టే, వ్యాకుల బెట్టే
ఆకలి మంటలు, బాబయ్యా !

భుగభుగ లేచీ, బ్రతుకును కాల్చే
అగడ్తదేనికి ? పూడ్చెయ్యా !

(భోగయ్యను గుర్తుపడతాడు క్షేత్రయ్య. ఇద్దరూ ఎప్పుడో, ఎక్కడో విడి పోయిన మానవ మిత్రులు. లేచి వెళ్ళి కౌగిలించుకొన్నాడు. భోగయ్య ఇటూ, అటూ చూశాడు. అతని కన్ను దుంపలమీద పడింది)

భోగయ్య :

క్షేత్రయ్యవా నీవు ?
క్షేమమే గంద ?

భూలక్ష్మి కాబోలు !
బుద్ధి గల పిల్ల.

లోకమంతా వెతికి
ఆకలై వచ్చాను,

కడుపు కేదో యింత
కండ పెట్టండి !

క్షేత్రయ్య :

ఆకటికి మించింది
లోకములొ ఏముంది ?

మొండి జానెడు పొట్ట
నిండి చావదు కట్ట !

పొట్టలో అడవులే
వట్టి పోయాయి,

కడుపులో కొండలే
కరిగిపోయాయి !

భోగయ్య :

ప్రొద్దువలె సాగి ని
ప్పులు చల్లు నీ పొట్ట,
జీవ జాలము లెల్ల
జీర్ణించె నీ పొట్ట,

పొగలేని కార్చిచ్చు
పొట్టలో మండగా
తనువెల్ల పొగచూరి
తగులబడి పోతోంది !

భూలక్ష్మి :

కదళీ ఫలా లివ్వి,
కర్ర పెండల మిది,
అది కొండ కొలకు తీ
యని నీటి బుగ్గ !

(భూలక్ష్మి చేతిలో నుంచి పళ్ళు అందుకొని, భోగయ్య ఆత్రంగా నోటబెట్టుకో బోయే సమయానికి, తుపాను వలె ఆశావతి ప్రవేశించింది. అటూ, ఇటూ చూచింది. సరాసరి భోగయ్య దగ్గరకు పోయి, నోటి దగ్గర పండు లాక్కొని తినేస్తున్నది. క్షేత్రయ్య దగ్గర, భూలక్ష్మి దగ్గర కలవాటిని కూడ లాక్కొన్నది. భోగయ్య చెవి పట్టుకొని కసిగా ఈడుస్తున్నది.)

ఆశావతి :

కోతలకు మొనగాడు,
కూతలకు గిజిగాడు,
చేతలకు మా బావ
కేతి గాడోయ్, దేవ !

తెలియకుండా వచ్చి
దిగమ్రింగు తున్నాడు.
పొట్ట పెండ్లామయ్యె
పొట్టి బావకు నేడు !

ఇటె వత్తునని చెప్పి
మటుమాయ మైనాడు.
ముష్టి కోపము చేరి
మోదపడు తున్నాడు !

దోచి తెచ్చిన దెల్ల
దోసిట్లొ పొయ్యాలి,
కాకున్న మగవాని
కాకులకు వెయ్యాలి !

భోగయ్య :

పొడవ రాకే, నాతి !
ముడవకే మూతి !

నీ కన్న లోకాన
నాకెవ్వరే, చావ ?

ఉత్తర ధ్రువ మెక్కి .
ఉరిమి చూశాను,

దక్షిణాయనముపై
దాడి చేశాను.

రవితోడ పైనమై
భువనాలు వెతికాను.

గిట్టాను రాత్రితో
పుట్టాను పగటితో--

ఎంత వెదకిన గాని,
ఏమున్న దీ యవని ?

వట్టిపోయిన వెల్ల
మిట్ట పల్లాలు !

ఆశావతి :

ఆగవోయ్ ! బీరాలు
ఆపవోయ్, ఇక చాలు;
పుడమి దాటును మాట !
గడప దాటదు కాలు !

మిట్ట పల్లా లెల్ల
వట్టి పోతేను
ఎచటి దీ పండు !
ఎచటి దీ తేనె ?

భోగయ్య :

పుడమి పాత్రికలోని
అడుగు బొడుగు నిదేనె !
ఇలతేనె పట్టులో
ఇదెసుమ్ము తుదిబొట్టు !

(ఆశావతి అసహ్యంగా చూస్తుంది. చుట్టూ ఊదా రంగు కాంతి రంగంలో ప్రసరిస్తున్నది. అక్కడక్కడ పచ్చని రుచిమాత్రం కనిపిస్తున్నది. ఆమె క్షేత్రయ్యా వంక. క్షేత్రయ్య భూలక్ష్మి వంక చూస్తారు. భూలక్ష్మి లేచి, ఆశాలత చేయి పట్టుకొంటుంది.)

భూలక్ష్మి :

ఆశవీడకు మమ్మ.
ఆశావతీ దేవి !
కడుపు మండిన మాత
కలత యేలనే భువి ?

లోకమంతా తిండి
లోపించ నిమ్మ.
కరుణ కీ ధరణిలో
కరవు లేదమ్మ !

ఊహపోహలు నిల్చి
యున్నంత వరకు,
గుండె బండగ మార
కున్నంత వరకు,

బ్రతుక లేనని భీతి
పడవద్దు మనిషి :
ఆకటికి దాసోహ
మనవద్దు మనిషి.

ఆశావతి :

ఏడ్చినట్టే వుంది
ఈ యీతి బాధ !
కడుపు మండే జీవి
కా నీతి బోధ ?

తీపి మాటలు కావు
తిండి కావాలి !
కరుణ గీతలు కావు
కడుపు నిండాలి.

మిట్ట పల్లా లెల్ల
వట్టి పోతేను---
ఏ కొండ కాసింది
ఈ కంద పండ్లు ?

ఏ యెండ కురిసింది
ఈ తీయ తేనె ?
ఎందు కీ తెర మరుగు ?
ఎచటి కీ పరుగు ?

క్షేత్రయ్య :

భోగయ్య మాటంత
బూటకము కాదు,
ధరణిలోనే తిండి
తరిగి పోయింది.

సైబీరియా, అలా
స్కాప్రాంత మంతా,
కాంగో వనాలు, వో
ల్గా భూములన్నీ---

గాలించి నేటికీ
గట్టు చేరాము,
సోలి యీ నీడలో
కూల బడ్డాము.

ఈ పథాలు సరస్వ
తీ పదాంకాలు,
మహితాలు, పుష్కల
మధుర ఫలాలు

ఇవి కూడ వట్టి వో
యే ముందె నే పోయి
అమ్మ నడిగి తెత్తు
అన్న వస్త్రాలు.

భూలక్ష్మితో కూడ
ఈ లక్ష్మి కిరవైన
పుణ్య తీర్థాన కా
పుర ముందు డెల్లరును.

భూలక్ష్మి :

అదేమి, నాథా ! అన్యాయానికి
అంతటి వాడి గడుతున్నావు ?
మనిషికి రెండర్థములము, మనకీ
మహిలో ఎడబాటెట్లొదవు ?

వత్తును నీతో, నీడెపుడైనా
వస్తువు కెడముగ బ్రతికేనా ?
ఒంటరి మన్గడ సహజము కాదు,
ఉండను, ఉండను నిన్విడిచి.

పలుకొకటైనా పెదవికి పట్టని
పాపగ మాతను చూశాను
వచ్చిన పదాల పల్లవాలామె
పదాలపై పలికిస్తాను.

ప్రపంచమే పద్మాసన మామెకు,
విపంచియే అమృతాసవ మామెకు,
ప్రగతిగాన గాయనీ గణేశ్వరి
ప్రాణేశ్వరి నే జూడాలి !

(మెల్లగా పోయి క్షేత్రయ్య చేయి పట్టుకొంటుంది. ఆశావతి తొందరగా సమీపించి భూలక్ష్మి చేయి పట్టుకొని, ఆమెవంక నిష్ఠూరంగా చూస్తుంది.)

ఆశావతి :

అతడితో నువు కూడ
అనుగమిస్తేను --
ఈ యడవిలో మేము
ఏమి గావలెను ?

పొసగ దది, ఇందుండి
పోవాలి నీవు.
ఊరంత మనిషతడు
ఒక్కడికి భయమేమి ?

పోయి రావోయ్ నీవు,
ప్రొద్దు పోతున్నాది ;
భూలక్ష్మి మా కింత
బువ్వ పెడుతుంటుంది.

ఏ తపస్సో ఫలించి
ఏ తల్లో కరుణించి
ఇచ్చినన్ని వరాలు
ఇక్కడికె కొనిరమ్మ్మ !

క్షేత్రయ్య :

కానిమ్ము, నీ మాటె
కానిమ్ము, సోదరీ !

మంచిగా గనుడీమె

నుంచి పోయెదను.

పోయి వచ్చెద నింక

భూలక్ష్మి ! నేను;

కంద దుంపలు వెదకి

గడుపు మందరికి.

జనని మెప్పించి, మా

తన జీవిక గొని,

నీ కొక్కవరమడిగి

నే తెత్తు లెమ్ము.

(విల్లమ్ములు చేతబట్టి క్షేత్రయ్య నిష్క్రమిస్తాడు. భూలక్ష్మి అతడి దారి వంకే చూస్తూ నిలబడి పోయింది. మిగిలి వున్న పండ్లను తినటంలో ఆశావతీ భోగయ్యలు నిమగ్ను లయినారు. రంగం క్రమంగా చీకటై పోయింది.)

## మూడవ రంగం

(రంగం నిండా ఎర్రని కాంతి నవ్వుతున్నది. మధ్య మధ్య భయంకర మైన నీడలు పడుతూ, లేస్తూ వున్నాయి. అలసి, ఆయాస పడుతూ క్షేత్రయ్య ప్రవేశిస్తాడు. నలుదిక్కులూ పరికిస్తాడు. ఎక్కుపెట్టిన బాణాన్ని ఆకాశంలోకి వదిలేస్తాడు. విల్లు పారేసి, చేతులు జోడిస్తాడు.)

క్షేత్రయ్య

ఆకలో, నాతల్లి ! ఆకలోయమ్మ
ఆపాదమస్తకం ఆకలేనమ్మ !
కడుపుకేదో ఇంత కండ లేకున్న
బ్రతు కొక్కవడి చల్లబడి పోతదమ్మ !

పసులు, పక్షులు, మంచి ఫల వనాలెల్ల
తన పొట్టలోనె అంతర్ధాన మొంద
వెనుక చూపే లేక విహరించి నరుడు
సర్వ మాఖరు చేసి చస్తువున్నాడు !

వెలగ చెట్టును బోలు విను వీధిలోన
విశ్వాలు సృష్టించి విరజిమ్మినావు.
ఒక పండు చాలు నా కొకపూటె చాలు,
వాత్సల్య దేవతా ! వచ్చి కాపాడు !

నిలువగా లేనింక, నీడ లేవోను
నల్ల త్రాచులవోలె నను ముట్టడించె;
మనలేను నేనింక, మంటలేవోను
వాడి కోరలు గ్రుచ్చి ప్రాణాలు తోడు !

ఆకలో నా తల్లి ! ఆకలోయమ్మ !

పరువెత్తి రావమ్మ ! పట్టుకోవమ్మ !

తనలోని దాహమే తన నాహరింప
మరణిస్తువున్నాడు మానవుడు నేడు.

(క్షేత్రయ్య సొమ్మసిల్లి పడిపోతాడు. రంగంలో రంగులు రెపరెప కొట్టుకొని పడిపోతాయి. కాంతి కిరణాలు తెగిపోతాయి. అంధకారం ఊపిరాడక విచ్చిపోతుంది. నెత్తురు వెలుగు రంగంలో ప్రవహిస్తుంది. అందులో వికసిస్తున్న ఎర్రదామర పువ్వువలె స్వయంప్రభ ప్రవేశిస్తుంది. ఆమె ముఖంపై నీలి నీడలు తారట్లాడతాయి. ఇప్పుడామె అన్నపూర్ణ.)

అన్నపూర్ణ :
రాలిపోయినది నా
లీలాభిలాష !
జారిపోయినది నా
సంకల్ప భూష !

ఆగిపోయినది నా
అధిభావశేష !
విశ్వమంతకు నీవె
విభుడవయ్యెదవంచు
ఆశించినానురా !
అంతరించితివటర ?

అయ్యయ్యో ! మనుజుడా !
అయ్యో ! తనూజుడా !

మృగ శాబముల బట్టి,
మృదు శారికల గొట్టి,
కమనీయ వనసీమ
కాటి దిబ్బగ మార్చి

ఆర్చినపుడైన ని
న్నాపనైతివి గదర !

పొట్టకోసము సృష్టి
మట్టి జేసిననాడు,
సౌందర్యముల నెల్ల
సంహరించిన నాడు,

శైశవ క్రీడగా
క్షమియించితిని గదర !

సృష్టికంతకు నవ్య
సృష్టిగా నిను జేసి,
తదితర ప్రకృతి కం
తకు నేతగా జేసి,

నీకు సేవలొనర్ప
నిర్మించితి జగత్తు !

కైవల్యమును త్రచ్చి,
శైవాంశమున జొచ్చి
చరముగా భువి బ్రాకి,
నరునిగా దివి దాకి

పరమోన్నత పథాల
పయనింత మనుకొంటి.

నడుమ ఈ రీతి నా
నడక వక్రించెనే !
మానవుని కడ నాకు
మార్గమే తప్పెనే !

బ్రతుకు లక్ష్యము తొలినె
బ్రద్ధలైపోయెనే !

ఆకలిని కల్పించు
టే కొంత పొరపాటొ ?
కాళ్ళు రెండే యొాట
కరము లూరక యుంట

భాష వచ్చుట కూడ
దోషమే యైనదో ?

ఆవు పచ్చిక మేయు
అంటదు మాంసమ్ము,
పులి మాంసమే మెక్కు
పూరి జోలికి పోదు,

అన్నిటిని కాజేయు
అవతార మీ నరుడు !

ఏమైన, నా సృష్టి
నితడె కొంగ్రొత్త,
ఔన్నత్యమున కితడె
యొా రాచబాట

ఏ గొప్పకై వీని
పోగొట్టుకొందు ?

అన్య ప్రకృతి యెల్ల
అంతరించినగాని,
ఉర్విలో నరుడొక్క
డున్న చాలును నాకు,

ఈ విలయము నెట్లొ
ఈదింపవలయు.

ఆకలి లేకున్న
అరుణోదయమ్మేది ?
ఆశ తీరిన నాడు
అవనియే తీరదా ?

ఎల్ల సృష్టికి ప్రాణ
మీ ఎండ కాదా ?

ఇతర జీవుల జోలి
కేగకుండగ వీడు,
పరివర్ధమానమౌ
పథము చింతింతు.

యోచన కల్పింతు
ఊహ చేయింతు.

సృష్టికి ప్రతి సృష్టి
చేయింతు వీనిచే,

నిత్యగతి శీలతను
నిర్మింతు వీనిలో,

తరుణ జీవన వృష్టి
కురిపింతు వీనిపై.

(ఉత్తేజితురాలై అన్నపూర్ణ ఘల్లు ఘల్లున నాట్యాని కుపక్రమిస్తుంది. అంజలి ఘటించి ప్రార్థిస్తుంది.)

అన్నపూర్ణ :

సృష్టి నా పురిటిల్లు
జీవి నా సుతుడు,
అందులో కడసారి
కందు మానవుడు,

లాలించరా మమ్ము
పాలించరా, స్వామి!
కాల రాత్రము నుండి
కాపాడరా !

నీ భావమై నేను
శోభింతు నిశలలో,
నీ రూపమై సృష్టి
నిర్మింతు దిశలలో,

ప్రతి మూర్తిలో నిన్నె
ప్రచురింతురా, స్వామి !
ప్రతిపాటలో నిన్నె
పల్కింతురా !

నీ లోటు నేనుగా
నా లోటు నీవుగా
పరిపూర్ణమై బ్రతుకు
పాలింతురా !

అన్నపూర్ణను నేను
అన్నపాత్రము నేనె
అన్నమే నేనుగా
ఆవిర్భవింతురా !

దుర్గమారణ్యాలు
దున్నింతురా, స్వామి !
సంకల్ప బీజాలు
చల్లింతురా !

కాయకష్టమునుండి
కల్పింతురా తిండి,
ఆలోచనమునుండి
అమృత మూరింతురా !

(ఆమె గిర్రున తిరగ్గా, చేతిలోకి అన్నంతో నిండిన పాత్ర వస్తుంది. దానిని పట్టుకొని, క్షేత్రయ్యను సమీపించి లేపుతుంది)

అన్నపూర్ణ :

లేవోయి, మనుజుడా !
లే, లే, తనూజుడా !
జఠరాగ్నిలో మండి
పుఠమైన జీవుడా !

అమృత పాత్రికతోడ
అమ్మ వచ్చినదిరా !

విహరింపుమింక, నా
విశ్వమెల్లను నీది,
కీడు లేదిక మీద,
కూడు తిన్నంతరా !

నిండు తొల్కరి నింపి
నీకు తెచ్చితినిరా !

(క్షేత్రయ్య కదులుతాడు, రంగం మసక చీకటినుంచి మనోజ్ఞ కాంతికి మారుతుంది. కన్ను విప్పుతాడు. చటుక్కున లేచి, చేతులు జోడిస్తాడు. ఆమె అన్నపు గిన్నెను అందిస్తుంది. ఆత్రంగా ఆరగిస్తాడు. గిన్నెలో ఇంకా కొంచెం వుంది. అదికూడా కానివ్వమంటుందామె. కాని అతడు తల అడ్డంగా తిప్పుతాడు.)

క్షేత్రయ్య :
తల్లి ! నిను దర్శించి
ధన్యుడనైనాను,
శాల్యన్నము గ్రహించి
స్వస్థుడనైనాను,

క్షుద్బాధ చల్లారె
సుఖము చేకూరె.
కాని, నే నొకడినే
కాదమ్మ, తల్లి !
లోకమంతకు ఆక
లొకటేనె, తల్లీ !

నరులందరికి తిండి
కరుణించు తల్లీ !

ఏమిటను చల్లార
దీ యగిడి మంట,
ఎంతకును పూడదే
ఈ లోతు గుంట.

ఎందు కీ యిబ్బంది ?
ఎవరిదీ బంది ?

బ్రతుకు కోసము మెతుకు
మెతుకు కోసము బ్రతుకు
బ్రతుకు మెతుకుల కన్న
పరమార్థ మిల సున్న

ఇంతమాత్రపు తంతు
కెందుకే యీ సంతు ?

ఆకలో, నా తల్లి !
ఆకలో యమ్మ !
కాళ్ళ కది బందమై,
కళ్ల కది కారమే,

అరుణోదయ నిశీధి
ఆకలే నమ్మ !

అన్నపూర్ణ :
ఆకలని యనకురా !
చీక టిక లేదురా !

ప్రత్యణువు నీ కొక్క
పరమాన్న ఘటమేర !

అణువులో అవనినై
అవనికే జననినై
నేను నీ యెదనుండ
నీకేమి కొదవరా ?

హస్తముల చాచి నీ
వాకలని అరవగా,
అన్నపూర్ణను నాకు
అవమానకరమురా !

ఆకలని యనకురా !
లోకమే నీదిరా !
మూగినై మనకురా !
యాగమే నీవురా !

క్షేత్రయ్య :

వస్తురూపము కాని
వాక్సుధా ఝరులతో
భావలోకములోని -
బాధాగ్ని చల్లారు,

వట్టిమాటలచేత
పొట్టనిండునె తల్లి ?
తీపి మాటల కెట్లు
తిండి రుచి వచ్చునే ?

ఆకలే సత్య మీ
లోకాన, నా తల్లి !
ఇతర మేదియు లేదు,
ఏలనే వాదు ?

సదయ వగుదేని, మము
సాకగలవేని –
అన్నపాత్రము దీని
నక్షయము చేయుమా !

అన్నపూర్ణ :

భీతి నొందకుమోయి
బిడ్డ ! నీ కోసమై
సర్వమ్ము సృష్టించి
సంసిద్ధపరిచాను;

నీ తిండి యికనుండి
నీ చేతనే యుండు –

అటు చూడుమా దాని,
అది నవ్య హలము;
ఇటు చూడుమా వీని,
ఇవి విత్తనాలు;

రెండు నొకటై నీకు
తిండి పండించు.

అటు చూడుమా దాని
అది యేటి జలము
ఇటు గాంచుమా దీని
ఇది బీటి పొలము,

రెండు నొకటై నీకు
తిండి పండించు.

అటు కనుంగొను మదే
ఆ గంగి గోవు,
ఇటు కన్ను త్రిప్పుమా
ఇది ప్రత్తి తోట

వర్ధిల్లుమిక పాడి
పంటతో బిడ్డ !

వృషభరాజును వంచి,
వృక్షవాటిక బెంచి,
గోమాత బూజించి,
గోధుమను పండించి,

ఆకలిని తీర్చుకొని

లోకాని కిడు మింత.

(అన్నపూర్ణ చే సైగతో ఆదేశిస్తుంది. అంతకు ముందు నుంచే నిరీక్షిస్తూ వున్న క్షేత్రయ్య వెళ్ళి నాగలి తీసుకువస్తాడు. అతడు వచ్చేలోగా ఆమె అదృశ్యమవుతుంది. అతడు నాగలి భుజం మీద పెట్టుకుని, ప్రక్కనే వున్న విత్తనాల బుట్ట పుచ్చుకొని బైలు దేరతాడు. రంగం సస్యశ్యామల కాంతిలో మునిగిపోతుంది.)

## నాలుగవ రంగం

(మహారణ్యంలో ఒక భాగం. సరస్వతీ నదీతీరం. రక రకాల దుంపలు గుట్టలు గుట్టలుగా పడి ఉంటాయి. గునపం భుజాన వేసుకొని భూలక్ష్మి ఉత్సాహంగా పాడుకొంటూ ప్రవేశిస్తుంది)

భూలక్ష్మి :

నీ ఆరాధన చేసే నరులకు

ఏ యాకటి మంటలు దరి జేరవు

నీ కెప్పుడు పని చూపే చేతికి

లోకము నిరతము క్రిందేనే !

రావే గునపమ !

నీవే మనుపుమ !

(తెరలోపలనుండి భూలక్ష్మి పాట మళ్లీ బృందగానం చేయబడు తుంది. ఆ సమయంలో భూలక్ష్మి దుంపలు తవ్వడం వగైరా అభినయిస్తుంది.)

భూలక్ష్మి :

తిండికోసమై దేశదేశములు
తిరిగి తిరిగి కడు డస్సిన మనిషీ !
చెట్టులేని పిట్టలవలె, ఆకటి
చిచ్చున గూలే తొలి నరులారా !
రారండీ, యిట
చేరండీ !

వసుధాగర్భం రసనిక్షిప్తం,
పసుపూ కుంకుమ పళ్లెరమే,
నిరాశోపహత జీవీ ! జీవిత
కరాసిధారాక్షత భావీ !
ఇటు గనుమా !
ఇట మనుమా !

(తెరలోని బృందగానం ఆగగా, క్షేత్రయ్య నాగలి, విత్తనాల బుట్ట, జత ఎడ్లతో ప్రవేశిస్తాడు. ఎడ్లు రెండవవైపుకు నిష్క్రమిస్తాయి. భూలక్ష్మి ఆనందంతో గునపం వదిలేసి, రివ్వున క్షేత్రయ్యను కౌగిలించుకొన్నది. తన్మయత్వసూచకంగా క్షణం చీకటై రంగంలో ఎర్రటి కాంతి ప్రసరించింది. భూలక్ష్మి, క్షేత్రయ్య చేతిలోని బుట్టను అందుకొని, భుజంమీది నాగలిని క్రిందికి దింపింది.

భూలక్ష్మి :

అన్నపూర్ణనే ఔదల నిడుకొని
తెచ్చితివా, నా తేనె పెరా ?

వరలక్ష్మినె నీ కరాల బట్టుక
వచ్చితివా, నా వరాల మూటా !
తల్లిని పిలిచీ, మల్లెల గొలిచీ,
దర్శించితివే ధన్యతమై ?
ప్రజ లిక మీదట బ్రతికే పద్ధతి
అంబ వచించినదా కృపమై ?

అలసితివో యే అడవుల, కొండల,
పిలిచితివో నీ ప్రేయసి నన్ను ?
నీతో నీడగ, నీచేదోడుగ
అనుసరించనైతిని నిన్ను.

పట్టరాని ఆనందముతో నే
చెట్టునైతి, పుట్టనైతినో !
ఆకొంటివి కాదే, కూర్చుండుము,
ఆహారము తెత్తు నింతలో,

క్షేత్రయ్య :

ఆగుమో ప్రియా ! ఆహారము వల,
దాకలిగా లేదిపుడు;
అంబను జాచిన ఆరాధకునికి
ఆయాసము లే దెపుడు.

ఏమిటివన్నీ ? ఇన ఖండములా ?
భూమికి రాలిన తారకలా ?
రత్నగర్భ నీళ్ళాడినదా ? స

ర్వంసహా గర్భం పండినదా ?
కల్పవృక్ష శాఖాలవమిది, సం
కల్పసిద్ధి రూపమిది,
ఇది నాగలి, నవనాగరికతకే
హృదయము, పరమాభ్యుదయ మిది.

దీనితోడ సస్యశ్యామలమై
దేశమెల్ల సౌభాగ్యవంతమౌ,
నవరత్నమ్ములు నా కిచ్చిన ధర
నవధాన్యమ్ములు నీ కిచ్చు.

(క్రమంగా రంగం ఎరుపెక్కింది. గాఢారుణం చీకటిగా మారి వెంటనే ప్రకాశవంతమయింది. తిరిగి క్రమంగా ఆకుపచ్చని కాంతి ప్రవహించింది. సూరన్న, చంద్రన్న, కృషీవల యువకులు పాడుకొంటూ ప్రవేశిస్తారు. రంగంమీద క్షేత్రయ్య, భూలక్ష్మి కనిపించరు.)

సూరన్న :
పొలము దున్నేవాని
పొట్ట కాకలిలేదు,

చంద్రన్న :
బావి త్రవ్వే వాని
మోవి తీ దొండరా :

ఇద్దరూ :

కొట్టరా చిట్టడవి, కట్టరా గంగ,
దున్నరా బంజర్లు పన్నరా హలము.

(పాటంతా తెరలో బృందగానం చెయ్యబడుతుంది. రంగంలో భావోచిత కాంతులు ప్రసరిస్తూ వుంటాయి.)

సూరన్న :

విత్తనాలే రైతు
విత్తమో యన్న !

చంద్రన్న :

దండ బలమే రైతు
బండార మన్నా !

ఇద్దరూ :

ఎత్తుకోరా గంప, విత్తరా గుప్పిళ్ళ,
చాలుకొక లక్ష బస్తాలు పండించరా !

సూరన్న :

అదనులో పెట్టింది
అందాల పైరు,

చంద్రన్న :

పదునుగా పెరిగింది
బంగారు పైరు

ఇద్దరూ :

కొలువరా భూలక్ష్మి నలినాలతోడ
పిలువరా వనలక్ష్మి చెలిమి కీనీడ !

(రంగం చీకటైపోయి, క్షణంలో పచ్చబడుతుంది. బృందగానం దూరమైపోతుంది. ఇప్పుడు రంగంలో సూరన్న, చంద్రన్న లేరు. భూలక్ష్మి, క్షేత్రయ్య ఇందాకటి విధంగానే కబుర్లు చెప్పుకొంటున్నారు. ఆటవిక వేషం లేదు. కొంచెం నాగరీకంగా కనిపిస్తున్నారు.)

భూలక్ష్మి :

తెచ్చినాడవు ధరి
త్రికి భోజనమ్ము,
కల్పించినావు లో
కము కొక్క కృషిని,
నా కేమి కొనితెచ్చి
నావోయి దేవ ?

అంబ నా క్షేమమ్ము
లడిగెనా నిన్ను ?
జ్ఞప్తిలో నుంటినా
జనయిత్రి కేను ?
పంపలేదా నాకు
ఫలము లేవైన ?

క్షేత్రయ్య :

ఫలము లన్నిటి కాది
ఫలమైన శక్తి
కరుణ గల్గిన, వేరె
వరము లేమిటికి ?

ఆమె దర్శనమే, మ
హా భాగ్యమౌ, సఖీ !

పరువు పరువున వచ్చి
పడుచున్న చినుకు
దివి నుండి భువికి గా
తెచ్చు కానుకను

నీ కోసమని కోరి
నేను తెచ్చితి, సఖీ !

పొలము పండుట తోనె
పూర్తి కాదే బ్రతుకు,
కడుపు పండిన మీద
కల్గు నెల్ల శుభాలు,

కను మీ ప్రకృతి యెంత
కమనీయమో – సఖీ !

పైరు గట్టుల వెంట
పండు వెన్నెల మంట

జంటగా దూకి, జే
గంట వాయింతమా ?

చెంత నెవ్వరు లేరు.
సిగ్గేలనే, సఖీ ?

(ధనలక్ష్మి ముఖం సిగ్గుతో ఎర్రబడగా క్షేత్రయ్య ఆమె కేలు పట్టుకుంటాడు. రంగం చీకటైపోతుంది. తెరలో "సస్యదేవతా శ్యామలరూపా, అమృతకలశమై, అవతరింపవే" అన్న పాట బృందగానం ప్రారంభమవు తుంది. రంగంలో ఉషఃకాంతి ప్రవేశించేటప్పటికి భూలక్ష్మి ఒక్కతే వున్నది. ఆవులించి, పళ్లు విరుచుకొని బృందగానాన్ని అందుకొని పాడుతూ నాట్యం సాగించింది.)

భూలక్ష్మి :

సస్యదేవతా! శ్యామలరూపా !
అమృతకలశమై అవతరింపవే !
నాక జీవనీ ! లోక మోహినీ !
నవ్య రుచులతో నాట్యమాడవే !
అవతరింపవే !
అవని బెంపవే !

నదీ తీరములు నవ్విన పువ్వుల
పరీమళమ్ములు ప్రక్క సర్దగా,
తీ దేనెలు నా తెరను దిద్దగా,
పంచవర్ణములు పాలు పట్టగా
అవతరించవే !
అవని బెంపవే !

మావితోపులో మధుర ఫలమవై
మాన్య భూమిలో ధాన్య రాశివై
రత్నగర్భ గారాబు బిడ్డవై
ఆకటి వాకిట కన్నపూర్ణవై
అవతరించవే !
అవని బెంపవే !

కాంచన కాంచీ ఘంటానాదము
ఘల్లు ఘల్లరని కదలి వెడలెనే !
పొలముల నిండా పుష్కల సస్యము
పండి వాలి సంబరము నడిపెనే.
అవతరించవే !
అవని బెంపవే !

మోదముతో మా కేదారములో
నీతో నర్తించెద నేకూడా,
నీ పద మణి మంజీరములో నొక
మణినై కీర్తింతును నీ క్రీడ
అవతరించవే !
అవని బెంపవే !

నవ్విన నవరత్నాలు రాలగా
నవ్వవె తల్లీ ! నా పొలాలలో,
పాటకు పుట్టెడు మూట గట్టుకొని
కొల్లునమ్మ నీ కోట కొలువులో !

అవతరించవే !
అవని బెంపవే !

(భూలక్ష్మి నాట్యం చేస్తూవున్న సమయంలోనే క్షేత్రయ్య భూమి దున్నడం రంగం మీద ఒకటి రెండుసార్లు కనిపిస్తుంది. నాట్యం ఆగిన తర్వాత కూడ తెరలో బృందగానం వినిపిస్తూనే వుంటుంది.)

## ఐదవ రంగం

(ఎడారివంటి ప్రాంతం అక్కడక్కడ ఆకులేని చెట్లు మాత్రం కనిపిస్తూ వుంటాయి. బక్కచిక్కిన భోగయ్య, కుంటుతున్న ఆశావతి ప్రవేశిస్తారు. రంగంలో ఊదారంగు కాంతి నిశ్చలంగా వుంటుంది.)

భోగయ్య :

ఓ చూత వృక్షమా !
ఓ నారి కేళమా !
పూయవే ! పూయవే !
కాయవే ! కాయవే !

ఎలుక లేవో కడుపు
దొలిచి నట్లయ్యేనే !
కంద దుంపకు కూడ
కాటకమ్మయ్యెనే !

పుడమి సర్వ మెడారి
పుంతగా మారి
శృంఖలలు తగిలించె
జీవనపు దారి !

అయ్యయ్యో, ప్రియురాల !
అలసి పోయావ !
నడవలేకున్నావె ?
నడిపింతురావె !

ఆశావతి :

చాలు, చాలును, నడువ
జాలనోయీ నేను,
ఏ దేవుడును ముందు
కీడ్వలే డిక నన్ను.

ప్రాణ మారిన మహా
పర్వతము నేను,
కదపజాలదు నన్ను
కాళి వచ్చినను.

మహిలోన మనుచున్న
మగవాడ వైన
పోయి పట్టుక రమ్ము
పొట్ట కే దైన !

భోగయ్య :

తినకుండగా జీవి
మనజాల దేలనో !
మనిషి తిండికి దాస్య
మును జేయ నేలనో !

ముక్తి లేదో యింక
మోదమే లేదా ?

వట్టి పొట్టను చేత
బట్టుకొని ముష్టికై
దేశాలపై బడ్డ
దెందుకే , ఓ నాతి !

ఓర్చుకొమ్మా వంచ
ఊరేదో యగుపించె !

(ఆశావతి తూలిపడుతుంది. భోగయ్య పట్టుకుంటాడు.)

భోగయ్య :

కంద దుంపలు త్రవ్వి
కర్ర పెండల మిచ్చి
భూలక్ష్మి పోషింప
పుష్టిగా తినలేక

గిల్లికజ్జా పెట్టి
గెంటు కొచ్చావు !

పెద్ధమ్మవై యిపుడు
పీడించ ఫలమేమి ?
ఈ యెడారుల నేమి
చేయగల డెవడైన ?

మెడమీద కూర్చొమ్మ,
మెల్లిగా గొంపోదు.

(అతడు కూర్చుండి, ఆమెను భూజాలపై కూర్చోబెట్టుకొని, లేచి, ఒక్క అడుగు

వేసి పడిపోతాడు. ఆశావతికి దెబ్బ తగులుతుంది. నెత్తురు కారుతుంది. రంగం ఎర్రటి కాంతితో నిండి, వెంటనే యథాస్థితికి వస్తుంది.)

భోగయ్య :

అయ్యయ్యో ప్రేయసి !
అన్యాయమై పోయె !
రాయి తగిలెను గాని
మోయజాలక కాదు.

సర్దుకొని కూర్చొమ్ము
చరచరా కొంపోదు.

ఆశావతి :

చాలు చాలు బడాయి
చాలింపు మోయి !
సిగ్గులేని మొగాని
కెగ్గేమి గలదు ?

తిండిపోతువు గాని
తేలేవు తిండి
దిష్టిబొమ్మవె గాని
కష్టపడలేవు.

చాలు, వట్టి కబుర్లు
చాలింపు మింక,

ప్రార్థింతు నిట్లైన
బ్రతుకనిమ్ము నను.

భోగయ్య :

పువ్వుబోణీ, కబుర్ల
పోగునని యందువే !
కబురులే సుమ్ము లో
కము నేలు మును ముందు !

కబురుల తోడనే
కడుపులు నిండునే !
కబురులు రానిచో
కష్టాలు తొలగవే !

కష్టపడగానేల ?
కంద తిన నేల ?
కూర్చున్న చోటికే
కూడేల రాదు !

గంపలాదిగ పండ్లు
కాపింతు చెట్ల,
కుండలాదిగ తేనె
కురిపింతు పుట్ల.

చిటికెలో నీ నోట
చినికింతు పూదేనె.
మాటతో నే నిన్ను
మహరాణి జేతునే !

ఆశావతి :

మాటలే ఆహార
మైనచో, మగడ !
కుండవలె నా పొట్ట
నిండి పొంగేది.

ఉబ్బి తబ్బిబ్బులై
పబ్బాల దిబ్బడై
రగిలి ఈ పాటికే
పగిలి పోయేది.

ఏమైనా గాని, నే
నిడజాల నడుగేని,
గ్రుక్కెడు రసమైన
గ్రోలించి కొని పోమ్ము.

(ఆశావతి చాలా నీరసమైపోతుంది. రంగంలో రకరకాల రంగులు తిరుగుతాయి. ఆమె సొమ్మసిల్లి పడిపోతుంది. భోగయ్య కంగారు పడతాడు. అక్కడ వుండలేక, విడిచి వెళ్ళలేక ఎటో పరుగెత్తుతాడు. ఆ వెనుక మేధానిధి ప్రవేశిస్తాడు. అతడు బాలుడు. బాటసారి. భుజంమీది కర్రకు సంచీ వ్రేలాడుతూ వుంది. ఆశావతిని చూచి ఆగుతాడు. పరిస్థితి క్షణంలో గ్రహించి సంచిలోని ఒక పండు తీసి ఆమె నోట పిండుతాడు. కొంచెం సేపటికి ఆమె కదులుతుంది. కళ్లు తెరుస్తుంది. లేచి కూర్చుంటుంది. అతణ్ణి ఆశ్చర్యంతో పరిశీలిస్తుంది.)

ఆశావతి :

ఏ తల్లి కన్నదో !
ఏ నోము పంటవో !

ఏ దేవు డంపగా
ఈ దారి మళ్లితివా !

పలుకుమా ! తెలుపుమా !

పండ్లేవొ తెచ్చి, నా
ప్రాణమై వచ్చావు.
ఏ దిక్కు మీ వూరు ?
ఏమి నీ పేరు ?

పలుకుమా ! తెలుపుమా ! !

(లేచి, అతణ్ణి దగ్గరకు తీసుకొంటుంది. కొంచెంసేపు అతడు చలించడు. పలకడు. ఆమె బుజ్జగిస్తుంది.)

ఆశావతి :

సూరన్న నా వంత
చూడవచ్చాడో ;
చంద్రన్న నన్నింత
సాక వచ్చాడో !

తెలుపుమా ! పలుకుమా !

మేధానిధి :

కాను నే సూరన్న,
కాను చంద్రన్న,

దేవు డెవ్వడు నన్ను
దింపలే దీ తెన్ను

బ్రతుకు దారుల లోన
బాటసారిని నేను,
    లేదు నా కొక యూరు,
    లేదు పొరుగూరు.

ఎట బైలుదేరితినొ,
ఎచటి కేగుదునొ,
    తెరువు మధ్యను నిల్చి
    తెలిసికొను టెట్లు ?
ఊహ తెలిసిన నాటి
నుండియును తల్లి !
    నా కెవ్వరును లేరు
    నా యన్నవారు.

సంచి నిండుగ పండ్లు
సంతరించుకొని
    పైనమై పోవుచు
    న్నాను వచ్చిన త్రోవ.

ఎవతెవమ్మా, తల్లి,
ఈ యడవి ద్రెళ్ళి ?
    ఒంటరిగ బడియుంటి
    వుగ్ర దాహమున ?

(ఆశావతి అతణ్ణి పరీక్షగా చూచి, ఒడిలోకి తీసుకొని, తల నిమురుతూ వుంటుంది.

అంతలో మెల్లిగా భోగయ్య ప్రవేశించాడు. మేధానిధిని చూచి హఠాత్తుగా ఆగిపోయాడు. అతని కన్ను పండ్ల సంచీపై పడింది. తొందరగా దానిని సమీపించి, పళ్ళు తీసుకొని ఆత్రంగా తింటూ వేరొక చోట కూర్చున్నాడు. ఆశావతి మేధానిధి చేయి పట్టుకొని భోగయ్య దగ్గరకు తీసుకు వెళుతుంది. అతడు లేస్తాడు. ఇతడి చేతినందిస్తుంది.)

ఆశావతి :

అందుకోవోయ్ చేయి,
అందాల బావ !
ఇతడే మనబ్బాయి,
రతనాల కోవ !

ఎన్నడో పుట్టింట
కన్నాను గాని --
మన్యాన విడనాడి
మరిచాను వీని !

చేతి కందొచ్చాడు,
సిరులు తెచ్చాడు,
ఇతడే మనబ్బాయి,
ఎత్తుకోవోయీ !

(పండు దబదబా తినేసి, భోగయ్య మేధానిధి చేయి అందుకొన్నాడు.)

భోగయ్య :

ఎందుండి వచ్చాడు ?
ఎచట దొరికాడు ?

ప్రొద్దులా గున్నాడు !
ముద్దు తెచ్చాడు !

దేవుడే కన్నాడొ !
దిగివచ్చినాడొ !
నీవు కన్నావంటె
నే నొప్పుకోను.

రావోయి బాలకా !
రావోయి మొలక !
నీవు మా యబ్బాయి,
నీవు మా వాయి.

జన్మ ఎక్కడిదైన
జాతి యేదైన,
పుడమిలో నరజన్మ
పూజనీయమ్మె !

**ఆశావతి :**

ఆనందమాయె, బ్ర
హ్మానందమాయె;
అంధకారము తుంచి
ఆశ దీపించె;

ఎక్కడో నవ కంఠ
మెత్తె కోకిలము,
పదవోయి బిడ్డ ! నీ
పల్లె కేగుదము.

కొండమాటున మూగి,
కోరికలు దాగి,
తొలి ప్రొద్దు పొడుపులా
తొంగి చూశాయి !

శీత భానునివోలె
చేతు లిచ్చాయి !
కలిమి గల భూములకు
కదులు మబ్బాయి !

(ఇటూ, అటూ పరికించి మేధానిధి దారి తీయగా, ఆశావతి, భోగయ్య వెంట నడుస్తారు.)

## ఆరవ రంగం

(గుబగుబలాడుతూ ఎదుగుతున్న చేలు. చిమ్మ చీకటి విడిపోతూ, లేత ఆకుపచ్చని కాంతి రంగంలో స్థిరపడుతుంది. నీలి చీరను ధరించిన బాలిక - సస్య - నాట్యం చేసుకొంటూ ప్రవేశిస్తుంది. మొదట దూరంలో చిన్న పిల్లలా కనిపించి, రాను రాను కొంచెం పెద్దదే అనిపిస్తుంది. ఆమె ఆట పాటలకు అనుగుణంగా ప్రకృతి అంతా హంగు చేస్తున్నట్లుగా వున్నది. భూలక్ష్మి కూతు రామె. జీవి లోకైక సుందరి - విశ్వైక మోహిని.)

సస్య :
లేవే కృషికి జీవి !
తేవే యమృత భావి !
ఈ వేళ - ఈ చేలకు !

సారాలు దింపి, శ్రీ
సారాల నింపి, భూ
స్వర్గాలు నిర్మింపవే !

చాలు తోలి ధరామతల్లికి
మేలుకొల్పులు పాడవే!
అదనెరంగిన తల్లి రొమ్మున
అమృత భాండము గ్రోలవే!!

రావె తొలకరి చినుక!
తేవే మెరుపు మొలక!
ఈ వేళ - ఈ చేలకు!

ఉదయించె నవ శకము,
ఉద్భవించెను సుఖము
ఉద్యోగమును పెంచవే!

మందమారుతమునకు డెందము
సుందరముగ సుమింపవే!
దినమణికి మానసములో మణి
దీపమును వెలిగించవే!!

రావె యాత్రా శీలి!
తేవె తరుగని శాలి!
ఈ వేళ - ఈ చేలకు!

ఆకలని యార్చ రిట,
వాకిళులు మూయ రిట,
లోక మిట మండ నీవే!

పండ్లు తేనెలు, పాయసమ్ములు
పసిడి గిన్నెల నుంపవే!
అలసి వచ్చిన కష్టజీవికి
అర్ఘ్య పాద్యము లొసగవే!

(సస్య నాట్యం చేసుకొంటూ ఒక ప్రక్కకు నిష్క్రమించింది. రెండవ ప్రక్కనుంచి మేధానిధి ప్రవేశించి, తేరిపార జూస్తూ తల పంకించి, సస్యను అనుసరిస్తున్నట్లుగా నిష్క్రమించాడు. ఆ వెనుక దిక్కులు చూచుకొంటూ, ప్రకృతి సంపదకు ఆశ్చర్యపోతూ, ఆశావతి, భోగయ్య ప్రవేశించారు. మానవ చరిత్రలో ఆహార సేకరణకు రాతి సాధనాలను ఉపయోగించడం, నిప్పు చెయ్యడం, ఆహారాన్ని కాల్చి తినడం, మాటలు నేర్వడం, పశువుల్ని మచ్చిక చెయ్యడం మొదలైనవన్నీ విప్లవాలే. అందులో మొట్ట మొదటి మహా విప్లవం వ్యవసాయం నేర్వడం. సృష్టి వికసిస్తున్నది. దానితో మానవుడు వికసిస్తున్నాడు. మానవుని కృషితో నేడు తిరిగి సృష్టి సస్యశ్యామల మయింది ! ఆశావతి ఆనందంలో మునిగింది. భోగయ్య ఆలోచనలో మునిగాడు.)

భోగయ్య :

ఇటు చూడు, ప్రియురాల !

అటు కాంచవే, బాల.

తీరాల పొలము లే

తీరుగా నున్నాయె !

నయనపర్వముగా వెలయలేదా ?

నా మాట మంత్ర మవునా, కాదా ?

బోళా మనిషి నంచు

వేళాకోళము చేసి,

కోతలకు మొనగాడు

కేతిగా డన్నావు !

చూచినావా నా మహత్తు ?
సృష్టించినాను సంపత్తు !

ఈ పూలు దూసుకో !
ఈ పండ్లు కోసుకో,
ఈ రమ్య వనమెల్ల
నీ రాజ్య మేలుకో !

స్వేచ్ఛగా తిని, తిరుగు, నీ విందు,
చీకు చింతలు లేవు నీ కెందు.

ఆశావతి :

ఓహో, నీ యాదేశ
ముర్వి పాలించెనే !
అబ్బో ! నీ మాటలో
అధికార మున్నదే !

పేదవాడవు కావు నీవు – నేడు నా
ప్రేమ కర్తత పొందినావు !

ఎంత ధాన్యపు పంట !
ఎంత ఆకలి మంట !
సిరి కౌగిలింతలో
సురిగి పోతున్నాను.

భూమికంతకు నేన రాణిని -- జీవి
భుక్తి ముక్తులకెల్ల పాణిని !

కోరి నే నీ వంక
గోరింక పిట్టనై
చెలరేగి రంగు రం
గుల రామ చిలుకనై

దోరకాయల నెల్ల దొర్లింతు నేల,
పిల్లకాయల నెల్ల పొర్లింతు చేల.

పసరు పచ్చిక నేల
పాముగా సాగేను,
పండి వాలిన చేల
బసివినై దూకేను

త్రేన్చివేసే నెల్ల భూమి -- నేడు
త్రెంచివేసె నెల్ల రామి.

(మహోత్సాహంతో ఆశావతి తోటలో కనిపించిన కాయగసరులతో పొట్ట నింపుకొంటుంది. తిన్నవి తింటూ - పారవేస్తూ ముందుకు పోతుంది. అడ్డం వచ్చిన మొక్కలను, పైర్లను ఊడబెరుకు తుంది. తోటంతా చిందర వందర చేస్తుంది. ఈ అఘాయిత్యాన్ని దూరంనుంచి భూలక్ష్మి చూచింది. ఒక్క గంతులో ఆశావతిని సమీపించింది. ఆమె స్వేచ్ఛా ప్రవర్తనను అరికట్టే ఉద్దేశంతో ఆమె చేతిని గట్టిగా పట్టుకొన్నది. ఆశావతి కోపంగా భూలక్ష్మి చేతిని విదలించింది.)

భూలక్ష్మి :

ఇదేమిటమ్మా ? ఇదేమిటమ్మా ?
ఇంత అల్లరికి దిగినావు ?
పిందెలు కోసీ, మొగ్గలు దూసీ
చిందర వందర చేసేవు !

పాలే పట్టని పసరు కాయలో
పండిన పొట్టకు రస ముంటుందా ?
విచ్చీ విచ్చని పచ్చి మొగ్గలో
పిచ్చెత్తించే పస పుడుతుందా !

గిల్లిదవయొు, పసి పిల్లల బోలిన
గింజల గీకలు నిర్దయతో !
త్రొక్కెద వయొు, వరి మొక్కల డొక్కలు
ముక్కలుగా నిర్లక్ష్యముతో !

ఆశావతి :

నా పొలాలలో, నా తోటలలో
నా యిష్టము, నీ కేమే మధ్య ?
రాల్చివేతు పువ్వులు, మొవ్వల నే
కూల్చివేతు – నీ కెందుకు దుగ్ధ ?

మహిమలు గల నా మగని దృష్టిచే
మహి వెలసిన దీ పుష్కల సృష్టి.

నా యదృష్ట మిది, నీ కే మున్నది ?

నంగనాచి ! చాలించవె సోది.

దుంపలు త్రవ్వక బ్రతికే చింపిరి

గంపవు, నీ కేరీతి తెలియునే

స్వేచ్ఛా వర్తనలో గల సొంపిరి ?

సిరితో చెరాటమటే, తెంపరి !

(భూలక్ష్మి ఆశ్చర్యపోతుంది ! తాను, తన భర్త, సూరన్న - చంద్రన్న వగైరా కష్టజీవుల సహాయంతో కష్టపడి సేద్యం చేసిన పొలాలు, పెంచిన తోటలు, ప్రజలందరూ ఉమ్మడిగా అనుభవిస్తున్న ఫలసాయం - అంతా ఒక్కసారిగా నాదంటున్నది ఆశావతి ! పోనీ, ఎవరిదో ఒకరిది. ఈ నాశన కర్మకాండ దేనికి ? ఎవరిదైతే మాత్రం - సంపదను నాశనం చేసుకొంటారా? భూలక్ష్మి బొమ్మలా నిలబడి పోయింది.)

భూలక్ష్మి :

నీది, నా దను మాట నేడు విన్నాను.

ఎవరిదైతే నేమిటే, వెర్రిదాన ?

మనమందరము జగన్మాత బిడ్డలము,

ఆమెదే పొలమెల్ల, వ్యక్తి దెట్లవును?

మానవులెల్ల ఉమ్మడి కుటుంబము గదా ?

ఆస్తులెల్లను ఉమ్మడాస్తులే కాదా ?

తావేది, నీది నా దను వాదమున కిందు

ఎచ్చట తెచ్చినా వీ మత్తు మందు ?

ఎవరెవరి, కేమేమి, ఎంతెంత వలయునో,

జగదంబకే తెలియు, జగతి నంతయు కలదు,

పంచుకొని తింద మీ పంచభూతా లిచ్చు
పంచభక్ష్యా, లింక పట్టింపు వలదు !

పుష్క లాహార సంపూర్ణమౌ నేల,
వనజాక్షి ! నీది నా దను భేద మేల ?
పంచుకొన్నవటమ్మ పక్షు లీ చెట్లు ?
విభజించుకొన్నవా ఇభము లా బీళ్ళు ?

నీ కెంత వలయునో నిండుగా గైకొమ్ము,
చేతనైనంతగా చేయుమా సాయమ్ము,
సామర్థ్యముకు మించి శ్రమ పడబోకు,
అవసరానికి మించి అందుకోరాకు.

సుంకుపై నున్న దీ వంక సన్నపు చేను,
గూడ వేసెద, మందుకోవమ్మ తాడు !
మా బావ ఆ దుక్కితో బాధపడుచుండె,
నీ భర్త పోయి కొంచెము సాయపడలేడె ?

(ఆశావతి నిశ్చేష్టురాలవుతుంది. అటూ ఇటూ పారజూస్తుంది. కొన్ని చేలు పొట్టమీద, కొన్ని పువ్వారంమీద ఉన్నాయి. దూరంలో క్షేత్రయ్య ఆకు మడి కాబోలు దున్నుతున్నాడు. చేలకు నీరందడం లేదు. ఆ పరిస్థితిలో సూరన్న, చంద్రన్న ప్రవేశించారు.)

సూరన్న :
వానదేవుడి వళ్లు వాచిందిరా !
గాలిదేవుడు మేడ గట్టాడురా.

చంద్రన్న :
కురిసి, కురిసీ యెందు
కూలబడి పోయాడో !

వీచి, వీచీ యెచట
విరగబడుతున్నాడొ !

సూరన్న :

వెదకరా నా తండ్రి, వేదాల పుటలు !
పెట్టవే నా తల్లి, పెద్దలకు నతులు !

చంద్రన్న :

తెలిమబ్బు కొండల్లో
తిరుగుతున్నాడొ !
తలిరాకు పంకాల
కులుకుతున్నాడో !

సూరన్న :

పల్లాలలో దొర్లి ప్రవహించు నీరు !
మెరకలను తడిలేక దురపిల్లు నారు !

చంద్రన్న :

పాతాళమున కేగి
పండుకొన్నాడో !
తెరలెత్తి యే కడలి
తేలిపోయాడొ !

(సమీపంలో భూలక్ష్మి కనిపిస్తుంది. చూచి వందనం చేస్తారు. అక్కడ గల నీరు గూడను ఆమె వారికి అందిస్తుంది.)

భూలక్ష్మి :

పల్ల మెరిగిన నీరు
ప్రజల నే మెరుగు ?

అడ్డు కట్టలు వోసి
ఆపండి వాగు !

అగిసి కంపలు కోసి,
జిగి మన్ను పోసి,
వెడద బోదెలు తీసి
వెయ్యండి గూడ !

ఆశతో కనుచున్న
దా రక్త శాలి.
పొట్టతో నున్న దా
మెట్ట పొలమంత.

కప్ప నూరేగించి,
క్రతువు లొనరించి,
చిక్కిపోయెను రైతు
చినుకైన పడక.

కొండ కోనల మేసి
పండుకొన్నది మొగిలు,
నెమరు నురుగున వాగు
నిండి పరువెత్తు.

తాటి యాకుల గూడ
తంత్ర మెరిగిన గూడ

గూడతో నది నీరు
తోడ రండిక మీరు !

(భూలక్ష్మి, సూరన్న, చంద్రన్న నిష్క్రమిస్తారు. రంగంలో కొంత కాంతి వారితో కూడా పోతుంది. ఆశావతి దిగాలుపడి చూస్తూ ఉంటుంది. మబ్బు పట్టినట్టుగా వున్న అక్కడికి భోగయ్య వచ్చి కాయలు నములుతూ ప్రవేశించాడు. అతణ్ణి చూడగానే ఆశావతి ఉగ్రురాలయింది. ముఖం ఎఱ్ఱబడింది. ఆమెను చూచి భోగయ్య ఉలిక్కిపడ్డాడు.)

ఆశావతి :

ఇదియెల్ల నీ సృష్టి
యే నంచు బొంకితివి !
ఏమోయి సోమరీ !
ఇదియేన మగ సిరి ?

చూడు మా పొలములో
వాడ వాడంతా,
భూదేవి కేరీతి
మ్రొక్కుతున్నారొ !

క్షేత్రయ్య పాలించు
క్షేత్రాల బట్టి
మనవంచు కల్ల లా
డిన నేరమునకు,

భూలక్ష్మి నన్నెత్తి
పొడిచింది చాల

వాచింది నెత్తి చీ
వాట్లతో నాకు.

అతని చెమ్మట జాలు
ఆ పంట చేలు,
ఆమె కుంకుమ రేఖ
ఆ యేరువాక.

నెత్తురు కరగించి,
నీరుగా పారించి,
పండింత్రు సర్వ సం
పదలు దంపతులు !

(భోగయ్య అప్రతిభుడై అలానే చూస్తూ, కొంచెం సేపు నిలబడ్డాడు. కొంచెం తెలివి తెచ్చుకున్నాడు. పొలమంతా ఒకసారి పరకాయించాడు. అతనికి ఎక్కడ చూచినా వ్యవసాయపు పనులే కనిపిస్తున్నాయి.)

భోగయ్య :

ఈ వినూతన సృష్టి
యెల్ల నా దనుకొంటి,
ఏ యుక్తి క్షేత్రయ్య
కీ శక్తి నిచ్చెనో !

మించి పోయినదేమి ?
మెలత నాతో రమ్ము;

భాగ్య హేతు వదేమొ
పట్టుకొందము లెమ్ము !

అతనితో పని చేసి,
ఆమె స్నేహము చేసి,
కల రహస్యము లెల్ల
తెలిసి కొందము పోయి.

(ఇద్దరూ వడివడిగా ముందుకు అడుగులు వేస్తారు. వారిని చీకటి కెరటం అనుసరిస్తుంది.)

## ఏడవ రంగం

(ఉషఃకాలం. చీకటి కొండల్లో వెలుగు పాలు ఉబుకుతున్నాయి. రాత్రి పగటిని ప్రసవిస్తున్నది. గోరింక పిల్లలు చెట్ల తొర్రల నుంచి కేరింతలు కొడుతున్నాయి. గుబగుబలాడుతూ ఎదుగుతున్న పైరు పొలాల గట్లవెంట సస్య నాట్యం చేసుకొంటూ వస్తున్నది. ఉషస్సే ఆ రీతిగా విహరిస్తున్నట్టున్న దామె. రంగంలో రంగు రంగుల కాంతులు, పరిమళాలు, శ్రావ్య ధ్వనులు ప్రసరిస్తూ ఉంటాయి.)

సస్య :

చీకటి మునిగిన జీవీ ! లేవే !
వాకిటి గుమ్మం తెరిచాను !
వేగుచుక్కలో వెలుగిదిగో నే
వెండి బిందెలో పితికాను !

పొడుపు కొండ కర్పూర దీప మిది,
పువ్వారమునకు నివ్వాళి !

పసిబుగ్గల సంజ కెంజాయ యిది,

పంటల తల్లికి పారాణి !

ముసుగును మడిచి, గుడిసెను విడిచి,

పసిడి చేలలో పదమిడ రావే !

భూమిని కొలిచి, లేమిని తుడిచి

ప్రేమకు దోసిలి నిడవే !

(మేధానిధి ప్రవేశిస్తాడు, సస్యను చూస్తూ అలానే నిలబడి వుంటాడు. సస్య చిరు నవ్వుతో, నాట్యం ఆపి, అతణ్ణి చూస్తుంది. అపరిచితులు కారు వారు. అనురాగ రంజితులే. కాని ఏకాంతంగా కలుసుకోడానికి ఇదే ప్రథమం. అపూర్వ వాంఛ లేమో వారిని లజ్జా భరితుల్ని చేసి ఉండవచ్చు. క్షణకాలం పాటు ఎవరూ మాట్లాడరు. తర్వాత సస్య ప్రసన్న విలోకనాలచే ప్రోత్సహించబడి మేధానిధి మాట్లాడతాడు.)

మేధానిధి :

భూమికి నాగలి, రామికి వాకిలి,

ప్రేమకు దోసిలి ప్రియురాలా !

పండ్లు, పాయసము, పరమాన్నముతో

పండుగ జేతమె, ప్రియురాలా !

కొండలు పన్నీ, గుండెలు దున్నీ

కోరికలూడ్తుమె ప్రియురాలా !

రంగుల రుచులు, బంగరు విరులు

కొంగున కెత్తవె, ప్రియురాలా !

ఓ సుశ్యామా ! ఓ సుమ శరమా !

ఉర్వికి వరమా ప్రియురాలా !

పృథివీ సారమ ! హృది కాహారమ !

ప్రేమ హారమా, ప్రియురాలా !

(మేధానిధి అంజలి ఘటిస్తాడు. సస్య ఉండి వుండి కిసుక్కున నవ్వి తళుక్కున మాయమై పోతుంది. పాలు పోసుకుంటున్న జొన్న చేలు, గెలలు నేలకు తగులుతున్న కొమ్మ చక్కెర కేళీ అరటి తోటలు, మంచెలు, దిగుడు బావులు – ఎటు పోయిందో ! మేధానిధి కళ్లు నలుపుకొని అటూ – ఇటూ చూచి, ఒక దిశకు నిష్క్రమించగానే, రెండో దిశ నుంచి సస్య సన్నగా పాడుతూ ప్రవేశిస్తుంది. రంగం మీద లేత యెరుపు కాంతి ప్రసరిస్తూ వుంటుంది.)

సస్య :

అంధకాలపు కంధరములో

బంధివై పడియున్న మనిషీ !

రాతియుగమున ప్రాత గొంగళి

తాతవై పడుకొన్న మనిషీ !

లేచి రావోయ్,

లేత యుగముకు !

మంద మందము మలయ పవనము

మధుర మధురము మత్త కోకిల,

సుందర తరము సుప్రభాతము,

కందళించెను కాంతి లోకము

లేచి రావోయ్
లేత వయసుకు !

చిత్రకూటపు శిఖర కాంతుల
చిత్తమును వెలిగించు కోవోయ్,
పద్మ మిత్రుని ప్రభాకరముల
బద్ధకము తొలగించు కోవోయ్,
లేచి రావోయ్,
లేత యూహకు

(పాడుకొంటూ నిష్క్రమిస్తుంది. వెనుక నుండి వెతుక్కొంటూ మేధానిధి ప్రవేశిస్తాడు. అతడి చేతిలో ఆమె ఆటలో నుంచి జారిపోయిన పువ్వులు వుంటాయి. వాటిని అతడు మాటి మాటికి మూర్కొంటూ వుంటాడు. అక్కడ పడి వున్న పువ్వులు కూడ ఎత్తుతాడు.)

మేధానిధి :

ఓ నవనారీ, ఓ సుకుమారీ !
ఓ మనోహరీ ! ప్రియురాలా !

మేఘా కృత భూ
మీ సుమయూరీ
మృదుల మాధురీ ! ప్రియురాలా !

పైరు చేలపై పాలవెల్లిలో
బాల చంద్రికా ! ప్రియురాలా !
శత పత్రమ్ముల
సర్వావనిలో
స్వర్ణ కర్ణికా ! ప్రియురాలా !

అవని జనని తరుణాంక పీఠమున

అన్నపూర్ణవే ! ప్రియురాలా !

అలసిన నాయరు

ణాంత రంగమున

అమృత భిక్షవే ! ప్రియురాలా !

(మేధానిధి నిష్క్రమిస్తూవుండగానే వెనుక నుంచి సస్య నవ్వుతూ ప్రవేశిస్తుంది. రంగం మరింత ఎరుపెక్కుతుంది.)

సస్య :

భూ మాత పాలిండ్లు

ఈ పాల చేలు,

గ్రోలు కొలదిగ చేపు

కోరికల పాలు

శక్తి గల బిడ్డకే, యువకుడా !

తల్లి

చన్నిచ్చు ప్రీతితో, యువకుడా !

తల్లియైన బిడ్డ

తాపత్రయె కుడుపునా ?

పండైన రస ధార

పిండకయే కల్గునా ?

పీడనమ్మున గాక, కరగదో యువకుడా !

మనసు

ప్రియమార కరగదో యువకుడా !

అంభోధి కుంభాల
అవిగో నీరాలు,
ఆకాశ కలశాల
అవిగో క్షీరాలు,

పట్టియా పారాలు, యువకుడా !
బోదెలకు
ప్రవహింపజేయుమా, యువకుడా !

(మేధానిధి పాడుతూ ప్రవేశిస్తాడు. అతణ్ణి ఇక అవస్థ పెట్టకూడదను కొన్నదో యేమో సస్య అక్కడే ఆగుతుంది. ఈ లోగా ఇద్దరి చేతులలో చేరిన రకరకాల పుష్పాలను ఒకరి పైని ఒకరు జల్లుకొంటారు.)

మేధానిధి :

రేయి పగలనక తీ
రిక లేని నీకేల
నిండు సేవలు గొనక
పండదా యీ నేల ?

సంపంగి పూ పొదలు, ప్రియురాలా !
చాయ చెడి యున్నవే, ప్రియురాలా !

నీ పాదములు సోకి
నీ పొలము పచ్చనౌ,

నీ చేతి సైగలకె
నీ చేను ఫలితమౌ

గున్న మామిడి కొమ్మ, ప్రియురాలా !
కునుకు లేకున్నదే, ప్రియురాలా !

సస్య :
గున్నమామిడికేమి ?
కొమ్మ కోకిల లేదె ?
మధ్యాహ్న మైనదీ
మడిలోన తడి లేదు !
నీడలకు సమయమా ? సఖుడా ?

నీరు
గూడందుకోవోయి, సఖుడా !

(దగ్గరిలోనే లోతునుంచి నీటిని తోడే ఏర్పాటు వుంటుంది. అక్కడ నీరు గూడ వుంటుంది. ఉభయులు చెరో వైపునకు చేరి తాళ్ళు పట్టుకొని నీరు తోడతారు. తర్వాత గూడను అక్కడ పారవేస్తారు.)

సస్య :
రవి సర స్సారాలు
భువి కేత మెత్తేము.
దివి గంగ సాధించి
హవిసు పండించేము,

వరిగింజ కడుపులో, సఖుడా !
నిండు
వసుధనే పొదిగేము, సఖుడా !

మేధానిధి :

ఖర కరాగ్రము సోకి
నేరలు తీసిన నేల
చంద్ర కుంభము వంచి
సాగు చేసేము

ప్రతిగడ్డి పోచనూ, ప్రియురాలా !
బాలెంత జేసేమె, ప్రియురాలా !

సస్య :

చిరుబోదె పుట్టింట
సిరులు తెద్దాము,
వరికన్నె పురిటింట
మురిసి పోదాము,

పాడిగా, పంటగా సఖుడా !
జగము
ప్రజల కందిద్దాము, సఖుడా !

మేధానిధి :

బాల సూర్యుని బోలి
ప్రణయ మున్మేషమై
ఎదుట చంద్ర విభేద
మేమున్న శూన్యమై

పైపైకి లేదామె ప్రియురాలా !
పరవస్తువవుదామె, ప్రియురాలా !

సస్య :

పర భృన్మధుర గాన
పథములో లగ్నమై,
ప్రణయ మోహన రాగ
వనధిలో మగ్నమై

కొసదాక పోదాము, సఖుడా !
మనము
రస రూపమవుదాము, సఖుడా !

(ఇర్వురూ కేలు కేలు గ్రహించి నాట్యం చేస్తారు. రంగంలో అరుణకాంతి ప్రగాఢమవుతుంది. అందులో వారు కలిసి పోతారు )

## ఎనిమిదవ రంగం

(పొలంలో మకాం. అదొక చేతి పనుల కార్ఖానా. రాట్నం, కొలిమి, సారె, బాడితె వగైరా అక్కడక్కడ వుంటాయి. వ్యవసాయంతో పాటు గృహపరిశ్రమలు వృద్ధి పొందాయి. వేటగాళ్లుగా, పశుల గాపరులుగా, దేశ ద్రిమ్మరులుగా వుంటున్న వాళ్లు వ్యవసాయంలో స్థిరపడుతున్న కొలదీ, జన సంఖ్య, ఆహారోత్పత్తి అవసరమూ పెరుగుతున్న కొలదీ, కర్మ విభాగం సమాజంలో ప్రవేశించసాగింది. కర్మగుణాలను బట్టి, సామర్థ్యాన్ని బట్టి, విభజించ బడుతున్నది. ఒక్కొక్కళ్ళు ఒక్కొక్క రకం పనిలో అభిరుచి, ఉత్సాహం, సామర్థ్యం ప్రదర్శించసాగారు. ఏ పనిలోనూ ఉత్సాహం చూపని పని బద్ధకం వాళ్లు కూడా పుట్టసాగారు. ఆశావతీ భోగయ్యలు ఈ రకానికి చెందిన వాళ్ళు. ఆశావతి ఒక రాట్నం దగ్గర దిగాలు పడి కూర్చుని వున్నది. భోగయ్య అన్నపు మూటతో ప్రవేశించాడు. మూట ఒకచోట పెట్టి, రాట్నం దగ్గర కూర్చుని త్రిప్పుతాడు. దారం బారెడు వచ్చి తెగిపోతుంది. ఆశావతి దానిని దూరంగా నెట్టేస్తుంది. )

ఆశావతి :

చేయలేనిక నేను చేయలేను పని,
బ్రతుక లేనిక నేను బ్రతుకలే నిచట.
విశ్రాంతియే లేక, వేడుకే లేక
పొట్ట కోసము బ్రతుకు పూడ్చుకోలేను
పోదాము పదవోయి
ఏ దేశమైన.

ఎందుకీ దున్నడా, లేమిటీ పనులు ?
ఎచటివీ రాట్నాలు ? ఎన్నటికి ముక్తి ?
భూలక్ష్మి ఆదేశములకు తల ఒగ్గి
కట్టు కొయ్యకు వలే గడపలే నింక
చాకిరీ పని కంటే
చావె మేలోయి !

పనిచేయు మనకనే పండ్లిచ్చు వనుల
సుఖముగా జీవించుచున్న నను దెచ్చి
నాగలందును, సింగి నాదమటంచు
పశువులతో కూడి పని చేయమందు
హాయిగా భూలక్ష్మి
ఆడుకొను చుండ !

భోగయ్య :

ఆడుకొను చున్నదా హాయిగా నామె ?
క్షేత్రలక్ష్మిని గొల్చి చిక్కి పోయినది

పొదుపుగా కూర్చుండి పూటకో గంట
బట్టకై రాట్నమ్ము పట్టగా లేవె ?
దైవమిచ్చిన ఫలము దక్కుట యెట్లు,
పదిమందితో కూడి పనిచేయ కున్న ?
పంటభూముల తోడ పనికూడ మనది,
నచ్చిన పనికన్న నాకమే ముంది ?
దున్నలో నొక్క దూడగా నేను
కూడ దున్నుట లేదె గోధుమ మడులు ?

ఆశావతి :

చెప్పుమెన్నైన, నే
ఒప్పు కొనలేను ;
పదిమందితో కూడి
పనిచేయలేను;
నాదన్న దేదైన
నాకు లేకుండ
పరులపై ఆధార
పడి బ్రతుక లేను;
ఈ పైరు భూములలో
ఈ పాడి పంటలలో
మన దేదియో తెల్పు
కొని రమ్ము ! పొమ్ము !

భోగయ్య :

సృష్టించితివి కొత్త
సిద్ధాంతమును, సతీ !
మహి విశాలము చాల,
మనదన్నదెట నుండు;
మనదెయగు నంతయును;
మనది కాదింతయును.
భాగ్యమది యెంతైన
బ్రతుకుటకు కాదటే ?
అవని యెల్లను మనదె
యను కొమ్ము, బాధేమి ?
చేసినట్లే చేసి,
చెట్ల నీడలు చేరి,
ఆడుకొందము మనము,
అడుగు వారెవ్వరే ?

ఆశావతి :

పిరికివాడవు నీవు
పెద్దగా వాగెదవు !
సోదరుని క్షేత్రాలు
సొంతమెట్లగు మనకు ?
"నాది" యను సంతృప్తి
నాకు లేకున్నచో

ఎల్ల నా యిష్టమే
చెల్లుబడి కానిచో
ఆనందమేరీతి
అందుబాటగు నాకు ?
అవని యంతయు నాదె
అనుకొన్న ఫలమేమి ?
అనుభవించుట కొక్క
అరటితోటయె చాలు;
అధికారమున్నదొక
అడుగునేలయె చాలు;
పనిచేసినను, బాగ
తిని పండుకొన్న
ప్రశ్నించు అధికారి
పై నుండ రాదు;
అట్టి స్వాతంత్ర్య ము
న్నట్టిదేనోయ్ బ్రతుకు.
పరతంత్ర మెల్ల జీ
వచ్ఛవపు చితుకు
అర్థమగుచున్నదా ?
వ్యర్థమా నా ఘోష ?
ఇకలెమ్ము, పొమ్ము, ప
ట్టుక రమ్ము, మనదేదా !

(ఆశావతి చటుక్కున లేచి పోతుంది. భోగయ్య వికల మనస్కుడై నాడు. ఆలోచనలో పడినాడు. ఆశావతి సలహా అతడికి అయిష్టమైనది కాదు. అయినా, ప్రయోజకుడు, కష్టజీవి అయిన క్షేత్రయ్య ముందు అతడు వ్యర్థుడు. క్షేత్రయ్యను ఏమిటి అడుగుతాడు ? భార్య కోరిక ఎలా తీరుస్తాడు? అంతలో క్షేత్రయ్య అక్కడికి వచ్చాడు. భోగయ్య ముఖం చూచి పరామర్శ చేశాడు.)

క్షేత్రయ్య :

ఏమోయి, సోదరా
ఏమి జరిగినది ?
ముఖము నిండా నీలి
మెయిలు క్రమ్మినది.
భూలక్ష్మి యేదైన
బోధ చేసినదా ?
అలపు తీరక ముందె
పొలము పొమ్మన్నదో ?
ఆశమ్మ యేదైన
అందాలు కోరిందా ?
ఆటవిడు పేదైన
అడిగి రమ్మన్నదో ?
సాలుకొక నాల్గు మా
సాలపని యేపాటి ?
తోటపని యెల్ల మన

కాట విడుపే కదా ?
అలసి నట్లగుపించు
అందాల మోము,
హేతువేమిటి ? చెప్పు
మేమి జరిగినదా ?

భోగయ్య :

జగదంబ తానె సా
క్షాత్కరించిన నీవు,
అన్న పూర్ణమ్మయే
ఆదరించిన నీవు,
అధికారివై యుండ
అహిత మెట్టిది మాకు ?
తలమున్కలుగ తిండి,
తగినంత విశ్రాంతి
వేడుకలు తీర్చుకొను
వీలు విన్నంత
నరుడికి కావలసి
నట్టిదేదియు లేదు.
కాని నాదన్నదే
కనపడదు సుంత.

క్షేత్రయ్య :

ఇదియేమి, సోదరా !
ఏమిటా మాట ?

నా – నీ విభేదమం
తయు నీటిమూట
ఎవరు తెచ్చిన నేమి ?
ఈ లక్ష్మి యెల్ల
అమ్మదేకద ? అమ్మ
అందరికి అమ్మ !
బలమైన కొడుకుచే
హలము పట్టించి,
తెలివైన కొడుకుచే
తెప్పించి ఫలము,
అందరికి సమముగా
అందించు మాత ;
ప్రతివాని స్వయముగా
పాలించు మాత;
సుతుని తక్కువ చూపు
చూడదు మాత ;
బలహీనుడని కించ
పడనీదు మాత ;
నను జూచినది కాన
నా కొసంగినది.
నీవు నే నొక్కటే
దేవి వద్దనకు;

నాది, నీ దనునదే
లేదురా, యిచట;
అందరము పనివార
మంతయును ఆమెదే.

భోగయ్య :
నీవన్న ప్రతి మాట
నిజమే ముమ్మాటికీ,
ఉమ్మడిదేయౌను
ఉర్వీసంపద యెల్ల,
తల్లికి బిడ్డలం
దరును సమానులే;
కాని – ఈ సృష్టిలో
కననయ్యె ఒక వింత,
బలహీనసుతు జూచి
బాధపడు తల్లి --
బలవంతుడౌ తనూ
భవు జాచి గర్వించు;
బలహీనుడను నేను
బాధపడ లేను,
"ఇదినాది" యను కొనుట
కేదైన నిమ్ము.

క్షేత్రయ్య :

నాది నీదను క్రొత్త
న్యాయమునె సృష్టించి
సమసంఘమున విప్ల
వము దెచ్చితివి నేడు ;
భీకరమ్మౌను దు
ర్భిక్షమున కంటె ఇది,
ప్రాణాంతకము జల
ప్రళయమున కంటె;
ఇట్టి సిద్ధాంతమున
కేనొప్పు కొనలేను.
అంగీక రింపలే
నసమతా సూత్రమ్ము;
సొంతమన్నది లేక
శాంతి దొరకని యెడల
నీవె ఈ పొలము ల
న్నియు దున్నుకొనుమోయి !
మాకెల్ల నీవె పుర
మాయింపు మిక పనులు ;
సంతోషమున మేము
సాయపడుదుము నీకు;
అధికారమెవరి ద

న్నదికాదు ముఖ్యమ్ము,
అందరును సములె అ
న్నది ముఖ్య ధర్మమ్ము,
ధర్మమ్ము నాల్గు పా
దముల నడచిన చాలు,
శకలముల్ కాకున్న
చాలు మానవ జాతి;
ఈ కోల చేకొమ్ము,
జగదంబ పరము లివి
చాల పవిత్రముల్,
నవకృషీ కార్యముల్
నడిపింపు మింక

భోగయ్య :
సోదరా ! నీ వెంత
సుగుణ శీలుడ వహో !
స్వార్థ మింతయు లేక
సర్వమ్ము నొసగితివి;
నేను మాత్రము వట్టి
నే కోరితిని గాని,
మెడగట్టు కొందునా ?
మ్రింగుదున కాకున్న ?
ఈ భూములెల్ల నే

నేలుబడి చేయగా
ఊరక నీ వుండు
టోర్వగలనే నేను ?
అంబకడకేగి, నీ
వామెను ప్రార్థించి
తెచ్చుకొను మింకొక్క
తేలికైన హలమ్ము
సాగుచేయగ వచ్చు
సరికొత్త భూములను
నీవు వచ్చెడి దాక
నే నిందు కృషి చేతు,
అందాక భూలక్ష్మి
ఇందుండు సుఖముగా
పోయిరమ్మిక నీవు
ప్రొద్దు గ్రుంకక ముందె
త్యాగధనుడవు నీవు
తల్లి నిను కరుణించు.

(క్షేత్రయ్యకు నమస్కారం చేసి వీడ్కోల్పుతాడు. క్షేత్రయ్య త్యాగధనుని గర్వంతో, చిరునవ్వుతో నిష్క్రమిస్తాడు. భోగయ్య గర్వంతో అట్టహాసం చేస్తాడు.)

## తొమ్మిదవ రంగం

(పచ్చని చేలు. కాలువగట్టు. సస్య, మేధానిధి చెరొక ప్రక్క నుంచీ ప్రవేశిస్తారు. గంతులు వేసుకొంటూ, పాడుకుంటూ వస్తారు. మేధానిధి రాజకుమారుని వేషంలో ఉంటాడు.)

మేధానిధి

ఓ మనోహరీ !
ఓ సుకుమారీ !
ఓ సుశరీరీ ! ప్రేయసీ !
నరనందన సుం
దర మందారీ !
తరుణ కిశోరీ ! ప్రేయసీ !

సస్య :

ఓ మనోహరా !
ఓ సుకుమారా !
ఓ సుశరీరా ! ప్రేయసా !
నరనందన సుం
దర సహకారా
తరుణ కిశోరా ! ప్రేయసా !

మేధానిధి

ఆడుద మిందు,
పాడుద మిందు
క్రీడ నేర్పుదమె, పూలకు !

సస్య :

ఆడుద మిందు
పాడుద మిందు
గూడవేత మీ చేలకు !

మేధానిధి

నవధాన్యములా ?
నవ మణులా ! నీ
నవ్విన ముత్యాలివి, సకియా !
నవ మల్లికలా ?
నలినములా ? నీ
నవ్వుల వెన్నెల లివి సకియా !

సస్య :

వాన మబ్బులా ?
తేనె పెరల ? నీ
మానస మాధురు లివి, సఖుడా !
బీటలు తీసిన
తోటల కీ మన
పాటలు తడులిడునా? సఖుడా ?

మేధానిధి :

ఎంతసేపును పొలము పనులే,
సుంతయును విశ్రాంతి తలపవు,
రమ్ము ! సఖి ! ఈ నీడలందు క్ష
ణమ్ము కూర్చుని పోదము,

అంతలో మీ యమ్మ వచ్చిన,
ఆమెయే చూచుకొను నంతయు,
కాయకష్టము కష్టజీవికె
కాని, సరిపడదు నీ వంటికి.

సస్య :

ఏమంటివి ? మేధానిధి !
ఏమిటి సరిపడ దంటివి ?
కష్టజీవి కూతురు తా
కష్టజీవి కాకేమగు ?
నా జననీ జనకులు మును
నాకంటెను సుకుమారులు,
నీ - నా అందముల కెల్ల
నెలవు వారి కృషియే కద ?
సరిలే - నే నిపుడె వచ్చి
జవాబిత్తు సంతృప్తిగ;
మడికి నీరు కట్టి వత్తు
మాటలోనె, ఇట నుండుము !

(సస్య పోబోతుంది. మేధానిధి చటుక్కున ఆమెను అడ్డగిస్తాడు.)

మేధానిధి :

పోబోకుమా, చెలీ !
పూబోణీ; నెచ్చెలీ !
ప్రొద్దెక్కిపోయినది.
పోవలయు సౌధముకు :

ఇంకొక్క ఘడియ సే
పే ఆడుకొని పొమ్మ,
తెలియవో, నిన్నెంత
వలచి యుంటినొ నేను ?

సస్య :
ఎంత నను వలతువో,
అంత నే నిను వలతు;
ఆగలేవా, ఒక్క
అర లిప్తలో వత్తు?
ప్రొద్దెక్కినది, ఎండి
పోవుచున్నది చేను
చేనుపోయిన వెనుక
నేను మని ఫలమేమి ?

మేధానిధి :
ఒక చేను పాడైన
ఇక చేలు కలుగవా ?
నీచమౌ వృత్తిలో
నీ సొబగు పాడవద ?

సస్య :
ఏది నీచపు వృత్తి ?
ఏది మేలిమి సొబగు ?
జీవనము నుండి నవ
జీవనము గల్పించు

కృషి నీచమైన, ఇం
కేది మన్గడ ? ప్రభూ ?
నా చేనిలో నీరు
నా నాడుల స్రవించు
అమృతమై –
నా తోటలో ననలు
నా యెడదలో విరియు
అమరమై –

మేధానిధి :

బోదెలలో మన్ను తీయ
బురద యౌను నీ చేతులు,
వాతాతప బాధలలో
వసివాడును నీ వదనము;
పల్లవములు పంకిలమై
పద్మమె చీకాకు పొంద
ప్రణయమె జీవితముగ గల
బాల సూర్యుడెట్లోర్చును ?

సస్య :

మంజులమ్మైన నా
మడిలోని వరి మొక్క
ఎండిపోవుచునుండ
గుండె కరగని నీకు
కడిగిననె పోవు పం
కము జూచి దుఃఖమా ?

చేతి కంటిన బురద
చిటికలో మాయమౌ,
మనసు నంటిన బురద
చన దెన్ని జన్మలకు,
లోనకి చూచుకో,
లోపమున్నదొ యేమొ !

నా వదనము చెమర్చు
నలినాప్తు నెదుట,
నా యెదుట నీ హృదయ
నలిన మార్ద్రమ్మగును ?
యోచించుకొని చెప్పు
మొక క్షణములో వత్తు

(సస్య వెళ్ళబోతుంది. మేధానిధి ఆమెను తిరిగి అడ్డగించి, చేయి పట్టుకుంటాడు. అతనిలో ఇప్పుడు కోపం, కాఠిన్యం తలెత్తుతాయి.)

మేధానిధి :

దేవీ ! ఈ చేలన్నియు
నావీ ! సొంతమ్ములు;
నీరుగట్ట, ఆరగట్ట
నేనే అధికారిని సుమి !

పని మనుషులు నీ జననీ
జనకులు నా పితరుంకడ;
హక్కులేదు, రమణీ; నా

యాజ్ఞమీరుటకు నీకు;
ప్రేమించినవాడను, నా
ప్రీతికంటె వరి మొక్కకు
నీర్వెట్టుటె ఘనముగ క
న్పించుచున్నదా నీకు ?

సస్య :

స్వామీ! మాతృప్రేమము
ఏ మెరుగును గొడ్డుటావు ?
తను జేరిన లే దూడను
తన్నును కాలికొలందిగ ?
చేయారగ పెంచిన ఒక
సేద్యగానికే కాక--
మడిలోపలి మొక్కమీద
మమత కలదె వ్యవహారికి ?
చేలన్నియు నీ వగుచో
చేసికొమ్ము సేద్య మీవె,
నేడే నా తల్లి, నేను
నిర్వాసులమై పోదుము;
బానిస నని తెలియక నే
భాషించితి, క్షమియింపుము,
లేడికి తోడేలున కె
ట్లేర్పడు స్నేహము జగాన ?

(సస్య నిష్క్రమిస్తుంది. మేధానిధి నిశ్చేష్టుడవుతాడు. కోపోద్రిక్తుడును అవుతాడు. ఒక్కసారిగా ప్రేమ ద్వేషంగా మారిపోతుంది.

మేధానిధి :

ఇంతేనా నీకు నాకు ?
ఇంత ఘోర మేల జరిగె !
తెలితామర మొగ్గ యెట్లు
దినమణినే ధిక్కరించె ?

ఈ పొలమంతయును నాది,
ఇచ్ఛకొలది వర్తింతును,
ఖండింతును పండ్ల చెట్లు,
గండి కొడుదు ఏటి గట్లు,

కష్టజీవికే అంతటి
గర్వము తల కెక్కియుండ,
యజమానుడ, నా కేమిటి ?
అడ్డమెవరు నాకిక్కడ?

(మొక్కలను లాగివేస్తూ, చెట్లను నరికివేస్తూ, పిందెలను దూసిపోస్తూ, ఇష్టం వచ్చినట్టు విహరిస్తాడు మేధానిధి. రంగం రక్తకాంతిలో బీభత్సంగా కనిపిస్తుంది. అట్టి స్థితిలో భూలక్ష్మి ప్రవేశిస్తుంది. ఆ దృశ్యం చూచి కెవ్వున అరుస్తుంది. దీనంగా కేలు మోడుస్తుంది.)

భూలక్ష్మి :

నాయనా ! నాయనా !
నను గన్న తండ్రి !
ఇది యేమి టల్లరో
యీా ? కన్న తండ్రి !
జీవితము పోసి పెం
చిన తోట లివ్వి,
మట్టి పాల్సేతువా ?
మన సెట్టు పుట్టె ?
పెంచు టొప్పును కాని
త్రుంచుట తగవ ?
నీ వంటి ధీశాలి
కీ వెర్రి తొడవ ?

మేధానిధి :

నా స్వేచ్ఛా మార్గములో
నల్ల రాయి వెవరు నీవు ?
యజమానికి బోధించే
హక్కున్నదె పాలేరుకు ?
చెప్పిన పని చేయుటకే
సేవించుటకే పుట్టిన
బానిసవే నీ కెందుకు
ప్రభు కార్యములో జోక్యము ?

భూలక్ష్మి :

అయ్యయ్యో ! బిడ్డా ! ఏ
మన్యాయము పుట్టివచ్చె !

ఈ ఫలవనమెల్ల మా శ్ర
మా ఫలితమె కాదటోయి ?
ప్రకృతి మాత నుపాసించి
పడసినార మీ భాగ్యము;
ఎవరిదైన నేమని మీ
కిచ్చినాము ధర్మముగా;
పని యెల్లను మేమె చేసి
పంట మీ కొసగుచుంటిమి;
మీ కొసంగినాము కాన
మీదే యనుకొను మంతయు,
ఐన, నెట్టు లోర్వగలను
అన్నము పొడగుచునుండ?

మేధానిధి :
మూసికొనుము నోరు, నవ్వి
పోదురు ఎవరైన విన్న;
బానిసకును, యజమానికి
బాంధవ్యము కల్పుదువాహా !
వర్షాధారముతో మన
వలసియున్న దిగుడు బావి
తానే జీమూతమునకు
ధారపోసెనా నీటిని ?
మీరు వేరు, మేము వేరు,
మీది గుడిసె, మాది మేడ,

నక్కెక్కడ ? నాకలోక
మెక్కడ ? బోటీ ? తొలగుము !

భూలక్ష్మి :

చుట్టరికమె అనుమానిం
చుట వింతగ తోచె, బాబు !
నేటి వాడ, వనుచరుడవు,
నీవే యిట్లన గల్గిన--
తరములు పోయిన కొలదియు
పెరజాతీయుల మనరే ?
హలము చేయి జారినంత
అధములమై పోయినామె ?
లోకమాత కరుణించిన
లోటే కొత్త హలాలకు ?

(అంతలో ఆశావతి అక్కడికి వస్తుంది. రాణివలె వుంటుంది. ప్రక్క పొదమాటునుంచి ఈ ఘర్షణ కొంత విన్నదిలాగుంది. వెటకారంగా ప్రారంభిస్తుంది.)

ఆశావతి :

కొత్త హలాల్ లోటేమిటి ?
కోట్ల కొలది దొరుకుతాయి,
చెపుదు గాని దొరికినపదు,
ఇపుడు నోరు మూసుకొనుము;
అదిగో ఆ మెరక పొలము
ఆరిపోయి నెర దీసెను;

పోకిళ్లను కట్టిపెట్టి
పోయి నీరు కట్టు మోసి;

మేధానిధి :

అమ్మా ! ఈ పొలములన్ని
ఆమె స్వార్జితములె నంట,
దయ దలచి ఇవన్ని మనకు
ధారవోసినారంట !
రాణివి కావా నీవు ?
రాజు కాడె నా జనకుడు ?
రాజకుమారుడ నేను, ప
రప్రాభవ మెట్లోర్తును ?

ఆశావతి :

ఏ మే మే, భూలక్ష్మి ?
హీనురాల ! ఏమంటివి ?
నీదా ఈ రాజ్యమెల్ల ?
నిరూపించుకోగలవా ?
ఇదిగో విను, మింకొక మా
రిట్టి కూత కూతువేని,
పళ్ళు రాలగొట్టి, నెట్టి,
పరిఖలోకి త్రోయింతును !
పో పోవే, పొగరు పోత !
ప్రొద్దెక్కెను, పని ఆగెను;

కుక్కిన పేనట్లుండక
నిక్కిన నేమగు పేదకు ?

(భూలక్ష్మిని గెంటివేస్తుంది. మేధానిధి కేసి తిరిగి, చిరునవ్వు నవ్వుతుంది.)

ఆశావతి :

వేలెడంత పిల్ల నిన్ను
విసిరి కొట్టి పోతే --
వెర్రివానివలె గంతులు
వేస్తూ, చూస్తూ వుంటివె ?
సిగ్గు లేదటోయీ ? మగ
సిరి ఇదే నటోయీ ?
సాగివెళ్ళు, మదిగో ఆ
సస్య ఇటే వస్తున్నది.
తలబిరుసు ప్రదర్శిస్తే
బలమింత ప్రయోగింపుమ !
రాక్షస పద్ధతి పెండ్లియె
రాణించును మగవానికి.

మేధానిధి :

ఇపుడె పోయివత్తు, తల్లి !
ఏమైనను పట్టి తెత్తు,
బలవంతముగా నైనను
పాదము లొత్తింతు నీకు.

( మేధానిధి వెళతాడు. రెండవ ప్రక్కనుంచి రాజ ఠీవితో భోగయ్య ప్రవేశిస్తాడు.)

భోగయ్య :

ఓసి దేవి ! చూచినావె
ఓడలు బండ్లెట్లయినవో ?
సంపద కధికారు లెట్లు
చరణదాసులై పోయిరో ?
తెలివంటే నాది కదా ?
ధీరుడంటె నేను కదా ?
నెత్తుచుక్క రాలకుండ
నేలకు పాలకుడ నైతి !

ఆశావతి :

చాలును, నీ తెలివి చూచి
చాలగ సంతోషిస్తిని,
తన్ను కొనకు నిన్ను నీవె,
తరలు మింక కోటకు, ప్రభు !
వీరపత్ని కాకున్నను
వీరమాత కాదలచితి,
సాధించిన రాజ్యము ని
ష్కంటకముగ చేయవలయు;
సస్యను చేపట్టి జయము
శాశ్వత మొనరింపవలయు.
(ఇర్వురు నిష్క్రమింతురు.)

## పదవ రంగం

(పొలంగట్లు, ఈదరగాలి కొడుతున్నది. రంగం మసక చీకటిగా వుంది. పైరు పొలాలు విషాద గీతిక లాలపిస్తున్నాయి. నీరసంగా, నిస్సత్తువతో భూలక్ష్మి ప్రవేశిస్తుంది. ఎవరి కోసమో దిగంతాలకు చూపులు పరవుతూ వున్నది.)

భూలక్ష్మి :

నా జోడు నీ పాద
నలిన సేవకుడు,
నాదన్న స్వార్థమె
న్నడు లేని వాడు

కరుణించి కాపాడు కనకాంబ!
వరమిచ్చి పంపవే వరదాంబ!

తన దెల్లయును సోద
రునికి దానము చేసి,
తనకు దిక్కని నిన్నె
దర్శింప వచ్చాడు

ఉత్తమాధ్వము చూపి, వరలక్ష్మి!
ఉన్నతిని కరుణించు, ధనలక్ష్మి!

స్వామి నీ గుడి కేగి
చాల కాలము గడిచె,
పాలేళ్ళుగా ఇచట
భంగపడు టెన్నాళ్ళు ?

ఇటకైన త్వరబంపు, ఇనమకుటా !

అటకైన మము గొనుము, అజనికటా !

(అంతట చెమ్మటలు క్రక్కుకొంటూ సూరన్న ప్రవేశిస్తాడు. భూలక్ష్మికి నమస్కరిస్తాడు.)

సూరన్న :

తల్లీ ! తల్లీ ! ఇంకే మున్నది ?
తల క్రిందైనది బ్రతుకంతా,
కరుణ తప్పినది మన జగదంబ,
పరతంత్రులమే మనమింక

భూలక్ష్మి :

కనపడలేదా మన అపరాజిత ?
కరుణ ఎట్లు తప్పెను మాత ?
ఏమి జరిగెనో త్వరగా చెప్పుమి !
ఏడీ మన క్షేత్రస్వామి ?

సూరన్న :

గర్వపోతులకు, బందిపోటులకు
కరుణ యేమి టన్నది తల్లి,
అపాత్ర దానము చేసిన దోషము
అనుభవించుమన్నది వెళ్ళి !

జగత్కుటుంబముగా మనవలసిన
జనునకు స్వార్థము నేర్పితి మన్నది.
పీడక -- పీడిత దుష్ట వ్యవస్థకు
బీజము నాటితి మన్నది– తల్లి !

ఏరికి సర్వము దాన మిచ్చితిమొ
వారినె సేవించి బ్రతుకు మన్నది,
బానిసలకు గల కష్టము లెల్లను
పడుమన్నది, తప్పదన్నదమ్మ !

భూలక్ష్మి :

అదే జరిగియుండు ననుకొంటిని
ఆశావతి చేష్టల కర్థమిదే ;
అమాయకత్వము, అజ్ఞానమ్మును,
అతికరుణయు తెచ్చిన ఫలితమ్మిది.

ప్రారబ్ధమ్మిది, ప్రస్తుత మింతే,
దాని సంగతేమన్నది దేవి ?
తెలివి తక్కువకు తీరని శిక్షా ?
తెలుప లేదె శాపావసానము ?

సూరన్న :

దయగలదమ్మా ఈశ్వరి ! అంతటి
ధర్మశీల మరి లేదమ్మా !
రాశిచక్రముల ద్రిప్పుచు చరాచ
రముల జేయు కర్మణి, అమ్మా !

"గతి దప్పిన ఘటమేదైన తిరిగి
గాడిని పడుటకు కాలము, కర్మము

కలిసి రావలెను, వేచి యుండుడీ,
కలుగు నభ్యుదయ" మన్నది తల్లి !

అంతవరకు కైలాస పదాబ్జో
పాంత మందె తప మాచరింతు నని
అన్నాడమ్మా క్షేత్ర స్వామి, ని
రాశ చెంద వద్దన్నాడమ్మా !

(ఇంతలో మరోప్రక్కనుంచి గడగడ వణుకుతూ చంద్రన్న ప్రవేశిస్తాడు.)

భూలక్ష్మి :

ఏమన్న చంద్రన్న !
ఏమయ్యె నన్న ?
చెడు వార్త ఏమి తె
చ్చితి వింత కన్న ?
ఇదివరకె పాడయ్యె
ఎలదోటలెల్ల,
పచ్చికాయలు కోసి
పార్వైచినారు,
మంచి పని కాదంటె
కించపరిచారు.
ఇంతకన్న ఘోర
మేముందు నింక ?
వణుకుచున్నావేల ?
వాక్రువ్వ వయ్య !

చంద్రన్న :

కష్టా లెవ్వరికైనను
కట్టలుగా వస్తాయి

ఒక దానిని మించి ఒకటి
ఉద్ధత మనిపిస్తాయి.

పరతంత్రులమమ్మా, మన
కరముల నేమున్న దమ్మ ?

సస్యశ్యామల భూముల
సర్వనాశనము చేసిన
చేతులె మన సస్యను చే
జిక్కించుక పోయె నమ్మ !

వారించిన నన్ను చెంప
వాయగొట్టి పంపెనమ్మ !

భూలక్ష్మి :

ఆఁ ! ఆఁ ! ఆఁ, ఏమంటివి ?
అతి ఘోరము వాకొంటివి !
ముద్దుల తల్లిని పట్టిన
మొద్దు చేతు లెవరివోయీ ?

అడ్డముగా విరిచి వైచి
బిడ్డను రక్షింత మిపుడె.

చేతులార దాసులమై
చెడిపోయిన దుఃఖము నా
వీపు పైని కొరడాయై
పేలుచుండ నేడ్చుచుంటి,

మితిమీరిన యా ఘాత
మ్మిది దుస్సహమింక నాకు.

చావో, బ్రతుకో ఇక మన
చాకిరి కిది స్వస్తి యగుత !
క్షేత్ర స్వామికి శుభమై
శ్రీదేవికి పూజ యగుత !

లెండిక దండెత్తిపోయి
ఖండింతము దుర్మార్గము !

సూరన్నా ! చంద్రన్నా !
శూరులార ! వీరులార !
మానుష్యము బ్రతికియున్న
మహితులార ! హితులారా !

దానవతను రూపుమాపి
మానవతను రక్షించరె ?

మనిషిని తన తోడి మనిషె
మాయచేయు దుర్బుద్ధిని
బలవంతుడు బలహీనుని
పట్టి యణచు దుర్వృత్తిని

మట్టుపెట్టి నేటితొ తుద
ముట్టింతము, నడువుడోయి !

(ఉగ్రరూపంతో భూలక్ష్మి బయలుదేరుతుంది. భూమి కంపిస్తుంది. కల్పాంతమైనట్లు ప్రకృతి భీతావహమవుతుంది. మహా కోలాహలం మధ్య స్వయంప్రభ శ్యామలగా ప్రత్యక్షమవుతుంది. రంగంపై ఒంటరిగా కనిపిస్తున్న భూలక్ష్మి ఆవేశంతో ఆమె పాదాల మీద పడి పోయి మూర్ఛపోతుంది. శ్యామల ఆమెను అభయ ముద్రతో అనునయిస్తుంది.)

శ్యామల :

కారుణ్య రూపిణీ !
కర్మావతారిణీ !
చైతన్య సారణీ !
జనసముద్ధారిణీ !

ఆవేశపడకుమా !
ఆవేగ ముడుగుమా !

పిండినంతన పచ్చి
పిందె ఫలమగునా ?
నాటినంతన గింజ
కూటి కందేనా ?

పరిపక్వ దశకు తొం
దర దేనికే బిడ్డ ?

లోకమంతకు తిండి
సేకరించే తల్లి !
లోకమునె చప్పగా
నాకివైతువె కనలి !

ఎరుపెక్క నీకు, దు
ర్భర మౌను నీ చూపు !

(భూలక్ష్మి మెల్లగా తేరుకొంటుంది. అంజలి ఘటిస్తుంది.)

భూలక్ష్మి :

జయ జగజ్జీవనీ !
జయ జగజ్జననీ !

జయ జగన్మోహినీ !
జయ జగద్రాణీ !

కాయ కష్టము చేయు
కర్షకుని మీద
సోమరిని తెచ్చి రా
జును జేసి తేల ?

ధార్మికుండై న క్షే
త్ర స్వామి బట్టి
సకుటుంబముగ బాని
సను చేసి తేల ?

యాజమాన్యమ్మంచు
ఆస్తి హక్కనుచు
క్రొత్త వ్యవస్థనే
సృష్టించితేల ?

జయ జగజ్జీవనీ !

జయ జగజ్జననీ !

జయ జగన్మోహినీ !

జయ జగద్రాణి !

శ్యామల :

నేను చేసిన యట్లు

నీవు చెప్పిన దెల్ల

కాలమే చేసినది

క్రమ వికాసము కొరకు;

సకల సృష్టియు నాకు

సంతానమే గదా ?

అందరిని సమముగా

ఆదుకొందును నేను,

విజయమ్మునకు ఒకే

వెలుగు చూపుదు నేను.

శక్తి ననుసరించి

సహకరింతును నేను,

శక్తి హీనుని జూచి

జాలి పొందుదు గాని --

బలశాలి గని గర్వ

పడకుండ నెట్లుందు?

బ్రతుక నేర్చిన వాని
పక్షమే నేను !
గెల్చిన శక్తికే
కేలిత్తు నేను !
ప్రగతియే నా స్వభా
వము, వెర్రిదాన !
వెనుకబడున దెల్ల
వీగి, నశించు;
తన్వీ ! రవియు నేనె,
తారలును నేనె.
రవి కాంతిలోన తా
రల కాంతి మాయదా ?
మార్పును గుర్తించి
మసలని వాడు
కాలమ్ముపై స్వారి
కదలని వాడు
దాని కాళ్ళను బడి
దారిలో చచ్చు;
కాల బీజము నేను,
కాలవల్లిక నేను,
కాలక్రమ వికాస
మే లీల నాకు;

మార్పు నెరుంగక
మారగా లేక
కోరి దాస్యము తెచ్చు
కొన్నారు మీరు;
తొందర పడకుము.
తొందర వలన
చెడుగాని, పనిబాగు
పడ దెన్నటికిని.

భూలక్ష్మి :
క్షేమము నెరుగక
చెడితిమే యనుము,
ఎరిగిన తరువాత
ఇక ఆగలేము.
శక్తి పక్షము నీవు
శక్తివి నీవు.
శక్తి పూరింపు మ
శక్తుల యెదల !
క్షణములో పోయి స్వే
చ్ఛను గెల్చుకొందు
సర్వస్వమైన స
స్యను దెచ్చికొందు.

శ్యామల :
కాలము, కర్మము
కలిసి రాకుండ

ఇంతయు ఫలమీయ
దే కృషియైన;
బలవంతలౌ శత్రు
వుల నిప్డె కదియ
వీగిపోవుట తప్ప
వేరేమి లేదు;
విజ్ఞాన వగుము, వి
వేకమ్ము గొనుము,
శక్తి యుక్తులనెల్ల
సమకూర్చుకొమ్ము;
తప మాచరింపు, మా
త్మ విభూతి గొనుము
అపుడు నిన్ వరియించు
అకలంక జయము
అంజలి బట్టి త
నంతట తానె;
ఇప్పుడే ఎదిరించు
టొప్పు కాదమ్మ
సిద్ధించలే దికను
క్షేత్రయ్య తపము
ఓడిపోదువు, నీవ
ఓడిపోవునెడ
ఓడిపోవును మదీ

యోద్దేశ మెల్ల;
కర్మరూపిణి నీవె
కన్ను మూసినచొ
స్తంభించు కాలమే
సమయు విశ్వమ్మె !
కోపము మ్రింగుమా;
ఓపిక పట్టుమా !
పెద్దగా పెరుగుమా !
పెంచుకొమ్మా శక్తి !
నీవ యేలుదు గాని
నిఖిల లోకములు,
తెచ్చు కొందువుగాని
తీయని సస్య.

(శ్యామల అదృశ్యమవుతుంది. భూలక్ష్మికి ఏమీ తెలియటంలే, సూరన్న, చంద్రన్న ప్రవేశించి ఆమెకు వీవన వేయసాగారు.)

## పదకొండవ రంగం

(భోగయ్య భవనం చేరువలో చేలు, తోటలు. ఒక చెట్టునీడలో సస్య పడివుంటుంది. ఆమె బలవంతంగా కొనిరాబడింది. ఇంకా మూర్ఛ తేరుకొనలేదు. విచారంతో మేధానిధి అటూ ఇటూ పచర్లు చేస్తూ వుంటాడు.)

మేధానిధి :

చాచితిని నా కేలు, సస్యా !
సాదరమ్ముగ ప్రేమ కోసము,

చేతి భిక్షాపాత్ర మట్లే
చితుక గొట్టితివి !

రాజ సుతు దధికారియను మ
ర్యాదనైనను చూపవైతివి ;
చేయగూడని కార్యమును నా
చేత చేయించితివి, సకియా !

నిన్ను నే శిక్షించి, సకియా !
నన్ను నే శిక్షించుకొంటిని.
రాక్షసత్వములోన ప్రేమకు
భిక్ష యెక్కడిది?

సేవికా యజమాని భేదము
జీవి కెచ్చటినుండి వచ్చెనో !
ప్రతి సుమమ్ము తనంత స్వేచ్ఛా
ప్రాణిగా కొక రాణి కలదా !

తప్పు నాదే, ప్రేయసీ ! కను
విప్పి నా దైన్యమ్ము కనుమా !
ఏలుకొనుమా నన్ను, నిను సే
వించుకొందు నిక !

(అంజలి ఘటిస్తాడు. సస్య కదులుతుంది. ఆతడు వెనుకకు తగ్గుతాడు. ఆమె లేచి కూర్చునేట్టప్పటికి అతడు పూర్తిగా నిష్క్రమిస్తాడు. సస్య లేస్తుంది. అటూ ఇటూ చూస్తుంది. ఆశ్చర్యపోతుంది.)

సస్య :

ఏమిది చెప్పుమా --
ఇచట పడియుంటి !
చెడుకల ఎదొ ఇందు
పడవేసి పోయెనో !

మంచి కల ఎదొ పూల
మంచె చూపక ముందె
మెలకువే రానేల
మించి పోయినటు !

మలయమారుత పరీ
మళ మాధురిమ పోలె
రమ్యత ఎదొ శరీ
రము నిండ ప్రవహించు !

ఎవరి దీ స్పర్శ, అను
భవమట్లు పారాడు ?
హితమైన దెదొ నఖ
క్షత మట్లు బాధించు !

నిద్రా సముద్రమ్ము
నిస్తరించిన మీద
క్రొత్త తీరముకు మెల
కువగొంటి నిదియేమొ !

(ఎదుట ఏదో కనిపిస్తుంది. సస్యకు ఏదో స్ఫురిస్తుంది. ఆమె ముఖం ఎఱ్ఱబడి, నల్లబడి, తెల్లబడుతుంది. ఉత్సాహంతో పొలాలలోకి పరుగెడుతుంది.)

సస్య :

రత్నాలు పండుమా !
రసముతో నిండుమా !
రాశులై లోకాల
ఆశలను తీర్పుమా !

క్రొత్త పంటలు పండుమా, క్షేత్ర లక్ష్మి !
క్రొత్త నీటను నిండుమా, సరిల్లక్ష్మి !

ప్రాత మట్టలు ఊడ్చి
పండుటాకులు రాల్చి
చిట్టి ముత్యాలతో
చిత్ర వర్ణాలతో

క్రొత్త యెన్నులు వేసికోవమ్మ, శాలి !
క్రొత్త పువ్వులు పూసికో, దేశవాళి ?

చేదు పులుపులు విరిగి,
స్వాదు మాధురి పెరిగి,
ఎండ వెన్నెల కరిగి
ఎడద అంచులు పొర్ల

అమృతభాండము వంచుకోవమ్మ తరువ !
ఆనందమును అరుపుకోవమ్మ, గోవ !

(మేధానిధి మెల్లగా ప్రవేశించి, అంజలి ఘటించి, నిలబడతాడు. సస్య అతణ్ణి చూచి, చిరుకోపముతో విముఖురాలవుతుంది. చెంత గల ఒక చెట్టు మొదలుపై కూర్చుంటుంది. మేధానిధి సమీపిస్తాడు.)

మేధానిధి

జరిగినదానికి నే ప
శ్చాత్తాపము పొందుచుంటి
ఆతతాయినై ని న్నా
యాసపెట్టి వీగిపోతి;

నా నేరము కాసి, చెలీ !
నను మన్నింపవే, చెలీ !

పువ్వును గొనగోరి, రాల
రువ్విన అవివేకి నేను;
పొదుగు గోసి పాలు త్రావ
బోయిన వెర్రిని నేను,

కరుణకు పాత్రుడనె, చెలీ!
కరకుదనము వలదె, చెలీ !

బలవంతమ్మున నిన్నిటు
పట్టి తెచ్చినాను కాని,
నా వలపులు కీవు రాణి !
నీవు జగతికే రాణి !

నీదే యీ కోట, చెలీ !

నీ మాటే నాది, చెలీ !

సస్య :

మాటతో కాదు, నా
పాటతో కలియుమా !
మాట మానక నీవు
పాటందుకో లేవు.
పాట మానినమీద గానీ, నీకు
పరమార్థ మందవోయ్, జ్ఞానీ!

కోటలో కాదు, నను
తోటలో కలియుమా !
కోట తలుపులు మూసి,
తోటకేతము తోడి
కొసకొమ్మ కెక్కితె గానీ, నీకు
కుసుమాలు దక్కవోయ్, జ్ఞానీ !

గొప్పతో కాదు, నీ
గుండెతో కొలువుమా!
పెత్తనముతో కాదు
ప్రేమతో ఏలుమా !
నీ చేయి చాపితే గానీ, నీకు
నా చేయి తగులదోయ్, జ్ఞానీ !

మేధానిధి :

అందుకే కాదె, నే
అంజలి ఘటించితిని ?
నీ యందె మువ్వనై
నినదింప వచ్చితిని ?
హాసినీ ! ప్రేమ వి
న్యాసినీ ! భాసినీ !

నీ పాటకే నొక్క --
రూపమై వచ్చితిని,
ఆత్మలో నీవ నే
నైపోవ వచ్చితిని,
శశిముఖీ ! కల్పవృ
క్షఃశాఖి! ప్రియ సఖీ !

సగము దూరము వచ్చి
తి గద నీ కొరకు ?
మిగిలిన సగ మీవు
దిగిరమ్ము ! కొమ్మ !
కదలిపోదము, నీవు
పదమన్నయెడ కెల్ల !

సస్య :

నా అందెలో మువ్వ
గా ఆడవచ్చితివె ?

నా మాటలో పాట
గా మార వచ్చితివె ?

ఆడవోయీ, స్వామి !
అందాలు కురియ;
మారవోయీ, స్వామి!
మాధురులు విరియ.

మేధానిధి :
పట్టితిని నీ పాద
పద్మాలు మారియే;
ప్రేమింపుమా నన్ను,
ప్రియురాలు కమ్మ !

సస్య :
ప్రేమించినాను నిను,
ప్రియురాలు నైనాను;
లేకున్న ఈ త్రిప్ప
లేల కల్గును నాకు ?

నా ప్రేమ లేకున్న
నరుడెవ్వడైన,
నను బట్టి ఎందైన
మనగల్గునా ? స్వామి!

పలు దారులం దేగు
పాంథు లెట నైన

కూడలికి కాకుండ
కూడుకొను టెట్లు ?

సొగిరమ్మిటు, సమ
స్థాయిపై చేరి,
కలిసిపోవుద మొక్క
కాయమ్ము రీతి.

(సస్య ఆడుతూ, పాడుతూ పొలాలలోకి జొరబడుతుంది. మేధానిధి చూస్తూ గట్టుపైనే వుండిపోతాడు. సస్య తిరిగి అతణ్ణి సమీపిస్తుంది.)

సస్య :

మారితినన్నావు, నన్ను
చేరితినన్నావు, ప్రియా !
గట్టు పట్టుకొన్నట్లుగ
కదలక నిల్చితి వేలా ?

మార్పన్నది మాటలోకో?
మనసులోన రావలయును;
అభ్యుదయము ప్రవర్తనలో
అగుపింపగవలయు సుమీ !

మేధానిధి :

నగరములో జన్మించిన
నాగరికుడ నేను, ప్రియా !

పల్లెటూరి నీ స్థాయికి
పడిపోవగలేను నిజము.

నీ స్థాయికి దిగలేనే !
నిన్ను విడుచుకోలేనే !
నా స్థాయికి ఎక్కిరావె !
నా స్థితిపై దయ చూపవె !

సస్య :

తిరిగి తిరిగి, తిరిగి బైలు
దేరిన చోటికె వస్తివి,
చావైనను మేలె కాని
స్వాతంత్ర్యము విడువలేను.

ఆనందము విశ్రాంతిగ
అనుభవింతు ననుకొను నీ
యాజమాన్య జీవితమే
అడుగు మెట్టుపై నున్నది.

భూమాతను సేవించే
భూ పుత్రికనైన నేను
భూమి విడిచి నగరోన్నత
ధామాలకు వచ్చుటెట్లు ?

నా నిసర్గ సహజ మనో
జ్ఞత్వపు సౌందర్యములో
నన్ను చూడ దలతువేని
నా భూమికి నను విడువుము.

ఏ సౌందర్యమ్ము గోరి
ఇంత నన్ను బాధింతువో,
దానిని పోగొట్టుకొనగ
దలచిన– ఇక నీ యిష్టము.

మేధానిధి :

సరే లెమ్ము, నే చూచెద,
సౌందర్య మ్మేమగునో,
బలవంతము చేయక లో
బడ రెన్నడు స్త్రీమూర్తులు.

స్నేహార్ద్రతతోడ నిన్ను
చేకొను టిక దుస్తరము.
కరుణారస వాదముతో
కరగించుట దుర్భరము.

సరే లెమ్ము, నే చూచెద.
సాగుమింక నగరమునకు;
పరులెరుగని సీమలలో
పర్యటించెదము, ప్రేయసి !

(సస్య కేలు గ్రహించి నిష్క్రమిస్తాడు. ఆమె ప్రతిఘటించ కుండగనే అతని వెంట వెళుతుంది)

## పండ్రెండవ రంగం

(రాజు భవనం. సకల సంపదలతో లక్ష్మి తాండవిస్తున్న దర్బారు హాలు; వివిధ సామంతాది ప్రభువులతో భోగ మహా రాజు (భోగయ్య) కొలువుతీర్చి వుంటాడు. అతడి ప్రక్క సింహాసనం మీద ఆశావతి మహారాజ్ఞి వుంది. హాలులో త్రిలోకసుందరి అగు ఒక నర్తకి నాట్యం చేస్తున్నది. ఆమె మూర్తి "స్వయంప్రభ"ను తలపింపజేస్తున్నది. ఆమె శశికళ.)

శశికళ :

అద్దానికి అందము నీవు,
అందానికి అద్దము నేను;
నవ్వులలో పువ్వులు విరిసె!
పువ్వులలో నవ్వులు మెరిసె !

నవసంధ్యారాగం తెరలో
నా దారిని పిలిచిందెవరో!

ఆకాశం అడుగొక మడుగై,
అవనీతల మడుగొక పడుగై,
మధురామృత మవనికి కురిసె !
మణిరాశులు మిన్నుల నొరిసె !
నవ మానవ పరిణామంలో
నా యెదదను వ్రాలిందెవరో !

సుందర తారా నట రంగం.
సురభిళవీచీ విన్యాసం ;

దిక్చక్రపు టందెలు దాల్చి

దివి భువి కవరోధం చీల్చి

నవ జీవన రాగ రసంలో

నా యడుగులు కదిపిందెవరో !

(ఆనందకరంగా నాట్యం సాగుతూ వుండగా మధ్యలో భోగయ్య సింహాసనం దిగి, ఠీవిగా శశికళను సమీపిస్తాడు. పట్టుకోబోతాడు. ఆమె చప్పున అదృశ్యమైనట్టు నిష్క్రమిస్తుంది. ఆమె వెంట అతడు నిష్క్రమిస్తాడు. సభాసదులు తలో దారినీ పోతారు. ఆశావతి మాత్రం అక్కడే వుండిపోతుంది. రెండవ ప్రక్కనుంచి ఎవరినో తరుముకు వస్తున్నట్టు భోగయ్య ప్రవేశిస్తాడు. ఆశావతిని ఢీకొట్టి ఆగిపోతాడు. అప్పటికి గాని అతడికి వళ్లు తెలియదు. ఆమె ఉగ్రురాలవుతుంది.)

ఆశావతి :

తెలివినుండి -- తల పండి, ఇ
దేం పనోయ్, మగాడా ?
నాదీ రాజ్యమ్ము, గుర్తు
లేదె ! ముసలిదూడా !

భోగయ్య :

ఔనౌనే, నీవరాణి,
నేను నీకు సేవకుడ :
మకుటరత్న దోషముచే
మతే మరచి నాడ :

నీవురాణి, నేరాజు; మ
నిద్దరిదీ రాజ్యం;
సకల జనులు మన దాసులె
జగమే మన భోజ్యం.

ఆశావతి :

గోటు చేయబోకోయ్ ! నీ
గొప్పెవ రెరుగనిది ?
ఈ సర్వస్వమ్ము నాది.
ఏమున్నది నీది ?

మాయెరుగని క్షేత్రయ్యను
మాటలలో కొట్టి, దీని
గెలుచుకొంటి, నీ కింద
గిద్దెడైన లేదు.

భూలక్ష్మిని దాసి జేసి
భూములు పండింప జేసి
తృప్తిగ భోజనము చేసి
త్రుళ్ళుట నాకృప జేసి !

పరుల కాయ కష్టముపై
బ్రతుకుటయే గౌరవము,
తెగలుగ విభజించి ప్రజల
తెగటార్చుటె పరాక్రమము !

సిద్ధాంతము చేతికిచ్చి
యుద్ధానికి పంపితి నిను,
నీ దోచిన విభవమెల్ల
నాదేనోయ్, మగరాజా !

భోగయ్య :

అవమానించకు, నాతీ !
అన్నప్పుడు నన్నీగతి :
పానకమున పుడకరీతి
ప్రాణం తీసితి విప్పుడు.

సరేలెమ్ము, సామ్రాజ్యం
సర్వం నీదే లెమ్ము.
సింహాసనమును నీవే
చే కొని పాలించుకొమ్ము.

మరతుపాకి చేతబట్టి
మారణ హోమాగ్ని వేల్చి
దిగ్విజయము చేసివత్తు
దిక్కులెల్ల గెల్చితెత్తు.

కొత్త రాజ్యములకు నిన్ను
కోమలి ! రాణీ నొనర్తు,
కొత్త జాతులనె వంచి
కొల్పింతును నీ యడుగులు.

(ఈ లోగా అతడు దిక్కులు పరికిస్తూనే వుంటాడు. తొందరగా వెళ్ళబోయే ప్రయత్నంలోనే వుంటాడు. కాని ఆశావతి కదలనివ్వదు. ఈ బీరాలు పల్కి అతడు పోబోయే క్షణంలో ఎదురుగా భూలక్ష్మి, సూరన్న, చంద్రన్న మరి కొందరు కార్మికులు, కర్షకులు వివిధ కానుకలతో ప్రవేశిస్తాడు.)

ఆశావతి :

నీ వేషము నే నెరుగుదు
నిన్ను గడప దాట నివ్వ !
అరుగో సేవకులు వచ్చి
రందు కొనుము కానుకలను.

భోగయ్య :

ఏమోయీ, రైతులు ! మీ
రిటు వచ్చిరి తీరికగా ?
పొలములు దున్నుట లేదా ?
పొగరెక్కినదా ఇంతలో ?

సూరన్న :

లేదు, ప్రభూ ! చిరు కానుక
లీయ దెచ్చినాము మేము !
గట్లపైని కాసిన వీ
కందులు, ఈ పచ్చ పెసలు,

వ్యవసాయపు ఋతువు కాదు:
వానలు పడలేదింకా,
పనేమున్నదని తెస్తిమి
ప్రభువుల కీ నేతి బొట్టు.

ఆశావతి :

సేద్యానికి రుతువేమిటి ?
చేతగాని రైతులార !
అవి అక్కడ పెట్టి పొందు,
హల మాపక పండింపుడు.

పంట నిటకు తెచ్చుటకు
పని వాడొక్కడు చాలడె ?
ఇంతమంది బైలుదేరి
ఎగవేసిరి పొలము పని !

భోగయ్య :

పొందు, పొందు, ఇంతటితో
పోనిత్తుము, జాలిదలిచి;
పళ్లెము లికవద్దు, దినుసు
బళ్లపైని రావలయును.

చంద్రన్న :

సరే, ప్రభూ ! అట్లెపోయి,
సాగును ప్రారంభింతుము ;
సాలు పొడుగునా విడువక
సస్యమ్మును పండింతుము.

తమతో ఒక మనవి చేయ
తల్లి వచ్చి నిల్చున్నది.
సస్య లేని లోపము ఫల
సాయ మందు పడుచున్నది.

ఆమెను విడిపించి, పంట
భూమికి పంపకపోతే
రాలదు గింజైన, ముక్కు
నేల రాచు కొన్నగాని.

ఆశావతి :

ఏమైనదొ మీ పిల్ల ?
ఏమి తెలియునోయి మాకు ?
కాపు పెట్టినావె దాని
కడ మమ్మొ పొగరు పోత ?

ముక్కు నేల రాచుకొంద్రొ,
అక్కు పగులదన్నుకొంద్రొ,
మాకెందుకు ? పూర్తి పంట
మాకు తోలి తెండు, పొండు.

భోగయ్య :

నోరెత్తకు డింక నెవరు,
నోటి మీద తన్నగలను,
అంతరములు మరిచిపోయి
అపవాదును వేసెదరే!

ఎవరక్కడ ? భటులు ! గెంటు
డీ మూకను బైటి కిపుడె ;
గ్రామీణుల కెట్లు తెలియు
రాజసౌధ మర్యాదలు !

(భూలక్ష్మి చలిస్తుంది. ఏదో మాట్లాడ బోతోంది. అంతలోనే భటులు వచ్చి ఆమెను, తదితరులను బైటికి నెట్టుకు పోతారు. భోగయ్య వంకరనవ్వుతో మీసాలు మెలిపెడతారు.)

భోగయ్య :
చూచినావె, నా దిలాస !

ఆశావతి :
చేసినావు లే తమాన !

భోగయ్య :
నే నెంతటి పని చేసిన
నీకు మెప్పు లేదు లేవె.
విశ్వమెల్ల గెల్చి తెచ్చి
వెల్లడింతు నాదు ప్రజ్ఞ.

(భోగయ్య దురుసుగా నిష్క్రమిస్తాడు. ఆశావతి వెటకారంతో నవ్వుతుంది.)

ఆశావతి :

నీ విక్రమ మెంతటిదో !
నే నెరుగనె ! కొండముచ్చు!
నీ తొందర కేది హేతు
వో తెలియని అవివేకినె ?

నీ గెల్పున ఏమున్నది ?
నా గుప్పిటి పిచ్చుక భువి;
పొమ్ము, పొమ్ము, రాకు మింక;
భూమి నేను పాలింతును.

(నిష్క్రమిస్తుంది. తెర)

## పదమూడవ రంగం

(మహానగరంలో ఒక ఏకాంత మందిరం. సస్య విచారంగా ప్రవేశిస్తుంది. రంగం చక్కగా అలంకరింపబడి, అధునాతన నాగరిక వైభవాన్ని సూచిస్తుంది. )

సస్య :

గిరగిర రంగుల రాట్నము
కరణి తిరుగుచున్నది ధర ;
గుర్రము వీపే విరుగునొ !
కుర్రని మనసె చెదరునొ !

తల్లీ ! ఏదమ్మ, నీదు
చల్లని చేతుల ఆసరా ?

రివ్వున తిరిగే ఒడిసెల
రీతిపోవు నీ ధరిత్రి;
ఒడిసెల త్రాడే తెగునో !
ఉంచిన రాయేమగునో !

జననీ ! ఏదమ్మ, నీదు
సంరక్షక పరిరంభము ?

మాతా ! నను తలపుము, క్షణ
మాత్రము సంకల్పింపుము;
సంకల్పమె రెక్కలుగా
స్వాతంత్ర్యము గైకొందును;

ఈ పంజరమును విదల్చి
ఇటె వ్రాలుదు నా పొలాల.

(మేధానిధి నాగరిక వేషంలో ప్రవేశిస్తాడు. తనతో తెచ్చిన అనేక వస్తువులను, పదార్థాలను బల్లమీద అమర్చుతూ -- )

మేధానిధి :

పంజరమా ఇది ? దేవీ !
ప్రణయ సౌఖ్య మందిరమే !
పల్లెటూరి గబ్బిల మటు
పల్కినావు కడు మోటుగ !

ఈ మధురసముల గ్రోలుము,
ఈ మణి భూషలు తాల్పుము,
ఈ రత్నాసనము నందు
హృదయేశ్వరి! కూర్చుండుము.

సస్య :

ఏలా, ఈ శృంఖలాలు ?
ఇవి నన్నిట బంధించును;
ఆకర్షణ లెల్ల ప్రాణి
నస్వతంత్ర జేసెడివె!

చక్కెర పానకము లెట్లు
సహజ మధువు లగును ? స్వామి !
మణిభూషలు నాకు మంజు
మందారములకు సాటియె ?

రత్నాసనమైన కరకు
రాతి పీటయేకద అది ?

నా పొలాల గట్లమీది
నవ తృణ తల్పము పాటిదె ?

వ్యామోహము లివి, మనుజుని
వ్యక్తిత్వము జంపివేయు,
ఆపై మిగిలే దేమిటి ?
ఆటబొమ్మ బ్రతుకే గద ?

మేధానిధి :

జగమే ఒక ఆటబొమ్మ,
తగవెందుకు దానితోడ !
బంతి చుట్టు తిరుగు చీమ
గెంతనేల అఖాతముకు ?

బ్రతుకు ననుభవించుటలో
పారతంత్ర్య మేమున్నది ?
అనుభూతికి కాకుండిన
అస లీ పుట్టుక దేవికి ?

ఆనందముగా జీవిత
మనుభవింతమే మనము;
సుదతీ ! మనకొరకే ఈ
సుందర ప్రపంచ మెల్ల !

పల్లెటూర నేమి కలదు.
పంటచేలు తక్క నీకు ?

నగరమ్ములు బంగారపు
నగలే ఈ లోకానికి !

సస్య :

చక్కనైన కొమ్ములతో
సాటిరాని కట్టెలనుచు
పాదాలను తిట్టుకొన్న
పసిడిలేడి కథ వినవే ?

త్రిజగ జ్జీవిత జీవన
దివ్య విధానములో ఆ
హార పథకమౌ పల్లెను
అవమానము చేతువేల ?

తీగల కాహార మొసగు
తెలియని వ్రేళ్ళన్నొ మురికి
గోతులలో, పెంజీకటి
లోతులలో కష్టించును !

పువ్వులు సుందరములు, మధు
పూరమ్ములు నైన మాత్ర
వ్రేళ్ల నసహ్యించుకొనునె ?
వెఱ్ఱివాడు నరు డొక్కడె !

మేధానిధి :

వేరువు కాదే నీవు.
విరిబోణీ; విరవిరివే ;
పుష్పము వ్రేళ్లం బడుచో
పోదా మలినీకృతమై !

గంధ వహునిపై సవారి
కదిలి లోకమోహనముగ
సురభింపనిచో కుసుమము
శోభించునె ? వ్యథ కాదే ?

కుగ్రామము లేల మనకు ?
కోమలి ! అవి పురాణములు ;
ముందుకు సాగెను లోకము;
ఎందుకు మన మాగవలయు ?

సస్య :

బలశాలివి నీవు కాన
బలవంతము చేతువు నను,
ప్రణయపాత్రుడవె యైనను
ప్రతిఘటించితీరుదు నిను.

నా కోరిక తీరు వరకు
నీ కోరిక తీరదు, చెలి !

నిజమెరింగి చేసినపని
నిలకడపై ఫలమిచ్చును.

మేధానిధి :

సరేలెమ్ము, ఈ ఫలములు
చవిచూడుము; క్షుద్బాధా
పీడితులకు మంచిచెడ్డ
భేదమ్ములు కానరావు.

పట్టణ వైభవము చూచి
పల్లెల హైన్యమ్ము తలచి
నీవే నీ యిష్టమ్మును
నిర్ణయించు కొందుగాని.

సస్య :

అక్కరలేదో స్వామి.
అరముగ్గిన ఈ ఫలములు ;
పల్లెలనుండి వీనిని
పడగోసుక తెచ్చినారు.

ఆహారము వలదు లెమ్ము,
ఆకలిగా లే దిప్పుడు;
నడువు మింక, లోకముతో
అడుగు కలిపి ఏ దిశకో !

మేధానిధి :

మంచిది, ప్రియ ! పద ముందుకు
కాంచు మదిగొ నగరప్రభ !
జనవనములు, ఫలహారపు
నత్తరువుల పరిమళములు !

(ఎదురు చూపుతూ నిష్క్రమిస్తాడు. ఇద్దరూ వెళ్లిన తరువాత తెరలేవగా నగరవీధి రంగం మహావైభవంగా కనిపిస్తుంది. తిరిగి మేధానిధి, సస్య ప్రవేశిస్తారు. అతడు ఆమెకు నగర వైచిత్రాలను చూపుతూ వుంటాడు. ఆమె వినోదించడానికి బదులు అసహ్యించుకొంటూ వుంటుంది.)

మేధానిధి :

కాంచుము బాలా ! కన్నుల విందుగ
మిన్నుల నొరిసే మేడలు, మిద్దెలు,
మహీసతి గళమణి మాలలవలె !
విను వీధికి నిచ్చెన లిడినట్లుగ !

సస్య :

పద పద, సఖుడా ! త్వరగా ముందుకు
భయపెడుతున్నవి భాగ్యసౌధములు
గుహలకు మించిన గుమ్మపు నోళ్లతో
"మీదికురుకుతాం, మింగుతాం" అనుచు !

మేధానిధి :

పరికింపుము నవ వస్త్రాలయములు,
అంబరమువంటి అంబర మదిగో !
వెన్నెల చీరలు, వెన్న రంగులు
మంచు వలువలు, మామిడంచులు,
రంగులెల్ల నీ రంగుకు దీటుగ,
కరగించిన వీ కాశీ సిల్కులు;
నీలాంబరమిది నీకందము నిడు,
సంజచాయతో సరస మాడునిది;
గులాబి చీరను -- కుచ్చెళ్లు తీర్చ,
పచ్చని రవికెను పైని తాల్చుకొని,
కులుకగలుగుచో, కొలువరె నిన్ను ?
సిగ్గుపడుచు నిల్చిన గులాబి వని ?

సస్య :

పైరుగాలియే పట్టుపుట్టమై
వెన్నెలయే నావన్నె వలువయై
పరగునాకు - వ్యాపారపు కృత్రిమ
రంగుచీరెలెటు రంజన మొసగు ?

మేధానిధి :

అవి విదేశీయ యంత్రాలయములు
తయారుచేసిన తంత్రపు బొమ్మలు,
తోలు బొమ్మలూ, పూలు బొమ్మలూ,
రాతి బొమ్మలూ, రబ్బరు బొమ్మలు,

కగ్రగుగ్రాలు, కారుదున్నలూ,

కారులు, రెయిళ్లు, గాలివోడలు,

పైటపిన్నులు, పట్టు రిబ్బనులు,

స్నోలు, పౌడరులు, షోకుసంచులు,

ఫేన్సీషాపులు ఫెళఫెళ లాడుచు

అటు కనుగొను మెట్లమ్ముచున్నవో !

అమరలోకమే అసూయపడదా,

కాంతా ! భూలోకము నిటుకన్గొని !

సస్య :

చచ్చితి, చచ్చితి, చచ్చితి, నయ్యో !

మోసము, మోసము, మోసము దేవా !

పల్లెటూళ్ళ సంపదను దోచుకొను

పచ్చిబొమ్మలవి, పిచ్చి బొమ్మలా ?

పనికిరాని ఈ పరమ చెత్తతో

మనుజుని బుద్ధిని మట్టుపెట్టుటే

నాగరికతయై సాగుచున్నదా ?

విషకన్యకలే వేడ్క వస్తువుల ?

పద, పద, ముందుకు, పట్టుచున్నవివి,

గిచ్చుచున్నవివి, చొచ్చుచున్నవెద,

జుర్రుచున్నవే ఎర్రని నెత్తురు !

చచ్చితి చచ్చితి చచ్చితి నయ్యో !

(కూలబడుతుంది. మేధానిధి నిశ్చేష్టుడవుతాడు. కంగారు పడి పట్టుకొంటాడు. పడుకో బెడతాడు. ఏమి చెయ్యడానికి తోచదు. అంతలో అక్కడికి ఒక నవనాగరిక అయిన కాంతామణి వస్తుంది. ఆమె మూర్తి "స్వయంప్రభ"ను జ్ఞప్తికి తెస్తుంది.)

కాంతామణి :

ఎవరవోయీ నీవు !
ఏమి చేసితి వామె ?
కుసుమ కోమలి, నహో !
కొట్టి పడవైచితివె ?

(నస్యను తాకి చూస్తుంది, మేధానిధి వినయంగా అంజలి ఘటిస్తాడు.)

కాంతామణి :

చేతగాని మగవాడవు,
స్త్రీ జోలికి పోనేలా ?
సారస్యము నెరుగ లేని
జడునికి ప్రియురాలేరా ?

చిత్తమెరిగి వర్తింపని
చెత్తమనిషి మగ డెట్లగు ?
పొదుగు కోసి పాల్దావెడి
మూఢుడు గోపాలుడగున ?

పైరుగాలిలో రెపరెప
పెరిగివచ్చు లత కూనను
పుడికితెచ్చి, ప్రణయ మనుచు
పడవైతువె బొగ్గులలో !

మొదట రెండు చిత్తమ్ములు
పొదవు కొనంగా వలయును,
కలసినంత, బలమైనది
బలహీనను నడిపించును.

బలవంతపు టెండలలో
ప్రణయ జలధులే ఎండును;
స్నేహములో పొంగిపారు
చిన్నవలపు ధారలేని.

నరక స్వర్గములు నీకు
కరగతములు, తరుణుడా !
చిత్తమొసగి, చిత్తముగొని
చెలువను గొని సుఖింపుమా !

లేవే యిక, బాలామణి !
త్రోవదొరికె నిక లేవే !
నిన్నుగ్రమింగు కల కాదిది,
నీకు హంగు కళ సుమ్మిది !

(ఆమె సస్య కేలు గ్రహించి లేపగా, సస్య లేస్తుంది. మేధానిధి ఆనంద భరితుడవుతాడు. సస్యలేచి, కాంతామణిని చూచి అంజలి ఘటిస్తుంది.)

సస్య :

ఓ కాంతా ! ఎవతె వీవు !
లోకమాత వలె నుంటివి !
విను చూడగ, నా పొలమె
ల్లను చూచిన యట్లయ్యెను !

కాంతామణి :

చూచినావు పూర్వము నను
సుదతీ ! నీ పొల మందే;
నీ పొలమెట్లో – అట్లే
ఈ పట్టణవీధి నాకు.

ఈ బజారులం దుండిన
ఎల్లవస్తు సామగ్రియు
కల్పించితి మీ సుఖముకె,
కదలిరండు చూపింతును.

(ఆమె నాట్యవిన్యాసంతో నిష్క్రమిస్తుంది. ఆమె వెనుక విభ్రమ చిత్తంతో మేధానిధి నిష్క్రమిస్తాడు. సస్యవారి వెంట మెల్లిగా నడుస్తున్నట్లుగా వెనుక బడుతుంది. కాంతామణి, మేధానిధి సస్యకు కొంచెం ముందు నడుస్తూ, ఆమెకు అన్నీ చూపుతున్నారన్న మాట. రంగంమీద సస్య ఒక్కతె మాత్రమే కనిపిస్తుంది.)

సస్య :

ఇతఃపూర్వ మీ బొమ్మలు
ఎంతొ భీతి గొల్పె నాకు !
ఇప్పుడేదొ ఆనందము
నిచ్చుచున్నవెంత వింత !

తల్లీ ! నీ మాహాత్మ్యము
గొల్లదాన నే మెరుగుదు ?

ఓహో ! నే నిచ్చటనే
ఉండిపోదునా నిత్యము ?

బొమ్మలతో బొమ్మనుగా
పొందుదునా పూర్ణనిద్ర ?
మరచిపోదు నేమో నా
మాతృభూమి శాశ్వతముగ !

అసంభవము, కాగితంపు
ప్రసవము లీ పట్టణములు,
నను మరిపించే భవ్యత
నవ్యత ఇందేమి కలదు ?
అభ్యుదయము మానసికము
ఆడంబర మెపుడు కాదు.

ఈ విమానముల చేకొని,
ఎగిరి పోదు నా భూమికి
మేఘాలను కల్పింతును,
మేదినిపై కురిపింతును
తటిల్లతల మొలిపించి
తారకలను పూయింతును.

విమానముల గూరుచుండి
విత్తనములు చల్లింతును,
రాకెట్లను నడుపు కొంచు
రాశులలో విహరింతును.

రవిచంద్రుల మధ్యనుంచి
రాచబాట వేయింతును.

బొగ్గునుండి వెన్నదీతు,
అగ్గినుండి తేనెదీతు,
వెన్నెలతో జున్నువండి
విశ్వానికి విందుచేతు,
చేలుకోసి, కుప్పవేసి
పాలవెల్లి పవళింతును.

(తనలో తాను లీనమైపోయిన సస్య చాల వెనుకపడిపోతుంది. అట్లు పగటి కలలో ఉన్న ఆమెను ఒక వ్యక్తి వెనుకనుంచి వస్తూ, హఠాత్తుగా పట్టుకొంటాడు. చాలసేపుగా అతడు ఆమెను అనుసరిస్తూనే వున్నాడు. ఆమె పరధ్యానంగా వుండి, అతణ్ణి చూడలేదు. అతడు ధనరాజు. ధనికుని కుండే అవలక్షణాలన్నీ వున్నాయి. ఆమె కెవ్వున కేకవేస్తుంది. అతడు ఆమె నోరు గట్టిగా మూసి, బలవంతంగా వెనక్కి లాక్కుపోతాడు.)

## పదునాల్గవ రంగం

(క్షేత్రయ్య ఒక ఋషివేషంలో ప్రవేశిస్తాడు. రుద్రాక్షమాల, యోగదండం, కమండలం వుంటాయి. తేజోవంతంగాను, ఉత్సాహం తోనూ శుద్ధసత్వం మూర్తీభవించినట్టు వుంటాడు. అతడు స్వయంప్రభాదేవి వరాలు పొంది వస్తున్నాడు -- గృహోన్ముఖుడై, మార్గం గుర్తు పట్టుకొంటున్నాడు. పరిసరాలు పరిశీలిస్తున్నారు. ప్రపంచం చాల మారిపోయింది. ఎంతోకాలం గతించి పోయింది. పోలికలు దొరకడం లేదు. అప్పుడు ఎదురుగా భోగయ్య ఒక ఆధునిక యోధుని వేషంలో ఎదురు పడతాడు. ఒకరి నొకరు పోల్చుకోలేరు.)

భోగయ్య :

ఏమిటి స్వామీ ! వెతుకుతున్నారు ?
ఏ యోగసిద్ధి తెగిపోయిందో !
ఏ రహస్యాలు జారిపోయినవో !
ఏ తపఃఫలం చితికి పోయిందో !

క్షేత్రయ్య :

ఔను, ప్రభూ ! అంతే జరిగినది ;
మంచి సమస్తమూ మాయమయినది,
మేరు శిఖరదేవత కరుణించిన
మేటి వరాలే ఒలికిపోయినవి !

పాప భూమిలో పాదము పెట్టిన
పగిది, వణకు పుట్టిన దిదేమిటో !
తోడి మానవుల పీడించే ఏ
దుష్ట భూమియో కాదుగదా ఇది ?

శాంతి దేవతకు అనుగుబిడ్డను, అ
శాంతి రేగినది ప్రభు ! డెందములో !
ధర్మమునకు పెట్టిన పేరిది; స్వా
ర్థము వికట తాండవము చేయుదుగద !

భోగయ్య :

ఎవరో మీరు మహానుభావులు ?
ఇపుడే కాబోలు వచ్చుచుంటిరి !
పాపము, పుణ్యము, స్వార్థము, ధర్మము,
ఈ పదము కర్థము శూన్యమ్మిట,

కోర మీసముల వాడిదె రాజ్యం,
కుట్ర పన్నువాడిదె అధికారం,
ముఠానడప గలవాడే నియంత,
చిఠా మార్చగలవాడే నేత !

"సత్యం వద" యని, "ధర్మంచర" యని
ఛాతీ చరచుక చాటిస్తారు.
ఘాత, హత్య, మోసం, దగాలతో
గడగడ నెత్తురు తాగేస్తారు.

"ఓం, శాంతి, శాంతి, శాంతి" అనుచునె
ఒక్కొకళ్ల కొంపలు తీస్తారు,
మత మూఢత్వం రెచ్చగొట్టి, తమ
మాలిన్యాలకు ముసుగు వేస్తారు !

క్షేత్రయ్య :

చాలు చాలు, ఇక వినలేను, ప్రభూ !
చచ్చిపోయినది మానవ జాతియె;
మిగిలిన పాశవ రజస్తమమ్ములె
రగిలి; ఇట్లు కొట్టుకొనుచున్నవో !

ఒక అనుమానము తీర్ప గోరెదను,
యోధునివలె కాన్పింతురు మీరలు,
నిర్దయతో ఈ నికృష్ట గుణముల
నిగ్రహించి, త్రుంచక విడిచితిరే !

భోగయ్య :

పరమాత్ముని పది అవతారములే
చెరపలేని ఈ పాశవగుణములు
మనుజ మాత్రుడను నాకు లొంగునా ?
మంత్రాలకు చింతకాయ రాలున ?

అయినప్పటికీ, రాజునై నేను
అవనీతల మంతయు జయించితిని;
గిల్లి కజ్జాలు తెచ్చి, దేశాలు
కొల్లగొట్టితిని, గుల్ల చేసితివి;

పర మతాలపై కత్తి దూసితిని,
ప్రపంచ యుద్ధాలను నడిపిస్తిని,
శత సహస్ర సైనికుల కూల్చితిని,
శాంతి సంధులేర్పాటు చేసితిని;

ఎంత చేసినా, రవ్వంతైనా
శాంతి చిక్కలే దాత్మకు, మౌనీ !
నరుడు మనుచుండె నెప్పటి పశువుగ,
నాకు మిగిలి పోయిన దవమానము !

సకల జీవితము నర్పించి నేను
సాధించిన దేమున్నది చివరకు ?
ఆర్యఋషులు మాత్ర మేమిచేసిరి
అనంత తపః ప్రభావ శాలురై ?

మతాలు, మహితులు, మహాప్రవక్తలు
శతాధిక గ్రంథాలు, శాస్త్రాలు

చెప్పిన నీతులు కుప్పలు పోసిన
ఉప్పర మంటదె ? లాభమున్నదే ?

మనుజుడు, స్వార్థపరుడు, పశువన్నది
మరచిపోయి నీతి బోధింపకుడు;
బుద్ధి వచ్చినది, చెంపలు వేసుక
పోవుచుంటి హిమగిరి శృంగాలకు,

(క్షేత్రయ్యకు వందనం చేసి భోగయ్య నిష్క్రమిస్తాడు. అతడు పోయిన దారికేసి కొంతసేపు చూచి, క్షేత్రయ్య నిట్టూర్పు విడుస్తాడు. తిరిగి ముందుకు సాగుతాడు. నిజంగానే మానవుడు ఎంతో మారినాడు. పెరిగి, అమృత ఫలాలను అందివ్వవలసిన సామాజిక వృక్షం వెర్రితలలు వేసి, విష ఫలాలను కాస్తున్నట్టున్నది ! ఆలోచించి, దురుసుగా ముందుకు పోతాడు. అతడు నిష్క్రమించగానే తెరలేస్తుంది. అది భూలక్ష్మి కుటీరం, సూరన్న, చంద్రన్న తదితరులు పొలాలలో పనులు చేస్తూ కనిపిస్తారు. భూలక్ష్మి దూరంగా, ఒంటరిగా కూర్చుని విచారిస్తూ వుంటుంది. సూరన్న సమీ పిస్తాడు.)

సూరన్న :

అమ్మ ! ఈ దుఃఖాని
కంత మొక టుండదా ?
ఏడ్పువల్లను లాభ
మే మైన కల్గునా ?

అయ్య వచ్చెడు కాల
మరుదెంచి నటుతోచు !
నెరల లోపలి కప్ప
లరచు చున్నవి చూడు !

అయ్యా రాగానె, స
స్యను వెదకి తెచ్చెదము ;
ఏ కీడు లేదామె
కీ తీవ జూడుమా !

మన కా జగన్మాత
మాట ఇచ్చిన గడువు
నేటితో తీరు నను
నిబ్బరము కలదమ్మ !

దిశ లందముగ విరిసె !
తిరిగె దక్షిణ గాలి !
పూరి పోచల గనుము
భూమాత పుల్కలటు !

భూలక్ష్మి :

అంతరంగము నేడు
ఆందోళితమ్మయ్యె,
తొట్రు పడు పాదాలు,
తోచకున్నది యేమి !

మంచియే జరుగునో,
వంచవలెనో శిరము !
శుభమైనచో – చెడ్డ
సూచనల కతమేమొ !

వట్టినే కన్నీరు
వచ్చుచున్నది పొంగి,
కోట్ల గుండెలు కొట్టు
కొనుచుండె నాచుట్టు !

ఏమన్నదో అంబ !
ఏమయ్యెనో స్వామి !
ఎట నున్నదో సస్య !
ఏమున్నదో ముందు !

(అంతలో క్షేత్రయ్య ప్రవేశిస్తాడు. నిలబడి చూస్తాడు. దైన్య దేవతలా కనిపిస్తుంది భూలక్ష్మి. క్షణంసేపు చూస్తుంది. గుర్తిస్తుంది. ఒక్కసారిగా అతని చేతులలో వాలిపోతుంది. బిలబిల మంటూ అంతా వచ్చి మూగుతారు. క్షేత్రయ్య సముదాయిస్తాడు.)

క్షేత్రయ్య :

వింటిని, దేవీ ! వింటిని; జరిగిన
విపర్యాయమును మనసా కంటిని ;
ధైర్యము కావలసిన సమయమును వృ
థా పరుపరాదు బేలతనముతో.

పురుషార్థ సాధకుడు కావలసిన
పురుషుడు, పురుష వృషభుడై మత్తుగ
మోరసాచుకొని తిరిగే కాలము
తీరిపోయే నిక విచారించకుము.

ఎచటినుండి ఇచ్చటికి వచ్చెనో,
ఎచ్చటి కేగుచు ఇచ్చట ఆగెనో,
ముందు పైనమున కేమి టవసరమొ,
అందుకోలేని ఆత్మ ముగిసినది.

దోర్బలమ్ముతో, దౌర్జన్యముతో,
తుపాకితో ప్రజను నిగ్రహించే
యుగము చింతతో హిమగిరి చేరెను,
మిగిలియున్న దన్యోన్య ప్రేమము.

బైలుదేరి, నేనిపుడే సస్యను
పట్టి తెచ్చి నీ కొసగుదు, దేవీ;
చింత వీడి నీ పనిలో నుండుము !
చిటికలోన తిరిగి వత్తు బిడ్డతొ.

భూలక్ష్మి :

వలదు, వలదోయీ, ప్రభూ, వో
వలదు, నీ వొక్కడివె, యిప్పుడు;
ఇంతకాలము నీ కొరకెగా
వంత గుందుచు నుంటిని ?

వెళ్ళవచ్చును లెమ్ము కొంచెము
విశ్రమింపుము ముందు నీ విట ;
అలఘుతపమున ఎన్నొ యుగములు
అలసి వచ్చితివి.

నీ తపస్సుప్రభావ మేమో
నేల కొంచెము చల్లబడినది,
రక్తదాహము తీరెనేమో
రాజు కనబడడు ?

వెదక వచ్చును లెమ్ము, నేనును
వెంట వత్తును; కొంత సేపిట
కూరుచుండుము, నన్ను నీలో
కుదురుకొననిమ్ము.

(ఇర్వురును అలానే ఒకరిలో నొకరు కలిసి పోతారు. అక్కడ చేరిన తదితరులు అంతకు ముందే వెళ్ళిపోయారు.)

## పదునైదవ రంగం

(ఒక చీకటి మిద్దె గది. ధన ధాన్యాలు రాశులుగా పడివున్నాయి. ఒక పెద్ద ఇనప్పెట్టెముందు హారతి వెలుగుతూ వున్నది. ఆ మధ్యలో, శుష్కించి – మర బియ్యపు గింజవలె – పాలిపోయిన సస్య ఇటూ అటూ తిరుగుతూవుంటుంది.)

సస్య :

పోట్లగిత్త బారినుండి
పులి నను రక్షించునా ?

ఈ చీకటి కొట్టు బ్రతుకు
ఎపుడైనను తప్పునా ?

క్షేత్ర లక్ష్మి యొడికి నేను
చేరు తెరువు దొరకునా ?

దీపమె చూపని లుబ్ధుడు

దేశానికి పంపునా ?

తల్లిని, తండ్రిని పొలమును

దర్శించుట కల్గునా ?

మేధానిధియైన వెదకి

బాధప నుడుప దలచునా ?

(బరువుగా నిట్టూరుస్తుంది. అనేక భావాలు ఆమె మనో వీధిలో మేఘాలవలె కూడుతూ, విడిపోతూ ఉంటాయి. చెక్కిలిపై బాష్పాలు ధారలు కడతాయి)

సస్య :

వర్షాలు కురిసెనో,

వరపులే నిలిచెనో,

వరిపొలము లేమైనవో - తల్లీ !

అదను తప్పిన వేళ

పదను తప్పిన చేల

వెదకుదురు కాబోలు నన్ను. - తల్లి !

నీటి బోదెల గట్ల

నిండు పచ్చిక పట్ల

నృత్యాలు చేతునా ఇంక? - తల్లి !

ఏ గరువు గుంటలో
ఏ బరువు గుండెతో
ఎత్తుచున్నారో నీరాలు - తల్లి !

మూగి గోవుల చెంత
లేగ దూడల పొంత
రాగాలు పాడు వారెవరు ? - తల్లీ !

తొలి కారుమబ్బు తు
న్కల లేత గొంతుకలు
పిలుచునా నను ఇపుడు కూడ? తల్లి !

(అంత మెల్లగా ధనరాజు ప్రవేశిస్తాడు. చిరుబొజ్జ, వంకరనవ్వు, అతి వినయం అతడి లక్షణాలు. అతణ్ని చూడగానే సస్య లేచివెళ్ళి అతడి చేయి పట్టుకొంటుంది. ఆవేశంతో అడుగుతుంది.)

సస్య :

పోదమా ఇక ! తల్లి తోటల
పూలు వాడక ముందె పోదము !
తెచ్చితివె గాలోడ ? పోనీ -
వచ్చితివె సిద్ధముగ --?

ఆగలేనిక, నిమిషమైనా
సాగదీ బ్రతుకే విధముగా
రమ్ము వెల్తురులోకి, ఇటు రా
నిమ్ము కొంచెము ప్రాణ వాయువు.

తల్లి పొలముల జేర్తునని వా
గ్దాన మొనరిచి తెచ్చినాడవు ;
మాట తప్పిన వాడు మానవ
మాత్రు డెట్లగును ?

ఆగలేనిక నిమిషమైనా,
సాగి పోదము లెమ్ము, సోదర !
నభోయానము లెందులకులే,
నడచియే పోవచ్చులే !

ధనరాజు :

ఎక్కడికే ? సఖి ! ఎక్కడికే ?
ఎందులకే ఆ కంగారు?
ఎంత దూరమా పల్లె పొలాలు ?
ఎపుడు పడితె అపుడే పోవచ్చు.

ఏ నెరుగనె ! ఆ పల్లెటూళ్లలో
ఏ మున్నదె? గుడిసెలు తప్ప !
నేల దున్నుకొను రైతు కోస మీ
గోల దేనికే ? బాలా !

(నవ్వుతూ, తాను తెచ్చిన నగల పెట్టెను తెరుస్తాడు. అందులో నంచి ఒక్కొక్క నగనే తీసి చూపుతాడు.)

ధనరాజు :

చూడు మివిగో చెలీ ! చూడు మివిగో చెలీ !
సుందర స్వర్ణభూషలు చూడుమో చెలీ !

ఇంత కంటే నీ పొలాల పంటల మంచి
వేముండునే? చెలీ !

వాడిపోయే పూలు, వట్టిపోయే ఆలు,
పూడిపోయే దొరువు లేలనే ? ఓ చెలీ !
హేమమ్మునకు మించి ప్రేమించదగు వస్తు
వేమున్న దిల ? చెలీ !

రాణివలె నుందువీ రత్నాల చీరతో,
రంభవలె నుందువీ రవల నెలవంకతో,
దైనందిన క్షణ క్షణ సుందరాకర్ష
ణానంద జీవితమె జీవితము, ఓ చెలీ !

నన్ను ప్రేమించవె, నా యింట నుండవే,
నిన్ను దేవతగ కొల్తునె, చెలీ !
స్వర్గమందును లేని సౌఖ్యాలు నీ కిత్తు
సానుకంపను చూపవే, చెలీ !

సస్య :

చచ్చితిపో; నీకు కూడ
వచ్చినదీ ప్రేమ తెగులు;
మారిపోయినవి రోజులు,
తీరిపోయినవి ఆశలు !

ఎందుకు నాకీ బరువులు ?
ఇనుప పెట్టెకే తగు నివి;

అలతి తీగ కిన్న నీళ్ళు
చిలికిన చాలు చిగుర్చగ.

అవనికి అన్నము పెట్టెడి
అన్నపూర్ణ గ్రామసీమ,
అన్న మొసగు తల్లికన్న
అందమైన దేవి లేదు.

తల్లి నిపుడు నిందించి కృ
తఘ్నుడ వైతివి, సోదర !
మేలు మరచు ఇంట నుండ
జాలను, నే భూపుత్రిని.

మినపచేను నడుమ తుగ్రు
మను పూరే డెంతటి స్వే
చ్ఛా జీవియొ ! అందులోన
సగమైనను కాను నేను.

ధనరాజు :

పూరి పొలములోని
పూరేడు జీవితమె
మనుజ జీవిక కన్న
మంచిదని యందువా ?

సర్వసృష్టిని మనుజ
జన్మమే ఉత్తమము,

విత్తమ్ము కల్గినది
ఉత్తమోత్తమము.

ధనికునకు లోకమే
దాసీతనము చేయు,
మనుజునకు లక్ష్యమ్ము
ధన సేకరణమె.

ధనవంతుడను నేను
ధరణీశ్వరుడ నేను
నీ వంటి లక్షమం
దికి ప్రేముకుడ నేను.

("ఆసలతో, బాసలతో, మీసలతో మెలకువగా, పై మెరుగులు చూపి స్త్రీని, పట్టి భుజము తట్టవలయు" ననుకుంటాడు, నాట్యభంగిమలో ఆమె చుట్టూ తిరుగుతాడు, ప్రాధేయపడుతూ.)

ధనరాజు :

ఇలను కల్గిన మేలిరత్నా
లేరి కూర్చితి, ప్రేయసీ !
పదము లొత్తగ స్వర్ణరమనే
పట్టి తెచ్చితి, ప్రేయసీ !

ఎన్ని భోగము, లెన్ని రాగము,

లెంత సౌఖ్యమె ! ప్రేయసీ !

కాల ద్రోతువు, నల్లరాతివా !

కట్టె పుల్లవా ? ప్రేయసి !

పంత మేలనే, ప్రేయసీ ! నీ
చెంత జేరితి, ప్రేయసీ;
లక్ష్మినీవే, ప్రేయసీ ! నా
లక్ష్యమీవే, ప్రేయసీ !

(కౌగిలించుకోబోతాడు. ఆమె పరిగెత్తుతుంది. అతడు వెంట బడతాడు. ధనరాశుల్ని చిమ్ముకొంటూ పరిగెడతారు. ఆమె ఒక ధాన్యరాశి మాటున దాగుతుంది. అతడు వెతుకుతూ నిష్క్రమిస్తాడు. ఆమె లేచి, ఇటు అటు చూచి పరిగెత్తబోగా, ఇనుపపెట్టి తగిలి బోర్లపడుతుంది. అంతలో ఆమెను పడకుండా పట్టుకొంటుంది - ధనలక్ష్మి. ధనలక్ష్మి మూర్తి స్వయం ప్రభను పోలి ఉంటుంది. సస్య ఆమెను ఇప్పుడు గుర్తుపట్టి, ఆశ్చర్యపడి, అంజలి ఘటిస్తుంది.)

ధనలక్ష్మి :

ఆగుము తల్లీ ! ఆగుము తల్లీ !
ఆగడమేలా ? అలసటయేలా ?
శ్రీదేవినె అచ్చెరు వొనరించె
చీనా సిల్కులు, చిత్రభూషలు
దేశ దేశముల తెలివి తేటలు,
హస్తనైపుణ్యములు, అందపు తళుకులు,
పొలాలు, గనులూ ప్రోవులుగా పం

డిన ధాన్యా, లెంచిన మణి రాశులు,
ముద్దుగ నీకడ మోకరిల్లగా -

నీ సేవకు వేంచేసి యుండగా -
ఆనందముతో, అధికారముతో
ప్రాపంచకమునె పరిపాలించక
ఎక్కడికే పరువెత్తెదు ! తల్లీ !

సస్య :

జనపదములలో సస్య

శ్యామల మూర్తివి నీవు !
పీడిత జనములకీ గతి
తోడుగ పర్యటింతువో !

నగరమ్మున నీ యాకృతి
నవ నవ లావణ్యయుతము,
వ్యథితుల కాశాకిరణ
ప్రసరణ మీవే నేమో !

విశ్వమెల్ల వేడుకగా
వినోదించు శివమూర్తి!
ఏల నిచట ఎండకన్నె
యెరుగని ముత్తైదు వైతి ?

ధనలక్ష్మి :

మనుజుడు నా ప్రియసుతు, డా
తని సుఖమే నా సుఖమ్ము;

సేవచేతు నతనికి నా
జీవితమే ధారపోసి.

నీ వాతని జీవిత సుఖ
జీవనమవు ; పురుష పదా
ర్థము నీవే, కావున నీ
ప్రణయము నతడాశించును.

అతడెందును నీ కోసమె
ఆరాటము పొందుచుండు,
అతని నిన్ను చూచుకొనుచు
ఆనందింతును నేను.

పల్లెలలోని ప్రశాంతత,
పట్టణముల లోని రొద,
అంతఃపురము కుట్రలు,
అన్నియు నా కొకటేనే.

సస్య :

ప్రకృతికి మాతవు, నీవే
పనికిమాలిన ట్రీ గతి
నరునికి లోబడి పోవగ
నడచునె అతడు భువిపై ?

నీ వాత్సల్యము లోగొని,
నీ లోకువ నుద్యమించి,
విక్రమించి, విజృంభించి
విలయాగ్ని రగుల్కొల్పడె !

ముష్టి యుద్ధముల మొదల
మ్ముల పోరాటముల నుండి
"వీటూ"లను గడిచి నేడు
"ఆటం" యుగమును తెచ్చెను !

ఇరుకేలను మృత్యువునే
విరజిమ్ముచు, స్వనాశనము
నీ నాశము కూడ తెచ్చి
నిప్పు కణముచేయు భూమి.

ప్రజా పీడనమె నరునికి
పరమ వినోదమ్మయ్యెను,
పరహింసను గా కాతడు
పరితృప్తిని పొందడయ్యె.

ఏలా పెంతువు వీనిని ?
ఏమున్నది వీనిలోన?
కుసుమారామములు వీడి
కుంగనేల ఇతని కొరకు ?

ధనలక్ష్మి :

నీవు చెప్పిన దెల్ల
నిజమేనె, సస్య !

నరుడంతగా స్వార్థ
పరుడౌట కేది హే
తువొ, ఇంత తలపోసి
తివె ! సస్య !

నీవె కారణ, మతడు
నీ కొరకె ఇన్ని గొడ
వలు పడును, ఇన్ని వం
తలు పొందు, ఇన్ని త్రో
వలు త్రొక్కు ఇన్ని హిం
సలు చేయునే, సస్య!

నీవు పూర్తిగ ఆత
నికి లభ్యమైనంత,
నిశ్చింతగా నతడు
నీ తోడ నుండి పో
వును, ప్రేమరాజ్య మే
లునె, సస్య !

సస్య :

ఏమి వాకొను చుంటివే, జన
నీ ! కుమారుని వెనుక వేసుక ?
పుత్ర వాత్సల్యమ్ము నీకును
ధాత్రి ! గ్రుడ్డితనమ్ము తెచ్చెనె ?

ధనలక్ష్మి :

నేడు గుర్తించితివి కావున
నీకు నన్నెరిగింతు నిప్పుడు,
దేవి ! నీ హృదయాంతరంగపు
దివ్వె నే నేను.

పల్లెపొలమున, పాతగుడిసెను
ప్రమిదలో చిరువత్తి నేనే,

నగరమున మణి దీప మేనే,
జగతి కంతకు రవిని నేనే.

రశ్మి ఒక్కటెయైన, ఆధా
రమును బట్టి ప్రకాశ ముందును,
ప్రకాశమ్మును బట్టి ఓజః
ప్రాభవమ్ముండు.

విశ్వ పరిణామమున జరిగే
విప్లవమ్ముల నేది వికసన
మంది ముందుకు సాగునో నా
కది ప్రధానాలయము సుమ్మా !

శక్తిహీనుల పట్ల నా కొక
సానుభూతియె కలదు కానీ,
నాకు నిత్య వికాస మొసగే
నవ్యతను బలపరతు నేను.

మంచితన మొక్కటియె కా, దు
న్మాద శక్తియు కొంత వలయును.
సత్యమును రక్షించుకొను పటు
సత్త్వమును వలయు.

శక్తికలదే ముందుకేగుము,
శక్తిలేనిది అణగిపోవును,
సత్యమెరిగియు, పూన రేలను
శక్తి సాధనకు ?

పల్లెలో నీవున్న నుంటిని.
పట్టణములో నున్న నుంటిని.
విశ్వ వీధులకేగు, మెందుకు
వెంట రాకుందు ?

సస్య :

దుఃఖమున పడియున్న కతమున
తూలనాడితి నిన్ను తల్లీ !
నను క్షమింపుము, మూర్ఖురాలను
వినయ మెరుగని బేలను.

తల్లి ! నిను గుర్తించి నేటికి
ధన్య నైతిని; నీవు నేనును
ఒక్కరమె అను భావ మిప్పుడు
ఊరడించె నను.

నీవు నా హృద్దీపికవుగా
నేను విశ్వము నిండ వెల్గుదు,
వెలుగులో పదునాల్గులోక
మ్ములు, త్రికాలమ్ములును మేల్కొను.

కలిసి పొమ్మా, తల్లి ! నాలో;
కరగనిమ్మా నన్ను నీలో;
ఒక్కరముగా నుండి మనజుని
ఉద్ధరింతము క్షణములో !

(సస్య కేలు మోడ్చి మోకరిల్లుతుంది. ధనలక్ష్మి, సాక్షాత్తు స్వయంప్రభా రూపంలో నాట్యం చేస్తుంది.)

ధనలక్ష్మి :

పరిణామ మేక్షణము
ప్రాభాత ముఖమోయీ !
అడుగడుగునా దాని
కభ్యుదయ మేనోయి !
బ్రతుకు తెర్వులలోని తెర్వరీ !
ప్రగతిలో లేదే విభావరి !

మొగ్గతొడిగిన తీవ
సిగ్గు పడునా పూవ ?
చివుకు టాకు మొదల్లె
చివురాకు పుట్టిళ్లు.
పూర్ణ విశ్వము నీ విభూతి !
ప్రొద్దు పొడుపేనోయి నీ ద్యుతి !

నిరుడు పాడిన పాట
నేడు పాడిన పాట
కొత్తదో, పాతదో
కోకిల యెరుంగునా ?
విశ్వగమనము పోటి పందెము,
విజయ శీలతకె బహుమానము.

వర్గములు గడిచి, భువి
స్వర్గమే యగుదాక,

అడుగు నిలుపకుమోయి !

ఆయాస పడకోయి !

అపజయము లేదు కించిత్తు,

ఆనందమే భవిష్యత్తు !

(ఆడుతూ, పాడుతూ ఆమె అదృశ్యమైపోతుంది. సస్యలో లీనమైనట్టు కనిపిస్తుంది. అంతలో తెరలో పెద్ద కలకలం బైలుదేరుతుంది. సస్య తలయెత్తి చూస్తుంది.)

## పదునారవ రంగం

(అది ఏ ప్రాంతమో ! ధనరాజు మందిరానికి సమీప ప్రాంతమే కావచ్చు. క్షేత్రయ్య, భూలక్ష్మి, తదితరులు సస్యను వెతుకుతూ బైలుదేరి వస్తుంటారు. పవలు, రాత్రి అనే భేదం లేకుండా వారు వెతుకుతున్నారు. వారికి ఏదో ఒక వెలుగు దారిచూపుతున్నట్టు దూరంలో కనిపిస్తూ పోతున్నది. భూలక్ష్మి అలసిపోయింది.)

భూలక్ష్మి :

ఎచ్చట వెదకిన, ఎంతగ వెదకిన

ఏ జాడయు లేదో నాథా !

ముద్దుల సస్య, మురిపెపు సస్య

ముంచెను దుఃఖములో, నాథా !

చిన్నది లేని, కన్నెపొలాలు

చిన్నవోయినవి, ఓ నాథా !

ఇక కొన్ని నాళ్ళు, ఈమె లేనిచో
ఎండిపోవునో, ఓనాథా !

క్షేత్రయ్య :

దుఃఖపడకె, ప్రియురాలా !
తూలిపోతి విప్పటికే ;
అదిగో, ఆ దీపకళిక
ఆగినట్టు లున్న దచట !
సస్య ఎచటనున్న అచట
సకల సంపదలు నుండును,
సకల దేవతలు నుందురు,
సంతోషము వెల్లివిరియు.

పిలుపు దూరముననే కని
పించవచ్చు మన తల్లి !
చూడుము, ఈ ప్రాంత మెంత
శోభాకరముగ నున్నదా !

పువుబోణీ ! అటు చూడుము !
ఎవరా వస్తున్నవారు ?
ఎవ్వరి కొరకో మనవలె
తెర్వరులైనట్టివారు !

(అటు వచ్చేవారిని ఎవరినో కలుసుకోవడం కోసం అందరూ నిష్క్రమిస్తారు. రెండవవైపునుంచి మేధానిధి ప్రవేశిస్తాడు. నీర్సంగా, విచారంగా వుంటాడు. బడలి

వుంటాడు. ఎంతోకాలంగా సస్యను వెదకుతున్న వాడిలా కనిపిస్తాడు. ఏదో ఒక దీపపు వెలుగు నడిపించుకు వచ్చింది అతడిని.)

మేధానిధి :

ఎందు కల్గును సస్య ?
ఎచట వెదకుదు నింక ?
ఏమైనదో నాదు
ప్రేమజీవన పాత్ర !

ఏ యెడారుల నెండిపోయెనో !
ఏ గొందాముల నింకి పోయెనో !

మేరుగిరి మెట్ట ము
మ్మారు వెదకితినే --
ధ్రువ ప్రాంత మినుమారు
దున్ని వైచిత్రినే --

ఏ కొండపై ఆగియున్నదో !
ఏ మండువా దాగి యున్నదో !

ఏడేడు లోకాల
నెటనున్న దొరకదా ?
బ్రతికి లేదేమొ ! నా
ధ్రుతి లోపమేమో,

ప్రేమ సిద్ధికి స్నేహమందదో !
నా మార్గపుం జ్యోతి చాలదో !

(అటూ, ఇటూ దృక్కులు సారిస్తాడు. స్మృతి నభినయిస్తాడు. స్ఫూర్తిమంతు డవుతాడు. ముఖంలో ఆశాజ్యోతి వెలుగుతుంది.)

మేధానిధి :

ఇందుముఖి ! నా సఖి ! మనోహరి
ఇందు మసలినజాడ లున్నవి !
ఈ మహాసౌభాగ్య సంపద
లామె సన్నిధి దీప్తులే ?

పాపకర్ముడనంత ధనమును
పాతిపెట్టిన కృపణుడే-- నా
చెలువ దొంగిలి తెచ్చి, ఖైదీ
జేసెనో ఇచట !

నందనమ్మును మించు గ్రామము
నందె సుందరముగ సుమించిన
పుష్ప కన్యను పుడికి తెచ్చిన
మూఢునికి ఇది తగిన శిక్షయె !

నా అకార్యము త్రాచు పగయై
నన్నె యెదలో కాటు వైచెను,
గ్రామ జీవన సుధ గొని పునః
ప్రాణు నౌదు నిక.

ఏది నా ప్రియురాలు, సస్య ?
ఎందు దాచితి వోరి దస్య ?
తెమ్ము ఇప్పుడె; నిన్ను మృత్యువు
కమ్ముకొను ముందె.

(అప్పుడు మెల్లగా, గంభీరంగా ధనరాజు ప్రవేశిస్తాడు. మేధానిధిని అతడు ఎరుగును. అతని ప్రతిభా సహాయంతోనే ధనరాజు అంత ధనాన్ని కూడబెట్టగలిగాడు. అదంతా తన తెలివివల్లనే కూడిందనుకొంటున్నాడు, ఎవర్నీ లెక్కచెయ్యకుండా తిరుగుతున్నాడు. చివరకు సస్యను కూడ అపహరించాడు. ఇంతచేసి, చిరునవ్వు నవ్వుతాడు, మర్యాద చూపుతాడు. పరమ లౌక్యుడు.)

ధనరాజు :

ఎపుడు వచ్చితి వోయి, ధీ నిధి !
ఎన్నొ దివసములయ్యె నిను గని !
రమ్ము, కూర్చుండుము, సుఖంబే
రాజు, రాణియు, రాజ్యమున్ ?

చూపుదును మా ఉప వనమ్ములు,
చూపుదును మా దేవిడీలు,
ఎల్ల నీ మేధో విశేషము
లే కదా, ఏముంది క్రొత్త ?

పల్లె పట్టుల, పట్టణమ్ముల,
కొల్లలుగ మా సరకులున్నవి.
కొంచు పోదువుగాని, నీకే
కొదువచేయము, రమ్ము లోనికి.

మేధానిధి :

నీ వనమ్ములు, నీ గృహమ్ములు,
నీదు యంత్రగారములు నే
చూడ రాలేదోయి, రాజా !
చూపు మెచ్చుట కలదొ సస్య!

రాజులకు, రాణులకు కాలము
రాలిపోయెను, తిరిగి రాదిక ;
పట్నముల మోజును గతించెను.
పల్లెలదె ఇక భావి కాలము.

సర్వ సంపచ్ఛోభితములై
జన పదమ్ములు వరలగల విక.
ప్రకృతి శక్తులు వెలసి పల్లెల
పనులె చేయు నిక.

పని తనము, సోమరి తన మ్మని
పక్షపాతము లుండ వింక;
ధనికు డనియు, దరిద్రు డనియు, అ
ధర్మ పద్ధతి సాగదింక.

ఎల్ల రేక కుటుంబమ్మై, జగ
మెల్ల నొకటే రాజ్యమై, స
ర్వోదయ సమాజమ్ము వెలసే
రోజు వచ్చెను, కనులు తెరువుము !

ఏది చూపుము సస్య, ఎట నే
గాదె మాటున దాచినావో ?
జనత మేల్కొని సాగి వచ్చెను.
సాగవిక నీ యాట లేవియు.

మంచితనముగ తెత్తువా ? నా
మంత్రబలమును చూతువా ?
లొంగి పొమ్మిక, లేదు లాభము;
లోక విప్లవ మహోల్బణ మిది.

(ధనరాజు వికటాట్టహాసం చేసి కనురెప్ప అల్లారుస్తాడు. అతని నేత్రాల నుండి అణు కిరణాలు మండుతున్న ఉక్కుతీగలవలె భగ్గు భగ్గున లేస్తాయి. మేధానిధి చిరునవ్వు నవ్వుతాడు. అతడి చిరునవ్వు నుండి వెల్వడిన ఆత్మజ్యోత్స్న వెన్నెల తుంపురుల వలె ప్రసరించి, అణ్వగ్నిని ఆర్పి, ధనరాజు నెత్తురులో ప్రవహిస్తుంది. అతడు వడవడ వణకిపోతాడు. అంతలో ఇరు ప్రక్కలనుండి క్షేత్రయ్య, భూలక్ష్మి, ఒకే రకం దుస్తులు ధరించిన చాలమంది ప్రజలు కోలాహలంగా ప్రవేశిస్తారు. అందరూ ధనరాజును ముట్టడిస్తారు. కాని, అతని వణుకు చూచి వెనక్కుతగ్గుతారు. అంతలో సస్య అక్కడికి వస్తుంది పరుగెత్తుకొంటూ. ఆమె చిక్కివున్నా, మహా తేజశ్శాలిగా వున్నది. నవ్వుతూ మేధనిధితో కరచాలనంచేసి, తల్లిదండ్రుల పాదాలకు నమస్కరిస్తుంది. ధనరాజు వంక చూచి, దయతో అభయహస్తం ఎత్తుతుంది. అతడి వణకు తగ్గి, అతడు సాష్టాంగ పడతాడు. లేచి, తలవంచుకొని నిలబడతాడు. అప్పుడు సూరన్న, చంద్రన్న చెరొక ప్రక్క నుంచి ఉత్సాహంగా పాడుకొంటూ ప్రవేశిస్తారు.)

సూరన్న :

ప్రభాత మయ్యిందోయ్ !
ప్రబుద్ధ మయ్యిందోయ్ ! జగము !

చంద్రన్న :

నవ సమాజమున కభ్యుదయం !
నవ మానవతకు నవోదయం !

సూరన్న :

సత్య జీవనం, సర్వజనీనం,
సర్వోదయ సౌభాగ్య భాజనం !

చంద్రన్న :

ప్రభాత మయ్యిందోయ్ !
ప్రబుద్ధ మయ్యిందోయ్ ! జగము !

సూరన్న :

కుటిల నగరాలు, కుగ్రామాలు,
కోట్ల లాభాలు, కుంచిన బ్రతుకులు
పాత పోటీలు, పోరాటాలు.
భూత కాలమై ముగిసినవోయ్ !

చంద్రన్న :

సుమధుర సుమధుర
సుందర వనమిది
రమణీయ కళా
రచన మిదోయ్ !

పూవులుగా -- వన
దేవతలముగా,

నవ విశ్వ రథం
నడుపుద మోయ్ !

సూరన్న :

ప్రభాత మయ్యిందోయ్ !
ప్రబుద్ధ మయ్యిందోయ్ ! జగము !

రాజకీయ తీ
ర్మానం కాదిది,
కాదిది ఆర్థిక
కార్యక్రమము;
వేదమాత మన
కాదేశించిన
అఖిల జగ శ్రే
య స్వరూప మిది
శ్రేయో రాజ్యపు
ప్రేమ మూర్తి యిది !

చంద్రన్న :

ప్రభాత మయ్యిందోయ్ !
ప్రఫుల్ల మయ్యిందోయ్ ! జగము !

ఇద్దరూ :

కదలండిక మన గ్రామ సీమలకు
కల్యాణోత్సవ గీతులతో,
ప్రబుద్ధ మయ్యెను జగము --
ప్రఫుల్ల మయ్యెను జనము--

(అందరూ ఈ చివరి గీతాన్ని బృందగానం చేస్తారు. అంతలో రంగం మీదికి ఒక అపూర్వ తేజస్సు ప్రసరిస్తుంది. అందరూ నలువైపులూ పరికి స్తారు. అప్పుడు ఆడుతూ పాడుతూ స్వయంప్రభ ప్రవేశిస్తుంది. అంతకు ముందెన్నడూ లేని మహాకాంతితో ధగధగలాడిపోతూవుంది. ఆమె సూర్యమకుట, చంద్రతిలక, తారకాహార. ఆమె రాకతో అందరూ వెనక్కి తొలిగి నిలుస్తారు. ఆమె నృత్య భంగిమలో సస్య చేతిని గ్రహించి, తరువాత మేధానిధి చేతిని గ్రహించి, ఆ రెంటినీ కలుపుతుంది. ఆ ఇద్దరూ ఆమెకు నమస్కరించి, వెనుకకు తగ్గుతారు. స్వయంప్రభ ప్రజలకు చివరి ప్రబోధం చేస్తుంది.)

స్వయంప్రభ :

ఇప్పటికొక చుట్టుముట్టి
ఏతెంచె జగచ్చక్రము,
ఇక పురోగమించవలయు
ఇచ్ఛా మార్గముల వెంట.

పాశవ శక్తుల జయించి
ప్రగతిని సాధించినాడు.
పతనము కాకుండగ కా
పాడు కొండు జాగ్రత్తగ.

తామే లోకమ్మున కా
ధార మంచు దలప బోకు
డెవ్వరు, తద్గర్వములో
రవ్వంతయు లేదు నిజము.

మీ తాతల వంటివారు
మృత్తిక పాలైపోయిరి,

హిట్లరంత డిక్టేటరు
ఏమైనాడో తెలియదు.

లోకమాగ దెవరికొరకు,
లోభత్వము చెల్లదింక;
ముందుకు పోయినవాడే;
ముద్దు బిడ్డడా శక్తికి.

కార్మికుడో, కర్షకుడో
ధార్మికుడో, ధీమంతుడొ
విప్లవలత కొసకొమ్మల
వికసించిన వాడె శివుడు.

శివతేజము లక్ష్యముగా,
జీవులెల్ల నొక్కటిగా,
ఆనందోత్సాహాలతొ
అరుగు డింక గ్రామమునకు.

గ్రామమ్మే కేంద్రముగా
ప్రేమమ్మును పండింపుడు,
విశ్వ విహారము సల్పుచు
విశ్వాత్మను మేల్కొల్పుడు.

(ఎల్లరు జోహారుజేసి నిష్క్రమిస్తారు. స్వయంప్రభ మేధానిధి కేలు పట్టుకొంటుంది. మేధానిధి సస్యకేలు పట్టుకొంటాడు. ఆమె వారిద్దరినీ ముందుకు నడిపించుకపోతూ నృత్యం చేస్తుంది. వారిద్దరూ ఆమె ననుసరిస్తారు.)

స్వయంప్రభ :

గ్రామమ్మున కిది పునారా
గమ నోత్సవము,

ప్రేమమ్మున కిది కల్యా
ణామృత రసము !

పుణ్యపురుషుడై మళ్ళీ
పుట్టినాడు మానవుడు

ఆవర్తక్రమము మీది
యంతస్తున నేడు !

ఇలా కావ్యమున మానవు
డిక నొక ప్రియ గీతి ;

సమాజమున లేదిప్పుడు
స్వపర భేదభీతి !

విశ్వ కిరణమే వినోద
విమానముగ తేలి

విహరింపుడు తారాంతర
వికసిత వనకేళి !

కళలై మనుజుని కలలకు
కలిగింపుడు రూపు,

రూపు దిద్దుకొని మీకై
దీపించును రేపు !

రమ్య చంద్రికా తరంగ
రసావర్త వితతి

సదా మీ కొసంగుత సత్
చిదానంద సుగతి.

(తెర మెల్లిగా జారుతుంది. పద్మగంధం ఎల్లెడ వ్యాపిస్తుంది. సప్తలోకాలు సప్తస్వరాలై పలుకుతాయి. ఆనందంలో సహృదయ జగత్తు పరవశమైపోతుంది.)

సమాప్తం

* * *